# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి: 10 సంచిక: 1

సలహాదారులు, స్ఫూర్తిదాత...

కర్త, కర్మ, క్రియ.. మా ప్రభు...

తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు

ప్రధాన సంపాదకులు:

పుల్లగూర్ల సాయిరెడ్డి

(గోవింద దాసు)

గౌరవ సంపాదకులు:

డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

ఫోటోగ్రాఫర్ : పత్తి సుబ్రహ్మణ్యం, శ్రీనివాసమంగాపురం

డి.టి.పి. & డిజైన్ : సాయి రమేశ్

Websites: www.srivenkatesham.org
www.svmmpeetham.org

Emails : srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com

Phone : 040-27175050

Cell : 9348212354

ముఖ చిత్రం: శ్రీవారు


లోపలి పేజీల్లో...


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| శ్రీ భగవద్గీత ముక్తిప్రదాత | 6 |
| నవవిధ ముక్తిమార్గాలు-స్మరణ ప్రాశస్త్యం | 18 |
| శ్రీవారి భక్తులు | 22 |
| మకర సంక్రాంతి | 24 |
| శ్రీ మహాభాగవతం | 28 |
| భజగోవిందం | 36 |
| తిరుమల యాత్ర | 38 |
| ధనుర్మాసం - గోదాదేవి లక్ష్యసిద్ధి | 42 |
| భగవద్గీత | 45 |
| ఉత్తరాయణం | 51 |
| మహాభారతంలోని రసవద్ఘట్టాలైన జాతీయాలు, సామెతలు, కథలు | 52 |
| శ్రీ విష్ణు పురాణం | 56 |
| వడుపూరు శ్రీరామస్వామి | 58 |
| శబరిగిరి అయ్యప్ప | 60 |
| మహిమాన్విత పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం | 62 |
| రాశి ఫలితములు | 64 |
| మీ విజ్ఞానం | 65 |
| మానవత | 66 |


## సంపాదకీయం

# సాధన

శ్రీ వేంకటేశం పాఠకులకు, ఏజెంట్లకు మరియు శ్రీవారి భక్తులందరికీ నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు. ఈ సంవత్సరంలో మీరు మీ కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులందరికీ మన ప్రభువైన తిరుమల శ్రీ వేంకటేశ్వరుని కృప సంపూర్ణంగా లభించి ఆయురారోగ్యంగా సుఖ జీవనం లభించగలదని ఆశించుచున్నాము. 'శ్రీవేంకటేశం' మాసపత్రిక కూడా ఈ పేరుతో ప్రచురించడం 10 సం॥లు పూర్తి చేసుకొని 11వ సంవత్సరంలోనికి అడుగిడిన సందర్భంగా ఈ సేవాభాగ్యాన్ని ప్రసాదించిన మా ప్రభువైన తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి శతకోటి ప్రణామాలను అర్పించుచున్నాము.

జీవికి మానవ జీవితము లభించడము ఒక వరం లాంటిది. ఇది జన్మ జన్మల జీవిన మార్గములో ఒక పరీక్షా సమయము, ఈ పరీక్షలో నెగ్గినవాడు భగవంతుని చేరుతారని, జనన మరణ చక్రబంధం నుండి బయట పడతారని పెద్దలంటారు. అందుకే అదృష్టవశాత్తు లభించిన ఈ మానవ జన్మను అందరూ సార్థకం చేసుకోవాలి. ఈ పరీక్షలో ఉత్తమ శ్రేణిలో ఉత్తర్ణులవ్వాలి. భగవంతుని సాన్నిధ్యాన్ని పొందాలి. ప్రతివారు భగవంతున్ని ఆరాధించుట, పూజించుటకంటే కూడా ఆయనను సాధన చేయుట ఉత్తమమైన పద్ధతి. పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడానికి ఎలాగైతే విద్యను సాధన చేయుదుమో! సివిల్ సర్వీస్ మొదలగు పరీక్షలకు ఏ విధంగా సాధన చేయుదుమో భగవంతుని గూర్చి కూడా అదే రీతిలో సాధన చేసినవారు ధన్యులుగా మిగులుదురు. సదా భగవన్నామ స్మరణ చేయువారికి జీవితములో ఎదురయ్యే ఆపదలను భగవంతుడే తీర్చగలడని, ఆ ఆపదలను చూచి భక్తుడు భయపడ అవసరము లేదని పెద్దలంటారు. మనము భగవంతునివైపు ఒక అడుగు వేస్తే చాలు ఆయన మనవైపు పది అడుగులు వేస్తాడని, భక్తుడెప్పుడు ఎంతటి విపత్కాల పరిస్థితులలో కూడా విచలితుడు కాకుండా శ్రీమన్నారాయణ స్మరణ చేస్తూ జీవితాన్ని ధన సంపాదన కోసమని, బంధుమిత్రుల కోసమని, కుటుంబం కోసమని, లేక కీర్తిప్రతిష్టల కోసమని పూర్తిగా వినియోగించక వీటితో పాటు సదా భగవంతుని స్మరణ, చింతనలతో జీవించుట ఉత్తమము. మనలను కాపాడుటకే శ్రీమన్నారాయణుడు తిరుమల కొండపై అద్భుతమైన, ఆనందదాయకమైన రూపంలో శ్రీవేంకటేశ్వరునిగా వెలచారు. ఆయన్ను తనివితీర స్మరించుతే మన పాపాలు నశించిపోతాయి. ఆయన్ను దర్శించితే ముక్తి కలుగుతుందని పెద్దలంటారు. అంతటి అదృష్టవంతమైన అవకాశము ఈ జీవితానికి లభించినప్పుడు, దీనిని ఎవ్వరు కూడా వదలకుండా సద్వినియోగం చేసుకుంటూ ప్రతిక్షణం ఆయన్ను స్మరించుచు, వీలైనప్పుడు తిరుమలకెళ్ళి ఆయన ముగ్ధమనోహర రూపమును దర్శించి, అదే రూపాన్ని మన హృదయమందు బంధించి సదా చూసుకుంటూ జీవించుట ఉత్తమము. వీలు కలిగినప్పుడు శ్రీ వేంకటేశ్వరుని మహామంత్ర లిఖిత జప పుస్తకములను మా నుండి పొంది లేదా మీ వద్ద కల ఏదేని పేపరుపైన వ్రాయుచు ఆయన్ను సదా స్మరించుచు జీవించువాడు తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి ప్రియుడు. ఈ జన్మను ధన్యము చేసుకున్నవాడగును.

నమో వేంకటేశాయ

వినా వేంకటేశం న నాథో న నాథః।
సదా వేంకటేశం స్మరామి స్మరామి॥

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

పుల్లగూర్ల సాయిరెడ్డి (గోవింద దాసు)

శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం వారి

**శ్రీ వేంకటేశం**

ఆధ్యాత్మిక మాసపత్రిక

| చందా వివరాలు | |
|---|---|
| 1 సం॥ | ₹ 200.00 |
| 3 సం॥ | ₹ 500.00 |
| జీవిత చందా | ₹ 2,500.00 |
| పోషకులు | ₹ 5,116.00 |
| రాజపోషకులు | ₹ 10,116.00 |

చందాదారులకు
స్వామివారి పవిత్ర పాదాలు
(10"x8") **ఉచితం!!**

**శ్రీ వేంకటేశం** పేరు పైన
ఎం.ఓ / డి.డి / క్రాస్డ్ చెక్‌ను
ఈ క్రింది అడ్రస్‌కు పంపగలరు!

**లేదా**

**SRIVENKATESHAM,**
A/c. No S.B: **11002191002593,**
(RTGS Code: ORBC 0101100 )
Oriental Bank of Commerce,
Habsiguda, Hyderabad.

**లో చేరునట్లు ఏదేని O.B.C. కాని, ఆన్‌లైన్‌లో కాని జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.**

పూర్తిపేరు.....................................
చిరునామా.....................................
.....................................
.....................................
............... పిన్‌కోడ్.....................
చందా వివరాలు ...............................
.....................................

**చిరునామా:**
**శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక,**
**ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,**
**హబ్సిగూడ, హైదరాబాద్-500 007.**
**ఫోన్: 040-27175050**
**సెల్: 9348212354**
Email: srivenkatesham@gmail.com



# శ్రీ వేంకటేశ్వర స్తుతి

**గుణపూర్ణత్వయోగేన బ్రహ్మ బ్రహ్మవశే స్థితా**
**బ్రహ్మాండాన్తార్బహిర్వ్యాప్తా స్థూలా సూక్ష్మా చ మధ్యమా ॥**
**కర్మణాం గుణరూపాణాం సర్వేషాం చ నియామికా**
**యుద్ధయాపాంగలేశేన త్వైహికీః సర్వసంపదః ॥**
**స్వర్విరక్తీశసత్భక్తిజ్ఞప్తిముక్తీర్వ జన్తి హి**
**లోకాతీతా లోకపూజ్యా తవాత్యన్తప్రియా మతా ॥**
**సర్వశక్తా సర్వసుఖా సర్వలక్షణసంయుతా**
**అనేకగుణసంపూర్ణా పూర్ణకామా చ సర్వదా ॥**
**అప్రమేయా ప్రమేయాఽపి సమస్త పురుషార్థదా**
**సుమహైశ్వర్య సౌభాగ్యా తథాఽపి త్వాఽనువర్తినీ ॥**
**స్మరతి ధ్యాయతి స్తౌతి నమత్యర్చతి పశ్యతి**
**తపతి త్వాం జపతి చ సేవతే త్వాం ప్రతీక్షతే ॥**
**నిత్యానపాయినీ నమ్రా సంప్రార్థయతి సర్వదా**
**కిముతాన్యేఽల్పజీవాశ్చ మాదృశా వృత్తివర్జితాః ॥**
**దరిద్రా బంధురహితా అనాథా జీవనార్థినః**
**తేషాం త్వత్ప్రార్థనాకాంక్షా నాశ్చర్యం భువనత్రయే ॥**

**భావం:** గుణ పరిపూర్ణత్వ యోగముచే తానే బ్రహ్మరూపిణియైనను నీ యధీనమున నుండగోరి నీతో సమముగ బ్రహ్మాండమునంతట అంత బహిః ప్రదేశము వ్యాపించి స్థూల మధ్యమ సూక్ష్మమ రూపిణియై మహాలక్ష్మి వెలయుచున్నది. గుణ రూపములగు సర్వకర్మలకు ఆయమయే నియామికయై యున్నది. ఆమె యొక్క కటాక్ష లేశ సంబంధముచే ఐహికములగు సకల సుఖములు అనహ పదార్థములందు విరక్తి భగవద్భక్తి ఆత్మజ్ఞానము మోక్షము సిద్ధించును. అట్టి లోకోత్తర గుణసంపద కలిగి లోకపూజ్యయగు మహాలక్ష్మి నీకు అంతరంగమహిషి యైనది. ఆమెయే సర్వశక్తి కలిగి సర్వసుఖ స్వరూపిణియు సర్వలక్షణ సంయుతయు సకలగుణ సంపన్నయు అవాప్తసమస్తకామయు అప్రమేయయైనను ప్రమేయ సౌలభ్యము కలిగి భక్తులకు సకల పురుషార్థముల నీయగా మహైశ్వర్య సౌభాగ్యశాలివగు నిన్ను వెంటనంటి నీతో సహాయభూతయై తిరుగుచున్నది. శ్రీమహాలక్ష్మి యెల్లపుడును నిన్నే స్మరించుచు స్తోత్రము చేయుచు అర్చించుచు తపస్సు చేయుచు జపించుచు సేవించుచు నీ సేవనే యెదురు చూచుచున్నది. నిత్యానపాయినియై యుండియు అతివినయముతో నీ సంశ్లేషమునే ప్రార్థించుచున్నది. అటువంటి సందర్భమున నిరాధారులగు నావంటి అల్పప్రాణులు నిన్ను సేవింపనాశ గలిగియుండుట సహజము. మేము దరిద్రులము, బంధురహితులము, అనాథలము, బ్రతుకులేనివాండ్లము. నిన్ను చేరి మా కొరతలను తీర్చుకొనుటకుగాను ప్రార్థించుటలో ఆశ్చర్యమేమున్నది?

సేకరణ: **డా. కె.వి. రాఘవాచార్య**

# ముక్తిమార్గము





## శ్రీరాగం

చదివితిఁ దొల్లి కొంత - చదివే నింకాఁ గొంత
యెదిరి నన్నెఱఁగను - యెంతైన నయ్యో! ॥ పల్లవి ॥

1. ఒరుల దూషింతుఁగాని - వొకమారైన నా
దురిత కర్మములను - దూషించను
పరుల నవ్వుదుఁగాని - పలు యోనికూపముల
నరకపు నామేను - నవ్వుకోను ॥ చది ॥

2. లోకులఁ గోపింతుఁగాని - లోని కామాదు లనెటి
కాకరి శత్రులమీఁదఁ - గడుఁగోపించ
ఆకడబుద్ధులు చెప్పే - అన్యుల బోధింతుఁగాని
తేకువ నాలోని హరిఁ - దెలుసుకోలేను ॥ చది ॥

3. ఇతరుల దుర్గుణము - లెంచి యెంచి రోతుఁగాని
మతిలో నా యాసలు - మానలేను
గతిగా శ్రీవేంకటేశుఁ - గని బ్రదికితిఁగాని
తతి నిన్నాళ్ళదాఁకా - దలపోయలేను ॥ చది ॥



పూర్వము కొంతవరకు చదివితిని. ఇంకను మరికొంత చదువుచునేయున్నాను. చదువగలను గూడ. ఎంత చదివినను ఎదుటివాని స్వరూప స్వభావములను గురించిగాని, నన్ను గురించిగాని ఇసుమంతయు తెలియజాలకున్నాను. అయ్యయ్యో! ఈ రీతిగా నా బ్రదుకు వ్యర్థమైపోయినది.

ఇతరులలోని తప్పులనెంచి వారిని పలుమారులు నిందింతును గాని ఒక్కసారియైన నేనొనర్చు పాపకర్మములను పరిశీలించుకొని నన్ను నేను నిందించుకొనను. ఇతరులు పడు పాట్లు చూచి నవ్వుదును గాని వివిధ యోని కూపములబడి నరకయాతన ననుభవించుచున్న నా శరీరమును చూచి నవ్వుకొనను.

ఇతర జనులపై చీటికి మాటికి కోపింతునే గాని నాకు బద్ధశత్రువులై నాలోనే దాగియున్న మాయావులైన కామక్రోధాదులపై కోపము జూపను. ఉపదేశము లొనర్చి పరులను ప్రబోధింతును గాని నాలోనే అంతర్యామియై యున్న శ్రీహరిని వివేకము నుపయోగించి తెలిసికొనజాలకున్నాను.

మాటి మాటికి ఒరుల దుర్గుణములు తలచి రోతపడుదును గాని నా చిత్తములో నెలకొనియున్న ఆశలు వదలలేకున్నాను. చివరికి శ్రీ వేంకటేశ్వరుని దర్శించి ఆయన అనుగ్రహముచే బ్రదికితిని గాని ఇంతవరకు ఆ దేవదేవుని మహిమను గుర్తింపలేనైతిని.

భావానువాదం:

శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య

## పరిచయము, గీత ముఖ్యోద్దేశ్యము

**భగవంతుడైన శ్రీకృష్ణ భగవానుడు మనకందించిన ఉపదేశయుత, జీవన విధానమే భగవద్గీత. సనాతన ధర్మమును బోధించు గ్రంథరాజమిది. సనాతన ధర్మమనగా శాశ్వత ధర్మము. ఇందలి సిద్ధాంతములు, ఒకే కాలానికి, ఒకే దేశమునకు, ప్రాంతమునకు, మతమునకు, వర్ణములకు, భాషకు, లింగమునకు సంబంధించిన ధర్మము మాత్రమే కాదు. ఇది విశ్వమానవాళి కందరికీ వర్తించునది. అనేక ధర్మ శాస్త్రముల సమ్మిళిత సారాంశమే భగవద్గీత. ప్రతి జీవిలో నిగూఢమై యున్న ఆత్మయే పరమాత్మ అను అంశమును తెలుపు ఉద్గ్రంథము. ఇది భారతీయ సనాతన సంస్కృతి పటిమను దిగంతములు చాటి విశ్వమానవ కళ్యాణానికై భగవంతుడిచే ప్రసాదింపబడిన వర రాజము. ఇది యొక యోగశాస్త్రము. జనులు స్వార్థబుద్ధిని వదలి, నిష్కామ బుద్ధితో కర్మల నాచరింపచేయుటయే దీని దివ్య సందేశము. గీత అంటే రెండు బిందువులను కలిపే ఒక రేఖ. ఇందు జన్మ అనేది ఒక బిందువు అయితే మరణమనేది మరియొక బిందువు. ఈ రెండు బిందువుల మధ్యగల గీతయే జనన, మరణముల మధ్య కాలము. అంటే జీవి యొక్క జీవన విధానము తెల్పి, జీవి ఎలా జీవించాలో, మరణమనే హద్దును ఎలా అతిక్రమించాలో వివరిస్తుంది గీత.**



# శ్రీ భగవద్గీత ముక్తిప్రదాత

**-హరి లక్ష్మీనరసింహారావు**

ఈ గీతను అధిగమించుటకు భగవానుడైన శ్రీకృష్ణ పరమాత్మ ముఖ కమలము నుండి గీతా శాస్త్రము ప్రవచించబడింది. అందుకే దీనిని "కృష్ణగీత" అని అంటారు. అనంతర కాలంలో ఇది భగవద్గీతగా ప్రఖ్యాతి నొందింది. సంస్కృత భాషలలో పలు వ్యాఖ్యాన గ్రంథాలు వ్రాశారు. అట్టివానిలో ఆదిశంకరులు సంస్కృత భాషలో వ్రాసిన వ్యాఖ్యానం ప్రపంచ విఖ్యాతియైంది.

**గీత పుట్టుక సందర్భము:**

ద్వాపరయుగంలో కౌరవ, పాండవుల మధ్య రాజ్యాధికార వారసత్వపోరు కారణంగా కురుక్షేత్ర యుద్ధం జరిగింది. ఇందు శ్రీకృష్ణ పరమాత్మ పాండవ పక్షపాతిగా, వారికి అండగా నిలిచి, ధర్మయుద్ధం "యతో ధర్మః తతో జయః" అన్నట్లు, ధర్తవర్తనులైన పాండవులకు విజయం చేకూర్చతలచి వారికి అండగా నిలిచాడు. కౌరవ, పాండవులకు మధ్య మహాసంగ్రామం జరిగింది. ఇరు పక్షాల యందు దేశీయ పాలకులెందరో తమ తమ చతురంగ బలసమేతులై నిలిచారు. కౌరవులు పదకొండు అక్షౌహిణుల సైన్యం, పాండవుల ఏడు అక్షౌహిణుల సుశిక్షిత సైన్యంతో యుద్ధసన్నద్ధులై యుద్ధభూమి

యందు నిలిచారు. ఈ యుద్ధం పదునెనిమిది రోజులు కొనసాగినట్లు మహాభారత గ్రంథం చెబుతోంది. ఇందు అతిరథ, మహారథులు, అర్ధ రథులైనవారు –

**శ్లో ॥ భీష్మ ద్రోణ తథా జయద్రథ జలాగాంధార నీలోత్పలా**
**శల్య గ్రహావతీ కృపేణ వహనీ కర్ణేన వేలాకులా**
**అశ్వత్థామ వికర్ణ ఘోర మకరా దుర్యోధనా వర్తనీ**
**సోత్తీర్ణాఖలు పాండవై రణనదీ కైవర్తకరి కేశవః**

ఎందరో తమ తమ స్వపక్షాన నిలిచారు. శ్రీకృష్ణ పరమాత్మ తాను యుద్ధము చేయక అర్జునునకు రథసారథియై, రథమును కురుక్షేత్ర రణరంగమున నిలిపి, పార్థుని యుద్ధము ప్రారంభింప ప్రోత్సహించి తమ రథమును యుద్ధభూమి యందలి ఇరు సైన్యముల మధ్య నిలిపి జరగబోవు కర్తృత్వమునకై వేచియున్నాడు.

**అర్జునుని విషాదయోగము:**

యుద్ధ ప్రారంభమున అర్జునుడు వైరి వర్గము వంక ఒక్కమారు తేరిపార చూచాడు. కౌరవ సైన్యవాహినిలో రథారూఢులై అస్త్ర, శస్త్ర, ధనుర్బాణ ధారులై యుద్ధాసక్తులై, సర్వసన్నద్ధులైన భీష్మ, ద్రోణ, అశ్వత్థామ, కృపాచార్యులైన, వృద్ధాశిఖామణులైన అతిరథ, మహారథులను దర్శించాడు. మరియు దుర్యోధన, దుశ్శాసన, కర్ణాది వీరులగు తన బంధుమిత్ర, ఆప్తులైన, వీరాధి వీరులైనవారిని చూచాడు. యుద్ధప్రాంగణమంతయు నిండియున్న సేనావాహినిని, అశ్వ, గజ, పద, తురగ చతురంగ బల సైన్య సమూహాన్ని తిలకించాడు. అంత అర్జునుడు ఒక్కమారుగా, చేష్టలుడిగి భావావేశుడై తన చేతిలోని ధనుర్బాణములను, అమ్ముల పొది యందలి అస్త్ర, శస్త్రములను విసర్జించి తన రథసారథియైన కృష్ణ పరమాత్ముని పాదపద్మముల ముందుంచి తన కరములను జోడించి ఇలా ప్రార్థించాడు. “పరమాత్మా! పరంధామా! హే శ్రీకృష్ణా! నా శరీరమంతయు చెమటలు పట్టినవి. శక్తియంతయు ఒక్కమారుగా మాయమైనది. నా చేతులు బలహీనమై వణుకుచున్నవి. నా ఆత్మ ఘోషించుచున్నది. రాజ్య కాంక్షచే యుద్ధము చేసి, అయినవారందరినీ వధించి, భూమి రక్తసిక్తమొనరించి మహా పాతకమును మూటగట్టుకొనుటకు నా మనస్సేమాత్రం అంగీకరించుట లేదు. ఇది నా వల్ల కాని పని. నేను అశక్తుడను. కావున నన్ను మన్నించుము అనుచు నిశ్చేష్టుడై శ్రీకృష్ణుని పాద కమలములకు నమస్కరించి కూర్చుని యుండగా అర్జునుని నిస్సహాయ స్థితిని జూచి పరమాత్మ ఆతనియందు మనోధైర్యమును, స్థితప్రజ్ఞతను కల్గించి యుద్ధోన్ముఖుని జేయుటకై గీతా ప్రబోధము గావించెను.

శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునికి గీతోపదేశము చేయుట

**పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం**
**వ్యాసేన గ్రథితాం పురాణమునినా మధ్యేమహాభారతమ్**
**అద్వైతామృతవర్షిణీం భగవతీమ్ అష్టాదశాధ్యాయినీమ్**
**అంబ త్వామనుసందధామి భగవద్గీతే భవద్వేషిణీమ్**

భగవంతుడైన నారాయణుడే స్వయంగా అర్జునునకు గీతోపదేశం చేసి, చైతన్యపరిచి తిరిగి అతనిని కార్యోన్ముఖుని, కర్తవ్యోన్ముఖుని గావించుటకై ప్రబోధించినదే ఈ గీత. వ్యాస భగవానునిచే రచింపబడి, అద్వైతామృత వర్షిణిగా, గీతామాతగా వెలసి నిలిచింది.

**భగవద్గీతలో అంతర్భాగములు:**

ఇది మహాభారత యుద్ధ మధ్యమమున బోధింపబడి లిఖింపబడినది. ఇందు కర్మ భక్తి జ్ఞానములను త్రిషట్కములు గలవు. ప్రతి షట్కమునందును ఆరేసి అధ్యాయములు కలవు. షట్కమనగా ఆరు అధ్యాయములని అర్థము. గీత యందలి మొత్తము పదునెనిమిది అధ్యాయములు కలవు. అన్నియు కలిపి ఏడు వందలుగా సంఖ్యాపరమై యున్నది.

గీత పవిత్రత :

**శ్లో ॥ సర్వోపనిషదోగావో దోగ్ధాపాలన స్థనః**
**పార్థో వత్సః సుధీరోక్తా దుగ్ధం గీతామృతం మహత్**

ఇందు సర్వోపనిషత్తులు, ధర్మశాస్త్రములు– గోవులు, గోపాల నందనుడై శ్రీకృష్ణుడు పాలు పితుకువాడు అర్జునుడు లేగదూడ, సద్బుద్ధి గలవాడు, శ్రేష్ఠమైన ఈ గీతామృతమును పానము చేయును.

**శ్లో ॥ గీతా సుగీతా కర్తవ్యా కిమన్యై శాస్త్ర విస్తరైః**
**యాస్స్వయం, పద్మనాభస్య ముఖపద్మా ద్వినిఃసృతా**

శ్రీమన్నారాయణుని ముఖకమలము నుండి గీతా శాస్త్రము ప్రకటింపబడినది. కావున అన్య శాస్త్రములతో పనిలేదు. ప్రారబ్ధముగా ప్రాప్తించు కర్మలను ఆచరిస్తూ, జన్మ జన్మల సంస్కారములను నశింపచేసుకొని జీవించియుండగానే మోక్షప్రాప్తిని బొంది, జీవన్ముక్తుడుగా జీవించి, మరణానంతరము పరమాత్మను పొందు మార్గమును స్వయం భగవానుడే భగవద్గీత యందు సవివరంగా బోధించాడు. ఇక అన్య శాస్త్రములతో పని లేదు. భగవద్గీత యనునది భగవత్ రాజ్యాంగము. ఇందు ఎట్టి మార్పులు, చేర్పులు, సవరణలకు తావు లేదు. ఇది సృష్టి యున్నంత వరకు సుస్థిరముగా నుండి సృష్టికర్త ప్రకటించిన రాజ్యాంగము. ఆచంద్రార్కము అజేయమై, అప్రతిహతమై ఆచరణ వెలుగొందు భగవత్ నిరుపమా శాసనము.

గీత ప్రథమ షట్కములోని మొదటి అధ్యాయము అర్జునుని విషాదయోగ సారాంశం

**ప్రథమాధ్యాయ సారాంశం:**

అర్జునికి గల దేహభావము వలన మమకార భావం కలిగి విషాదంతో అలమటించడం ప్రారంభమైంది. విషాదం వలన వివేకం, దానివలన కారణం, దాని నివృత్తి మార్గాలు అన్వేషించి శాస్త్రాధ్యయనం, గురుబోధ, శ్రవణ, మనన, నిధి, ధ్యాసల వలన ఆత్మతత్వ, ప్రకృతితత్వ జ్ఞానములను తెలిసికొని పరమాత్మయే అన్నింటికీ కర్మఫల ప్రదాతయని, కర్మాచరణములో తాను నిమిత్తమాత్రుడనని భావన కల్గుతుంది. ప్రారబ్ధ లబ్ధిగా లభించు కర్మలను ఆచరిస్తూ, ఫలముల ననుభవిస్తూ కర్మభంగములకు అంటబడకుండా యుండుటకు సుగమ మార్గము ఏర్పడుతుంది. దానికై నరుడు ప్రయత్నించును.

**2. ద్వితీయాధ్యాయము – సాంఖ్యయోగ సారాంశము:**

ప్రతి ఒక్కరు వాస్తవంగా, తాను ఆత్మనే దశేంద్రియములతో కూడిన శరీరము తనకు ఉపాధిగా లభించిందని ఎరింగి అంతఃకరణము మరియు దేహమునందు బంధింపబడి యున్నది కావున అట్టి బంధవిముక్తిని చేసుకొని పరమాత్మయందు లయించుటే లక్ష్యముగా పెట్టుకొనవలెనని బోధించునదే ఈ అధ్యాయమందలి భగవద్బోధనము. ఆత్మ నాశరహితము, శరీరము (దేహము వినాశకము) అశాశ్వతము అను తత్వమును తెలిపి, బంధానుబంధములు, సర్వసంపాదనలు, కీర్తి ప్రతిష్ఠలు అలంకరించు అత్యున్నత పదవులన్నియును అశాశ్వతములని మానవులెరుంగవలెను. తాను చేయు పుణ్య, పాప ఫలితములే తనతో వచ్చునని, అవియే మరుజన్మకు కారణములై, జీవి సుఖ దుఃఖముల ననుభవించుటకు హేతువగునని తెల్పెను. కావున జీవి ఆత్మజ్ఞానమును పొంది, జీవన్ముక్తునిగా, స్థితప్రజ్ఞునిగా జీవించి అంతమున బ్రహ్మ నిర్యాణము పొందు మార్గమును ఈ అధ్యాయమున తెలియజేయనైనది.

**3. తృతీయ అధ్యాయము – కర్మయోగము–సారాంశము:**


మానవుని జీవనయానం 1. ప్రవృత్తి 2. నివృత్తి అను రెండు మార్గములలో వర్తించుట జరుగును. ప్రవృత్తి యనగా శరీరేంద్రియములచే ప్రారబ్ధముగా ప్రాప్తించు కర్మలను ఆచరించుట, ఇందు నేనే కర్తను "అహం కర్తా" యను భావన యుండును. అట్టివారు కర్మబంధములందు చిక్కుబడి జనన, మరణ చక్రములో పడి పరిభ్రమించుచుందురు. రెండవదైన నివృత్తి మార్గము కర్మ సిద్ధాంత జ్ఞానముతో, నాహంకర్తా–హరిఃకర్తా అను జ్ఞానముతో నిష్కామకర్మలు ఆచరించును. ఇది కర్మయోగము. దీనివలన కర్మబాధలంటవు. అంతఃకరణ శుద్ధి కల్గి, వారి ఆత్మ సదా పరమాత్మ యందే ధ్యాన నిమగ్నమై యుండును. ఈ ప్రారబ్ధ కర్మల పాప పుణ్య ఫలితములను పరమాత్మయే ప్రసాదించును. కావున మానవుడు అహం–కర్తా యను అహంకారము వీడి హరి–కర్తాయను భావంతో కర్మల నాచరించి కర్మలను పరమాత్మకు అర్పణము చేసి ఫలప్రాప్తిని భగవత్ ప్రసాదంగా స్వీకరించవలయును. ఫలితంగా జీవి కర్మలయందు బంధింపబడడు అంటూ ఈ అధ్యాయమందు శ్రీకృష్ణ భగవానుడు అర్జునునకు బోధించినాడు.

**4. చతుర్థాధ్యాయము – జ్ఞానయోగము–సారాంశము:**

ఈ అధ్యాయంలో అర్జునునికి పరమాత్మ ఇలా తెలియచేశాడు. మనస్సును నిగ్రహించి దానిని ఆత్మయందు స్థాపించి లగ్నపరచి నివృత్తియే కర్తవ్యమని తెలియచేశాడు. మానవుడు తన ఇష్టానుసారం కర్మలనాచరిస్తున్నాడు. కర్మఫలం అనుకూలిస్తే అది తన ప్రజ్ఞేనని భావిస్తాడు. కాని అది తన ప్రారబ్ధ కర్మ ఫలితంగా జరిగిందని ఏమాత్రం భావించడు. అదే ప్రతికూల ఫలితం వస్తే ఎంతో దుఃఖపడతాడు. తద్వారా వాని ఆరోగ్యం క్షీణిస్తుంది. అది తన ప్రారబ్ధ కర్మగా భావిస్తాడు. కర్మఫలానుభవముల తీరుకు రాగ ద్వేషములే ముఖ్యకారణములు. ప్రారబ్ధంగా ప్రాప్తించు కర్మలను ఆహ్వానింప పనిలేదు. అవి కాలానుగుణంగా ప్రాప్తిస్తాయి. వాటిని ఎవ్వరూ ఆపలేరు. కావున మానవుడు అశాశ్వతమైన విషయములనుండి మనస్సును మరల్చి శాశ్వతమైన పరమాత్మ యందుంచుటే మనస్సు ఆత్మ సంస్పర్శము పొందును. దీనిచే జన్మ జన్మల పుణ్య పాప సంస్కారములు నశించి ఆగామి, ప్రారబ్ధ, సంచిత సంస్కారములు నశించుట వలన ఆనందారోగ్య సంతృప్తులతో జీవన్ముక్తుడై జీవనయానం కొనసాగించగలడు. ఇచ్ఛా మరణమును పొంది పరమాత్మ సన్నిధిని శాశ్వతానందమును పొందును. కావున బుద్ధియందు ఆత్మజ్ఞానమును నింపి, బుద్ధిచే మనస్సును, ఇంద్రియములను ఆత్మయందు నింపివేసిన మనస్సును ఆవరించియున్న జన్మ జన్మల సంస్కారములు మెల్ల మెల్లగా తొలగిపోవును. ఇట్లా నివృత్తి మార్గంలో ప్రవర్తించుచు, ప్రవృత్తి మార్గంలో ప్రారబ్ధంగా ప్రాప్తించు కర్మలను ఆచరించుటయే జ్ఞానయోగమందురని పరమాత్మ వచించెను.

**5. పంచమ అధ్యాయము – కర్మ సన్యాస యోగము–సారాంశము :**

కర్మ సన్యాస యోగమంటే కర్మలను సన్యసించుట (వదలుట) కాదు. కర్మలయందు, కర్మఫలముల యందు ఆసక్తి కలిగియుండుటను కర్మ సన్యాస యోగమను అర్థమును భగవానుడు తెలిపియున్నాడు. పూర్వ ప్రారబ్ధ పుణ్య ఫలితములుగా ప్రాప్తించే ద్వంద్వ ఫలితములు అనగా



లాభనష్టములు, సుఖదుఃఖములు, అనుకూల ప్రతికూల ఫలితములు, కీర్తి అపకీర్తులు, నిందాపనిందలు మొదలగు వాటియందు రాగద్వేషములు లేక ఓర్చుకుని, అవి అన్నియు పరమాత్ముని ప్రసాదితాలుగా స్వీకరించి అవి ప్రాప్తించుటకు కారణములైన జన్మ జన్మ సంస్కారములను తొలగించుకొనుటకు ప్రయత్నింపవలయునని భగవానుడీ అధ్యాయమున బోధించెను. మనో నిగ్రహముతో కర్మలు చేస్తూ నివృత్తి మార్గంలో ప్రవర్తించుచు, నాహంకర్తా - హరియే కర్తా అను భావములతో ఆచరించు కర్మయోగులు ఫలము ఒక్కటే యను అంతఃకరణ శుద్ధియని వివరించెను. జ్ఞానయోగి తాను చేయు ప్రతి కదలిక, ప్రతి మాట, ప్రతి శ్వాసక్రియ అన్నియు ఆ పరమాత్ముని ఆజ్ఞానుసారమే ప్రాప్తించునని భావించును. అంత అతని అహంకారమంతయు తొలగి మనశ్శుద్ధి కలిగి శాంతుడై యుండును. అట్టివాడు ముక్తిమార్గము అన్వేషించి పొందును అను హితవు చెప్పెను.

**6. ఆరవ అధ్యాయము - ఆత్మ సంయమన యోగము-సారాంశము :**

ఆత్మ సంయమన యోగమనగా మనస్సును, జ్ఞానేంద్రియములను, సూక్ష్మదేహమును ఆవరించిన పుణ్య పాప సంస్కారములను నశింప చేసుకొను మార్గమని అర్థము. ధ్యానయోగి ఒక శుచియైన ప్రదేశంలో ఏకాంతముగా కూర్చుని నిత్య నిరంతర చిత్తముతో పరమాత్మని చింతించుచు నిమగ్నత నొందిన వాని మనస్సు ఆత్మ సందర్శనం పొంది మనస్సున ఆవరించియున్న అన్ని కిల్బిషములు నశించును. సూక్ష్మదేహము ధ్యానయోగంలో నశించిపోవును. అపుడాతనికి బంధవిముక్తి కలుగును. దీనినే ముక్తి లేక మోక్షమందురు. మానవుడు జీవించియున్నపుడే ఈ సూక్ష్మదేహ విముక్తిని పొందవలెను. అట్లు పొందినవాడే జీవన్ముక్తుడు. ఇట్టివాడు దేహమును వీడిన వెనుక పరంధామము చేరి అష్టసిద్ధులను, నవనిధులను పొందును. శాశ్వతమైన సుఖమును అనుభవించి పరమశ్రేష్ఠతను పొందగలడని భగవానుడు తెలిపెను.

**7. సప్తమాధ్యాయము - జ్ఞాన విజ్ఞాన యోగము-సారాంశము - ద్వితీయ షట్కము భక్తికాండము:**

భగవంతుని యందు ఉత్కృష్టమైన ప్రేమను కల్గియుండుటను భక్తి యంటారు. ఇది భగవంతుని యెడల చూపు పరమ ప్రేమతత్వము అని నారద మహర్షి తెలియజేశాడు. నరుడు అశాశ్వతములైన భౌతిక విషయములను ప్రేమించుట మాని భక్తి శ్రద్ధలతో పరమాత్ముని పూజించుట వలన అట్టివారు పరమాత్మకు ప్రియభక్తులు కాగలరు అను ఈ విషయము పరమాత్మ అర్జునునకు ఈ అధ్యాయమునందు బోధించియున్నాడు. ఈ జ్ఞాన విజ్ఞాన యోగంలో పరోక్ష జ్ఞానాన్ని, అపరోక్ష జ్ఞానంగా మార్చుకొను మార్గమును భగవానుడు బోధించినాడు. అపరాకృతమైన భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి మరియు అహంకారమనునవి అష్టవిధములుగా విభజించబడియున్నవి. వీటిద్వారా సకల చరాచర ప్రాణుల శరీరములు సృష్టింపబడుచున్నవి. వాటియందు పరా ప్రకృతి ప్రవేశించి చైతన్యవంతం చేయుచున్నది. కావున ఈ సకల చరాచర సృష్టి స్థితి లయములకు తానే కారణమని తను వినా ఈ విశ్వమందు ముఖ్యకారణమైన శక్తి ఏదియు లేదని భగవానుడు వివరించెను. తన విభూతులైన వానిని సైతము పరమాత్మ క్రిందివిధంగా తెలియజేశాడు. జలములోని రసము,

రవిచంద్రులలోని ప్రకావము, వేదమందు ఓంకారము, ఆకాశమందలి శబ్దము, భూమి యందలి గంధము, అగ్నిలోని తేజస్సు, బలవంతులలోని కామరాగ రహితబలము, ధర్మబద్ధమైన కామము, ఇవి అన్నియు తన విభూతులేనని భగవానుడు తెలియజేశాడు. విశ్వవ్యాపి, త్రిగుణాతీతుడైన పరమాత్మ మాయను అధిగమించి నా విభూతులలో నన్ను దర్శింపగలవారు నా చతుర్విధ భక్తులైన ఆర్తులు, జిజ్ఞాసువులు, అర్థార్థులు, జ్ఞానులు తనను భజింతురని వారిలో జ్ఞాని నా సంపూర్ణత్వమును తెలిసినవాడు కావున నాకు మిక్కిలి ఇష్టుడు. అతడు జరా మరణముల నుండి విముక్తి పొందగలడు.

**8. అష్టమాధ్యాయము –**
**అక్షర పరబ్రహ్మయోగము–సారాంశము :**

ఇందు ఇలా తెలుపబడినది. పరబ్రహ్మము అనగా భగవంతుడు శ్రేష్ఠుడు, శాశ్వతుడు, అక్షరుడు అని యందురు. ఇట్టి పరమాత్మమైనదే జీవాత్మ తత్వము. అట్టి దాని నెరుంగుటయే ఆధ్యాత్మికమని, పరమాత్మ సృష్టించు కార్యమే కర్మయని, పుట్టి నశించు ప్రాణులను అధిభూతములని, సృష్టియంతయు తన గర్భములో నుండునని, తానే ఆదిదైవమని, ప్రాణులన్నింటిలో అంతరాత్మగా నున్నది పరమాత్మ అంశమని, అధియజ్ఞుడని, మరణకాలమున నన్నే స్మరించుచు దేహమును త్యజించువారు నన్నే పొందగలరని, బోధన కొనసాగించుచు మనుష్యుడు తన అవసాన దశలో ఎవరిని స్మరించుచు దేహత్యాగము చేయునో ఆ స్వరూపమునే తాను పొందును. కావున మనిషి తన అవసాన దశలో నన్నే స్మరించుచు ప్రాణములొదిలిన నన్నే చేరగలరు. నిరంతరము నన్నే స్మరించువారలకు పునర్జన్మ ఉండదని, మహాత్ములైనవారు నిరంతర ధ్యానపరులై యుందురని, కాగా వేదాధ్యయనం వలన, యజ్ఞాచరణము వలన, దాన ధర్మముల వలన కాని తన పరంధామము చేరలేరని చెప్పుచు పరమాత్మ ఈ అధ్యాయము ముగించెను.

**9. నవమాధ్యాయము –**
**రాజవిద్యా – రాజగుహ్యయోగము – సారాంశము:**

విశ్వమంతయు తాను అవ్యక్తమూర్తిలా వ్యాపించి యుండుట వలన సర్వప్రాణులు తనయందే యుండునని, అట్లే ప్రాణుల బాహ్యాంతరములందు కూడా తానే వ్యాపించి యున్నానని, సూక్ష్మరూపంలో ఉన్న సర్వప్రాణులు కల్పాంతమునందు నా ప్రకృతిలో లీనమగుదురని, తిరిగి వారిని నేను మరుకల్ప ప్రారంభమున వారి వారి ప్రారబ్ధ కర్మానుసారము పుట్టించి గిట్టించుచున్నాను. ఈ కర్మలను అనాసక్తితో చేయుటవలన ఆ కర్మలు తనను బంధించుట లేదని, అనాసక్తితో కర్మలు ఆచరించడం వలన కలుగు ఫలితములను బోధించినాడు. తానే క్రతువుచ యజ్ఞము, స్వధయును, ఔషధము, మంత్రము, ఆజ్యము, అగ్ని, హుతము నేనే. నేనే జగదాధారుడను. కర్మ ఫలముల ప్రసాదించువాడను. సర్వ ప్రాణులకు నేనే తల్లిని, తండ్రిని, తాతను సర్వము నేనే. ఓం కారము, చతుర్వేదములు నేనే. అందరికినీ నేనే స్వామిని. వర్షములు కురిపించుట, కురిపించకుండుట, అమృతమును, మృత్యువును నేనే. సత్, చిత్ స్వరూపములు నావే. కాని నన్ను భక్తితో సేవించువారి యోగక్షేమములు నేనే వహించగలను. నరుడు ప్రీతితో సమర్పించు పత్రముగానీ, పుష్పముగానీ, ఫలముగానీ జలముగానీ నేను స్వీకరించి ప్రేమతో ఆరగింతును. సత్వగుణ ప్రధానులైన బ్రాహ్మణులు, రజోగుణ ప్రధానులైన క్షత్రియులు, తమోగుణ ప్రధానులైన వైశ్య, శూద్రులు కూడా తనను భజించినవారు శీఘ్రముగా ధర్మాత్ములుగా మారును. కావున అర్జునా! నీవు నా యందే మనస్సు లగ్నపరచి, నా భక్తుడవై నన్ను పూజింపుము. నాకు నమస్కరింపుము. నిరంతరము మనస్సు నాయందే నిల్పుము. అట్లు చేసిన మత్పరాయణత్వమును పొందగలవని పల్కుచూ తన బోధనను భగవానుడు ఈ అధ్యాయమున ముగించెను.

**10. దశమాధ్యాయము –**
**విభూతి యోగము–సారాంశము :**

విభూతులనగా పరమాత్మ ప్రసాదించు అష్టైశ్వర్యములు. తనను మానవులలో అసమ్మూఢులైనవారు మాత్రమే దర్శించి, నన్ను ఆది, అనాది పురుషునిగా గ్రహించినవారు వారి సర్వ పాపములనుండి విముక్తులవుదురు. జనన, మరణము లేని, అసలు పుట్టుకయే లేని నా తత్వమును గురించి దేవతలు, మహర్షులు ఇతరులెవ్వరును ఎరుగరు. ఎందుకనగా వారందరి పుట్టుకకు నేనే కారణభూతుడను అని వచించుతూ తన విభూతులలో కొన్నింటిని ఇలా వివరించాడు పరమాత్మ. మనుష్యులందు కల్గు మంచి, చెడు భావనలు, చేష్టలు, కృత్యములన్నియు తన విభూతుల వలననే కల్గుచున్నవి. వాటన్నింటిని వారి వారి ప్రారబ్ధ, పుణ్య పాపముల కనుగుణంగా తానే ప్రసాదిస్తున్నానని తెలిపాడు. ఈ జగత్తునందలి సర్వప్రాణులు తన సంతానమేనని, వారంతా తన వారసులే అని, సత్యమును, అవి కంపేన యోగంతో తెలిసికొని, నాయందే మనస్సు లగ్నపరచి తన ప్రాణములర్పించు వారికి, బుద్ధి యోగమును ప్రసాదింతును. తద్వారా వారి అజ్ఞానము తొలగి నన్నే పొందుదురని వివరించెను. అంత సంతుష్టుడైన అర్జునుడు ముకుళిత హస్తుడై "ఓ! పరమాత్మా! తాము దయతో తమ విభూతి

మహిమలను తెలిపి నన్ను ధన్యుని గావించినారు. అట్లే తాము మరికొన్నింటిని తెలుపుడని ప్రార్థింపగా –

**భగవానుని మరికొన్ని విభూతులు:**

అంత పరమాత్మ, వేదములలో సామవేదము, దేవతలలో ఇంద్రుడు, ఇంద్రియములలో మనస్సు ప్రాణులలోని చైతన్యము, రుద్రులలో శంకరుడు, ధనాధిపతి కుబేరుడు, అష్టవసువులలో అగ్ని, పర్వతములలో మేరువు, దేవత పురోహితులలో బృహస్పతి, సేనాపతియైన సుబ్రహ్మణ్యుడు, జలాశయాలలో సాగరము, మహర్షులలో భృగువు, శబ్దములలో ఓంకారము, జపములలో జపయజ్ఞము, పర్వతములలో హిమాలయము, వృక్షములలో అశ్వత్థము, దేవర్షులలో నారదుడు, అశ్వములలో ఉచ్చైశ్రవము, గజములలో ఐరావతము, నరులలో రాజ్యాధిపతి, ఆయుధములలో వజ్రాయుధము – ధేనువులలో కామధేనువు, కామ కాంక్షలో మన్మథుడు, సర్పములలో వాసుకి, నాగులలో ఆదిశేషుడు, శాసించువారిలో యమధర్మరాజు, దైత్యులలో ప్రహ్లాదుడు, మృగములలో సింహము, ప్రాణముల హరించు శివుడను. సృష్టించు బ్రహ్మను. శృతులందు బృహత్సామ శృతిని, స్త్రీలలోని కీర్తి, క్షమ, కరుణ వంటి సుగుణములన్నియు నేనే. ఇక ఛందస్సులో గాయత్రి, మాసములలో మార్గశిరము, యదువంశములోని వాసుదేవుడను, మునులలో వ్యాసుడను, కవులలో శుక్రాచార్యుడను మరియు శక్తి, నీతి, జ్ఞానము అంతయు నేనే ఇట్టి నా విభూతులకు అంతము లేదు. అర్జునా! ఈ సంపూర్ణ జగత్తు నా యోగశక్తి యొక్క అంశముతోనే వ్యాపించి వర్తించుచున్నదని ఎరుంగుమనుచు భగవానుడు ముగించెను.

**11. ఏకాదశాధ్యాయము –**
**విశ్వరూప సందర్శన యోగము–సారాంశము :**

ఇందు అర్జునుడిలా అంటాడు : ఓ కృష్ణా, పరమాత్మా ఇప్పటివరకు తాము నాయందు దయయుంచి వివరించిన తమ విభూతి యోగములన్నియు సత్యములే. అందు ఎట్టి సందేహము లేదు. కావున నీ జ్ఞాన, ఐశ్వర్య, శక్తి, బల, వీర్య, తేజోమయమైన, షడ్గుణైశ్వర్య సంపన్నమైన నీ దివ్యస్వరూపము కనులారా కాంచి తరింప కుతూహల పడుచున్నాను. కావున దయతో నాకు దర్శింపజేయుము అన్నాడు.

**శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునితో ఇలా అన్నాడు:**

ఓయీ అర్జునా! నా అలౌకిక రూపమును మున్నెన్నడును దేవతలు, దేవగణములు సైతము చూచి ఎరుగని అపూర్వమై సకల చరాచర జగత్తుతో నిండియున్నది. చూడగోరిన చూడుము. కానీ నీవు నీ ప్రాకృత చక్షువులతో నా రూపమును చూడజాలవు. కావున నీకు దివ్యదృష్టిని ప్రసాదించుచున్నాను. ఈ దృష్టితో ఈశ్వరమయమైన నా విరాడ్రూపమును చూడుము అని యనుచు అర్జునునకు తన విశ్వరూప సందర్శనము గావించెను.

**విశ్వరూపమందు అర్జునుడు దర్శించిన దృశ్య సముదాయ వివరములు:**

భగవానుని విశ్వరూపమున అనంత ముఖములు, నేత్రములు, దివ్యాభరణములతో సహస్ర సూర్యకాంతులతో వెలుగుచున్న విశ్వరూపమును అర్జునుడు దర్శించి ఆశ్చర్య చకితుడై, భక్తిపూర్వకంగా సాష్టాంగ ప్రణామము గావించి ఇట్లు స్తుతించెను. కృష్ణా! నీ విరాడ్రూపము అనంతరూపమై విరాజిల్లుచున్నది. నీవే ఆది, మధ్యాంతరహితుడవు. అపరిమిత శక్తిశాలివి. సమస్త దేవగణము, ఎల్లప్రాణికోటి, సమస్త లోకమంతా, సప్తర్షులు, సమస్త ప్రకృతి, సర్వసంపదలు అన్నియు నీలోనే ఉన్నవి. నీ రూపము సమస్త విశ్వము నందు వ్యాపించియున్నది. నీ భయంకర రూపమును చూచి ఎల్లరు వణికిపోవుచున్నారు. దయయుంచి నీ భయంకర రూపము చాలించుమని ప్రార్థింపగా – శ్రీకృష్ణుడంత అర్జుననితో ఇట్లనెను. అర్జునా! ఇంకను వినుము. నేనే మహాకాలుడను. ఇపుడు ఈ లోకములన్నింటినీ రూపుమాప పూనుకున్నాను. నీవు యుద్ధము చేసినను చేయకున్నను నీ ప్రతిపక్షమున నున్నవారెవ్వరును బ్రతికి యుండరు. వారందరికీ మరణకాలం ఆసన్నమైనది కావున తప్పక మరణింతురు. వారి ఆయుః ప్రమాణము నా చేతిలో యున్నది. నీవు నిమిత్త మాత్రుడవు. కావున యుద్ధమొనరించి శత్రువులను జయించి కీర్తితోపాటు రాజ్యలక్ష్మిని పొందుము. నీవు నిమిత్తమాత్రుడవై యుద్ధము చేయుము. తప్పక జయింతువు. వారంతా నీచే మరణింప వలసిన యోగమున్నది అని పరమాత్మ అర్జునుని ప్రోత్సహించాడు. అంత అర్జునునకు సాష్టాంగ ప్రణమిల్లుచు దేవ దేవా! నా అపరాధములను మన్నించి నీ పూర్వ సుందర మందహాస రూపమును ధరించి చూపుము అని ప్రార్థించినంత పరమాత్మ ప్రసన్నుడై శంఖు, చక్ర, గద, కిరీటిధారియై పీతాంబరములు మెరయ చిరునవ్వులు చిందించుచు అర్జునునకు తన పూర్తరూప సందర్శనము గావించెను. అవ్విధముగా శ్రీకృష్ణ భగవానుడు అర్జునుని యుద్ధోన్ముఖుని గావించెను. కాగా అర్జునుడు శ్రీకృష్ణునకత్యంత ప్రియమైన భక్తునిగా మారెను. వారిరువురు నర, నారాయణులని ఖ్యాతి నొందారు.

**12. ద్వాదశాధ్యాయము – భక్తియోగము–సారాంశము:**

అర్జునుడు శ్రీకృష్ణునిపై గల భక్తి భావంతో దేవా! నీ క్షరమైన, సగుణరూప విగ్రహాన్ని ఉపాసన చేయు భక్తులు

శ్రేష్ఠులా? లేక అక్షర నిరాకార, అవ్యక్త పరమాత్మను ఉపాసించు భక్తులు శ్రేష్ఠులా? అని ప్రశ్నించగా, పరమాత్మ అర్జునా! నీ సంశయ నివృత్తిగా వినుము చెప్పెదను అన్నాడు.

ఎవరు నన్ను ఏకాగ్రచిత్తులై నిరంతరం అత్యంత భక్తి, శ్రద్ధలతో నా సగుణ రూపమును ఆరాధింతురో వారు యోగులలో మిక్కిలి శ్రేష్ఠులు. అట్లే నన్ను నిరాకారునిగా ఎంచి భక్తి శ్రద్ధలతో స్మరించువారును శ్రేష్ఠులే. నిర్గుణోపాసన మిక్కిలి శ్రమతో కూడినది. నా కొరకు సత్కర్మల నాచరించు వారు సైతము నన్ను పొందెదరు. నా భక్తులలో దైవ లక్షణములు గలవారు శ్రేష్ఠులు. దైవలక్షణమనగా, అద్వేషము, మైత్రి, కరుణ, నిర్మలత, నిరంహకారము, సమభావన, క్షమాగుణము, సంతుష్టత్వము, దృఢ నిశ్చయము, మనోబుద్ధి, ఉద్వేగి కానివాడు, హర్ష, మర్ష విమర్శలకు లోనుకానివాడు, అనపేక్షుడు, శుచిః, దక్షః, ఉదాశీనుడు, గత వ్యధుశ, సర్వారంభ పరిత్యాగి, స్థిరమతి ఇలా 35 లక్షణములు గలవారు తనకు ప్రియమైన వారని తెల్పుచు ఈ అధ్యాయమును ముగించెను.

**13. త్రయోదశాధ్యాయము – సారాంశము:**

త్రిషట్కములోని క్షేత్ర, క్షేత్రజ్ఞ విభాగము యోగము : ఈ అధ్యాయమునందు అర్జునుడు కృష్ణా! నాకు క్షేత్రము, క్షేత్రజ్ఞుడు, ప్రకృతి, పురుషుల గురించి తెలుసుకొనగోరుచున్నాను. కావున కృపతో ఆ వివరములను నాకు తెలియజేయుమనగా శ్రీకృష్ణ పరమాత్మ ఇలా సమాధానమిచ్చాడు. అర్జునా! ప్రకృతియే క్షేత్రము. అది అశాశ్వతము, అనిత్యము, నశించు స్వభావము కలది. క్షేత్రమును చైతన్యం చేస్తున్న ఆత్మయే క్షేత్రజ్ఞుడని, ఆత్మవిశ్వాసము, నిత్యము సత్యము. నాశములు లేని, ఆద్యంతములు లేని పరమాత్మ స్వరూపమని బోధించెను. ఈ విషయము నెరుంగుటయే జ్ఞానము. వీనిలో ముందుగా క్షేత్రమును గురించి తెల్పెదను. క్షేత్రమనగా మూల ప్రకృతి. పంచ మహాభూతములు మనస్సు, బుద్ధి, అహంకారము, దశేంద్రియములు, పంచేంద్రియములు, గ్రాహ్య విషయములు, ఇచ్ఛా, ద్వేష, సుఖదుఃఖ, స్థూల శరీరము చైతన్య ధృతియను వికారములతో కూడి యున్నది అని వివరించాడు. జ్ఞానమనగా క్షేత్ర, క్షేత్రజ్ఞులకు సంబంధించిన జ్ఞానమే జ్ఞానమని చెప్పి జ్ఞాన ప్రాప్తికి కావలసిన ఇరువది అర్హతలను భగవానుడు అర్జునునకు సంక్షిప్తముగా తెల్పెను. అవి ఎట్టివనగా – 1. అమానిత్వం 2. అదంభిత్వం 3. అహింస 4. క్షాంతిః 5. అర్జవం 6. ఆచార్యోపాసనం 7. శౌచం 8. స్థైర్యం 9. ఆత్మనిగ్రహం 10. ఇంద్రియార్థేషు వైరాగ్యం 11. అనహంకారం 12. జన్మమృత్యు 13. అశక్తిః 14. అనభిష్వంగః పుత్ర దార గృహాదిషు 15. నిత్యం సమచిత్తత్వం 16. మయి భక్తి రవ్యభిచారిణి 17. వివక్తం దేశసేవిత్వమ్ 18. అరతిఃజనసంసది 19. ఆధ్యాత్మిక జ్ఞాన నిశ్చతత్వం 20. తత్వ జ్ఞానార్థ దర్శనమ్ అనునవి. ప్రతి ముముక్షువు పరమ ప్రాప్తికై సాధన చేయువాడు. వీటన్నిటిని తప్పక పాటించవలయును. ఇక జ్ఞేయం అనగా పరమాత్మ గురించి తెలుసుకుందాం. పరమాత్మ సత్ కాదు చిత్ కాదు. ఈ రెంటికి అతీతుడు. పరమాత్మ యొక్క శిరస్సు, ముఖములు, నేత్రములు, పాదములు, చేతులలో విశ్వమంతా యున్నది. పరమాత్మ ఇంద్రియాతీతమైన చైతన్యశక్తి. దీనిని ఆర్తులు, జిజ్ఞాసువులు, అర్థార్థులు, మరియు జ్ఞానులు మాత్రమే అనుభవనీయులు. ఇంద్రియ గ్రాహ్యము లన్నింటిని ఎరింగినవారు నిర్గుణుడైనను, గుణభోక్తగా వ్యవహరింపబడుచున్నాడు. భగవానుడు చరాచరుడై, సూక్ష్మరూపుడై యుండును. అందరకును తెలిసికొన శక్యము సర్వప్రాణుల సర్వకర్మలను అతడు వీక్షించుచున్నాడు. శ్రేజ్ఞియేనతత్ అంటే పరబ్రహ్మ రూపంలో సకల చరాచర ప్రాణులను సృష్టిస్తుంటే విష్ణురూపంలో వాటిని ధరించుచు పోషించుచు రుద్రరూపములో వాటిని లయమొనర్చి భూమి భారాన్ని సమతుల్యము చేయుచున్నాడు. పరంజ్యోతిగా, మాయాతీతునిగా వ్యవహరించుచు సకల ప్రాణుల హృదయములందు నివసించుచున్నాడు. ఇప్పటివరకు క్షేత్రము, జ్ఞానము, జ్ఞేయము అను మూడింటి గురించి సంక్షిప్తముగా తెలిపియున్నాను. ఇక ప్రకృతి, పురుషుల గురించి తెలియజేసెదను. ఈ ఇరువురును పరమాత్మయొక్క సనాతన ప్రకృతులేనని, పరమాత్మ అపరాకృతినే ప్రకృతియని, ఆత్మచైతన్యమునే పురుషుడని యందురు. సకల ప్రాణులందు దేహమందు స్థితుడై యున్న ఆత్మ, వాస్తవంగా పరమాత్ముని అంశమే. కావున ఆతనిని అక్షర పురుషుడని, మహేశ్వరుడని, పరమాత్మయని వేరువేరు పేర్లతో పిలువబడుచున్నాడు. గుణరహితమైన పరమాత్మ తత్వము, గుణములతో కూడిన ప్రకృతి తత్వాన్ని తెలుసుకొన్నవాడు సర్వదా కర్మలను ఆచరించుచుండినను, పునర్జన్మము నొందడని పరమాత్మ వివరించాడు. కొందరు కర్మయోగం ద్వారా, కొందరు సాంఖ్యయోగం ద్వారా, ఇంకొందరు ధ్యానయోగం ద్వారా హృదయమునందున్న ఆత్మను దర్శింతురు. ఇవి తెలియనివారు శ్రవణము చేసి ఉపాసనము చేయువారును నిస్సందేహముగా సంసార బంధముల నుండి బయటపడెదరు. శరీరమను క్షేత్రములో నాశరహితమైన పరమేశుని అంశయై క్షేత్రజ్ఞుణ్ణి చూచువాడు నిజమైన ద్రష్ట. ఓ అర్జునా! సకల చరాచర ప్రాణాలు ప్రకృతి ప్రేరణతో కర్మల

నాచరిస్తున్నాయి. ప్రకృతియే కర్మఫల ప్రదాతయైన పరమాత్మ. గ్రహ, నక్షత్ర, ఉపగ్రహముల ప్రేరేపణచే, బుద్ధి మనస్సు స్పందించుట వలన వారి వారి పుణ్య పాప కర్మల కనుగుణంగా శరీర, మనో ఇంద్రియములచే కర్మల ననుభవించుచున్నారు. నిర్గుణుడైన పరమాత్మను, నిర్గుణులైన మానవులే పొందగలరు. ఈ ప్రకారము క్షేత్ర, క్షేత్రజ్ఞతకు మధ్యగల అంతరమును కార్యరహిత ప్రకృతి నుండి విముక్తులగుటకు జ్ఞాన నేత్రముల నెరింగిన మహాత్ములు, పరమగతిని పొందుదురు అనుచు భగవానుడు ఈ అధ్యాయమున తన ఉపదేశమును ముగించెను.

**14. చతుర్దశోధ్యాయము –**

**గుణత్రయ విభాగము–సారాంశము:**

పార్థా! జ్ఞానములలో అత్యుత్తమ పరిజ్ఞానమును నీకు తెల్పుదును. ఇది తెలుసుకున్నవారు సంసార బంధముల నుండి విముక్తులైరి. కావున అట్టి జ్ఞానమును పొంది నీవు మోక్షప్రాప్తి నొందుము అనుచు పరమాత్మ తన బోధనను ఇలా కొనసాగించెను. నా మూల ప్రకృతి రూపమైన బ్రహ్మ సకల చరాచర ప్రాణులకు జన్మస్థానము, దానియందు నా బీజమైన చైతన్యమును ఉంచెదను. జడ, చేతన, సంయోగము వలననే సర్వ ప్రాణులు జనించును. అట్టి ప్రాణులకు మూల ప్రకృతియే తల్లి. నేను జనకుడను. ప్రకృతి నుండి ఏర్పడిన త్రిగుణములు నాశనము లేని జీవాత్మను సూక్ష్మ దేహమునందు బంధించుచున్నది. జీవాత్మకు సూక్ష్మదేహము నుంచి బంధ విముక్తి కావలెనన్న త్రిగుణములను తొలగించుకొనిన గుణాతీతుడై పరమాత్మను పొందగలడు. సూక్ష్మదేహమును ఆవరించిన త్రిగుణములు, పరమాత్మయను చింతన, అనుస్మరణ వలన మనస్సు ఆత్మ సంసర్గము పొందుటచే మనస్సును, జ్ఞానేంద్రియములను అంతఃకరణమును ఆవరించియున్న త్రిగుణములు బంధమునకు విముక్తి కలుగును. అట్టివాడు గుణాతీతునిగా మారి, పరమాత్మను పొందును. సత్వగుణము నిర్మలమైనది. రజోగుణము రాగాత్మకమైనది. తమోగుణము అజ్ఞానము, మోహము, దేహాభిమానములు కలిగి ఉన్నది. ఇందులో సత్వగుణమే సర్వోత్తమమైనది. కావున నీకు సత్వగుణము, శుభము కల్గును. జీవి మరణ సమయమున సత్వగుణము వృద్ధి చెందినచో అతడు దివ్యలోకమును పొందును. రజోగుణము వృద్ధిచే మరణించిన ఆతడు కర్మాసక్తులైన మానవులలో జన్మించును. ఇక తమోగుణము వృద్ధిచే మరణించినవాడు తప్పక యమలోకమునకు చేరును. మూడు గుణములను అధిగమించిన పురుషుడు జన్మ, మృత్యు, జరా, దుఃఖములనుండి విముక్తుడై పరమానందమును పొందును. అట్లే గుణాతీతుడు కావలెనన్న ఏ పురుషుడు నన్ను అనన్యభక్తితో నిరంతరము భజించునో అట్టివాడు నన్ను చేరగలడు. మరియు నాశరహితుడైన సృష్టికర్తయైన బ్రహ్మకు సనాతన ధర్మమునకు అఖండ ఆధారమై నిలుచునని పరమాత్మ బోధన ముగించెను.

**15. పంచదశోధ్యాయము :**

**పురుషోత్తమ ప్రాప్తి – దాని సారాంశము :**

ఇందు పరమాత్మ విశ్వ సృష్టికి మూలమైన, సృష్టి స్థితి లయ కారకుడైన పరమాత్మ యొక్క శాశ్వత తత్వమును తెలిపియున్నాడు. జనన, మరణ సంసార వృక్షమును, త్రిగుణములనెడి జలములు తడుపుచుండును. ఈ జలములచే వృద్ధి పొందిన శాఖలే దేవ, మనుష్య, పశు, పక్షి, వృక్ష, పర్వతాది ప్రాణులు సర్వత్రా వ్యాపించియున్న వీటి చిగుళ్ళే విషయ భోగములు అహంకార, మమకారములే వృక్షపు వేర్లు. ఇది అన్ని లోకములను వ్యాపించి యున్నది. పరిశీలించి చూచినను దీని ఆది, అంతములు తెలియవు. కావున దృఢమైన ఈ సంసారపు వృక్షపు వేళ్ళను, దృఢమనే వైరాగ్యమునే శస్త్రంతో ఖండించి ఆదిపురుషుడైన పరమాత్మను, శరణు పొంది ప్రాపంచిక వాంఛలను తొలగించుకొనువాడు పరమేశ్వరుని చేరి శాశ్వతానందము ననుభవించును. కాగా మరుజన్మ యుండదు.

పరమాత్మ ఆత్మ తత్వమును, అర్జుననకు ఇలా విశదీకరించాడు

సకల చరాచర ప్రాణులందు, వారి దేహ హృదయమందున్న సనాతనమైన జీవాత్మ నా అంశమే. జీవుడు సూక్ష్మదేహమును, వాయువు వాసనలు తీసుకొని వెళ్ళునట్లు తన వెంట తీసుకొని పోవుచుండును. జీవాత్మ యనగా ఉపాధి శరీరమున ఆత్మ సూక్ష్మశరీరముచే అంటబడి ఉండి, మరణానంతరము ఒక ప్రాణిగా జన్మించును. జీవాత్మ ఒక శరీరమునుండి మరొక శరీరములో ప్రవేశించి విషయముల ననుభవించును. ఈ విషయమును అజ్ఞానులు తెలుసుకొనలేరు. జ్ఞానులు మాత్రమే తెలుసుకొందురు. ఏలనన వారు ఆత్మజ్ఞానులగుట చేత. నేనే సర్వప్రాణుల శరీరమందు వైశ్వానరాగ్ని రూపమున ఉండి వారు భుజించు భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్యములను చతుర్విధ ఆహార పదార్థములను జీర్ణింప చేయుచున్నాను. నేను వేదముల ద్వారా తెలిసికొన తగినవాడను. వేదాంతకర్తను, వేదజ్ఞుడను కూడా నేనే. నేను ఉత్తమ పురుషునిగా వేదములయందు ప్రసిద్ధికెక్కాను. ఓ అర్జునా! అత్యంత గోప్యమైన ఈ శాస్త్రమును నీకు తెల్పితిని. దీని తత్వమును తెలిసికొని ఆచరించువాడు జ్ఞానియై జన్మ కృతార్థుడు కాగలడు అనుచు అచ్యుతుడు తన



ప్రసంగమును ముగించెను.

**16. షష్టాదశోధ్యాయము -**
**దైవాసుర సంవిద్విభాగయోగము - సారాంశము**

మానవులు వారివారి ప్రారబ్ధ కర్మల ఫలంగా దైవ లక్షణములు మరియు అసుర లక్షణములను బొందుచున్నారు. అవి వారి పుణ్య, పాప కర్మలవలన సంప్రాప్తించుచున్నవి.

**దైవ సంపద గలవారి యందుండు (26) లక్షణములు :**

1. అభయం 2. సత్వ సంశుద్ధి 3. జ్ఞానయోగ వ్యవస్థితి 4. దానము 5. దమః 6. యజ్ఞః 7. సాధ్యాయః 8. తపః 9. ఆర్జవమ్ 10. అహింస 11. సత్యము 12. అక్రోధః 13. త్యాగః 14. శాంతిః 15. అపైశునమ్ 16. దయాభూతేషు 17. అలోలుప్త్యమ్ 18. మార్దవమ్ 19. హ్రీః 20. అచావలమ్ 21. తేజః 22. క్షమ 23. ధృతిః 24. శౌచమ్ 25. అద్రోహః 26. అతిమానితలు

అసుర లక్షణములు (6) : 1. దంభం 2. దర్పం 3. అభిమానః 4. క్రోధః 5. పారుష్యమ్ 6. అజ్ఞానః అని చెప్పుచూ అసుర స్వభావ లక్షణములు. దైవీ స్వభావ గుణములు, గుణసంపద ముక్తిదాయకము. అసురీ సంపద లక్షణములు గలవారు. బంధహేతువులై, సుఖ, దుఃఖ, విచారములలో మునిగి తేలుదురు. కావున అర్జునా! నీవు జన్మతః క్షత్రియుడవు. దైవీ సంపదలతో జన్మించినవాడవు. కనుక కామ, క్రోధ, లోభ, మోహములను వదలి శాస్త్రోక్తమై సత్కార్యముల నాచరించి ధర్మ, కర్మాచరణకు పూనుకొనుము. నీకు శుభము కల్గుననుచు, పరమాత్మ అర్జునునకు ఉపదేశించెను. ఇలా ఈ అధ్యాయము ముగిసినది.

**సప్తాదశోధ్యాయము - శ్రద్ధాత్రయ విభాగ**
**యోగము-సారాంశము :**

ఓ కృష్ణా! ఇప్పటివరకు నీవు నాకెన్నో విషయాలు వివరించి యున్నావు. అట్లే కృష్ణా! శాస్త్ర విధిని త్యజించి భక్తి శ్రద్ధలతో యజ్ఞములు, దైవపూజలు కొందరు భక్తులు అనుసరింతురు. అట్టి వారి నిష్ఠ సాత్వికమా! రాజసమా! తామసమా! నాకు దయతో సవివరముగా తెలియజేయుము అనినంత భగవానుడు అర్జునా! మానవులయందు సత్వ, రజో, తమో గుణములనునవి వారి వారి ప్రారబ్ధ పుణ్య పాప కర్మల ఫలితంగా వుండును. అదే వారి స్వభావంగా ఉండి నిష్ఠగా కర్మల నాచరింతురు. ప్రతి మనిషి యొక్క శ్రద్ధ, వారి అంతఃకరణము నేను వివరించిన గుణములకు అనుగుణముగానే ఉండును. వాని జీవన విధానము అట్టి శ్రద్ధతోనే కొనసాగుచుండును. వారిలో సాత్వికులైనవారు దేవతలను, రాజసులైనవారు యక్ష రాక్షసులను, ఇక తామసులైనవారు భూత ప్రేత గణములను ఉపాసించి పూజించెదరు. తామసగుణమందు శ్రద్ధ గలవారు దంభము, అహంకారము, కామముల ఆసక్తితో బలగర్వితులై శాస్త్ర విరుద్ధమైన ఘోర తపస్సు లాచరించి తమ శరీరమును, అంతర్యామియైన నన్నును కృశింపచేయుదురు. వీరు వట్టి అజ్ఞానులు. అసుర స్వభావము గలవారని గుర్తింపవలెను. మనుష్యుల స్వభావము ననుసరించి వారి ఇష్టమైన ఆహారము, యజ్ఞము, తపస్సు, దానములు మూడు విధములుగా ఉండును. అవి మొదటిది ఆహారము గురించి తెల్పెదను : 1. సాత్విక స్వభావులు : పాలు, చక్కెర వంటి రస పదార్థములు, వెన్న, నెయ్యి వంటి స్నిగ్ధ పదార్థములు, ఓజస్సును పెంచు స్థిర పదార్థములను ప్రీతితో స్వీకరింతురు. 2. రాజస స్వభావులు : చేదు, పులుపు, ఉప్పు, కారము, మిక్కిలి వేడి పదార్థములను మిక్కిలి మక్కువతో తీసుకుందురు. 3. తామస స్వభావులు : పూర్తిగా ఉడకని, రసహీనమైన, దుర్గంధమైన, పాచిపోయిన, ఎంగిలి, అపవిత్రములను భుజింతురు. ఇక యజ్ఞాచరణముల గురించి వివరించెదను. సాత్వికులు శాస్త్రోక్తముగా, ప్రతిఫలాపేక్ష లేక యజ్ఞముల నాచరింతురు. రజోగుణులు ఆడంబరము కొరకు, ప్రతిఫలాపేక్షతో యజ్ఞములు చేయుదురు. తామసులు శాస్త్రవిధులు పాటింపక అన్న, మంత్ర, దక్షిణ, శ్రద్ధాదులను పాటింపకనే యజ్ఞములు చేయుదురు.

ఇక త్రివిధములైన తపస్సుల గురించి వివరింతును. 1. శారీరక తపస్సు అనగా దేవ, బ్రాహ్మణ, గురు జ్ఞానులైన వారిని సేవించుచు శౌచము, నిరాడంబరము, బ్రహ్మచర్యము పాటించుచు చేయునట్టివి. 2. వాఙ్మయ తపస్సు : ఉద్వేగము లేనిది. సత్యమైన హిత వాక్యముల పలుకులు, శాస్త్రాధ్యయనము చేయుట అనునవి. 3. మానస తపస్సు : శాంత స్వభావము కల్గియుండి, మనశ్శీలునిగా ఉండి మనో నిగ్రహము అంతఃకరణ శుద్ధి కల్గియుండి చేయునది. ఇంకను చెప్పెదను. సాత్విక తపస్సు ఫలాపేక్ష రహితము. రాజస తపస్సు సత్కారములను, పూజలను, స్వార్థ ప్రయోజనములను, అనిశ్చిత, క్షణిక, అశాశ్వత ఫలములను

ఆశించి చేయునట్టిది. తామస తపస్సు : మొండి పట్టుదలతో ఇతరులను బాధించుటకై ఇతరులకు కీడు సల్పుటకై చేయునట్టిది. త్రివిధములైన దానముల గురించి చెప్పెదను వినుము. సాత్వికదానము నిష్కామంతో చేయునది. రాజసదానము ప్రత్యుపకారమాశించి చేయునది. తామసదానము సద్భావన లేకుండా అయోగ్యులకు, అపాత్రులకు చేయునట్టి దానము.

ఇక పరమాత్మకు గల నిర్దేశింపబడిన ఓమ్ తత్ సత్ అను త్రి నామముల గుఇంచి తెల్పెదను. ఓమ్ – దీనిని వేదమంత్రములలో ఉచ్ఛరించుచు నాచరింతురు. తత్ – మోక్ష కాంక్ష గలవారు ఫలాపేక్ష లేకుండా లోక హితార్థమై యజ్ఞ, దాన, తపఃశ్చర్యలయందు ఈ నామమును ఉచ్ఛరింతురు. అసత్ – అను నాల్గవది. ఇది అశ్రద్ధతో చేయబడిన హోమము, ఇచ్చు దానము, ఆచరించు తపస్సును అసత్ యని అందురు. దీనివలన జీవించియున్నగానీ మరణించిననుగానీ ఎట్టి ఫలితముండదు.

**18. అష్టాదశోధ్యాయము –**

**మోక్ష సన్యాస యోగము–సారాంశము :**

ఈ అధ్యాయంలో భగవానుడు అర్జుననకు మోక్షము గురించి అంటే ఆత్మ, సూక్ష్మదేహము నుండి బంధవిముక్తిని పొందుటయే ముక్తి లేక మోక్షము. సూక్ష్మ దేహమునుండి త్రిగుణములను తొలగించుకొని గుణాతీతుడగుట. గుణములు మనస్సులో కలుగు సంకల్ప వికల్పములకు కారణములు. అట్టి గుణములు తొలగిపోయినచో నిస్సంకల్ప స్థితి యంటారు. అనగా మనస్సును ఆత్మయందు లయమొనర్చు స్థితి. ఇది మరణానంతరము పొందునది కాదు. జీవించియుండగనే సాధించి దేహాంతమున పరమాత్మను చేరుట. దీనినే సంకల్ప స్థితి యని అందురని, కోరికలు కూడ సన్యసించుటచే, దీని మోక్ష సన్యాస యోగమనిరని, పరమాత్మ తెలిపినాడు. ఇంకను అర్జునుడు భగవానునితో దేవా! సన్యాసము, త్యాగము అనువానిని గురించి తెలుసుకొననున్నాను. కావున కృపయా తెలుపుడు అనగా పరమాత్మ, ఓయీ అర్జునా! కామ్య కర్మలను నశింపచేయుటయే సన్యాసము. కర్మఫలములను త్యజించుటయే త్యాగమని యందురు. యజ్ఞ, దాన, తపఃకర్మలు, పుణ్యకార్యములు కావున వాటిని త్యజింపరాదు. కాని వాటియందలి ఫలాసక్తిని మాత్రమే త్యజించుటయే ఉత్తమము. ప్రారబ్ధముగా ప్రాప్తించు కర్మలను త్యజింపరాదు. అది అజ్ఞానమే అగును. దీనినే తామస త్యాగమందురు. అట్లే కర్మలన్నియు దుఃఖ కారకములేనని భావించి ప్రారబ్ధ కర్మలను త్యజించుట రాజసత్యాగము. కర్మ ఫలమునందు ఆసక్తిని త్యజించి కర్మలను ఆచరించుటే సాత్విక త్యాగమని అందురు. దీనివలన సత్ఫలితములు కల్గును. కర్మలను త్యజించువాడే నిజమైన త్యాగి. కర్మఫల త్యాగము చేయు మనుష్యుల కర్మలకు అనిష్ట, ఇష్ట, మిశ్రమ ఫలితములు కల్గును. వీటిని వారు మరణానంతరము తప్పక అనుభవింపవలయును. త్యాగులైనవారికి కర్మఫలములు ఉండవు. వారు శాశ్వతానందమును పొందుదురు. ఈ మూడు విధములైన కర్మ సిద్ధులను పొందుటకు 5 కారణములు కలవు. 1. అధిష్ఠానము (శరీరము) 2. కర్త అనగా కర్మల నాచరించు దేహములోని జీవుడు. 3. వివిధములైన కారణములు అనగా మనస్సు, బుద్ధి, ఇంద్రియములు. 4. వివిధములైన చేష్టలు కరణములు, పంచానుకూల కర్మలు. 5. దైవము అనగా ప్రారబ్ధ పూర్వకర్మ సంసారములే దైవమని యందురు. సకల చరాచర ప్రాణులు ఈ కారణముల వలననే విహిత మరియు అహిత కర్మల నాచరించుదురు. అందుకు తగిన ఫలితములు బొందెదరు. కర్తృత్వ భావనలేని వాని బుద్ధి ప్రాపంచిక పదార్థములందు కర్మలే మూలమైనప్పటికిని కర్తృత్వ భావము లేకుండా యోగయుక్తుడై కర్మల నాచరించు పురుషుడు ఈ లోకమందు ఎవరిని హతమార్చినను పాపములంటవని చెప్పియున్నాడు. కర్మ ప్రవృత్తికి మూడు కారణములు గలవు. అవి కర్మ, కరణము, క్రియ అని చెప్పుచు, జ్ఞానము, కర్మ, కర్తయను ఈ మూడింటి సత్వ, రజో, తమో గుణములను బట్టి యాచరించు కర్మలను భగవానుడు ఇలా చెప్పుచున్నాడు. 1. సాత్విక జ్ఞానము 2. రాజస జ్ఞానము 3. తామస జ్ఞానమనునవి. సాత్వికము అందరి యందున్న పరమాత్మ ఒక్కడే. రాజసమున సమస్త ప్రాణులయందు వేరువేరుగా యుండునని తలంచుట. ఇక అర్థరహితము, హేతుబద్ధము కానిది తామస జ్ఞానము. తదుపరి పరమాత్మ త్రివిధ కర్మల గురించి ఇలా వచించినాడు. అవి సాత్విక, రాజస, తామస కర్మలు. వీటిని ఆచరించువారిని సాత్వికకర్త, రాజసకర్త, తామసకర్త అని పిలుతురు. సాత్వికులని సాత్విక, రాజసులది రాజస, తమోగుణములది తామస బుద్ధియని తెలిపినాడు. ఇక ధృతి యనగా ధారణా శక్తి యనియు, ఇవియును సాత్విక, రాజస, తమో ధృతులని మూడు రకములుగా యున్నవి. వీరు తమ ఆచరణమును బట్టి తగిన ఫలితముల ననుభవింతురు. అనంతరము ప్రకృతియందలి ప్రాణుల గురించి తెలుపుతూ – ఇవి యన్నియు ఈ త్రిగుణముల ప్రభావము చేతనే నడుచుకొనుచున్నవి అనుచు, అట్లే నర సమూహమును సైతము ఈ త్రిగుణములను బట్టియే 1. బ్రాహ్మణ 2. క్షత్రియ 3. వైశ్య 4. శూద్రులను నాల్గు వర్ణములుగా విభజించుట జరిగినదనెను. వారి వారి ధర్మములను, కర్తవ్య విధులను

సైతము వివరముగా తెల్పుట జరిగినది. నిష్కామకర్మ యోగ ఫలములను సైతము భగవానుడు అర్జునునకు తెలిపియున్నాడు. కావున ఓ అర్జునా! నీవు మోహ ప్రభావమున యుద్ధము చేయుటకు వెనుకాడుచున్నావు. అది కేవలము నీ అవివేకము. నీ నిశ్చయము వృథాయే యగును. నీ ప్రారబ్ధ కర్మ ప్రకారము ప్రకృతి నిన్ను యుద్ధము చేయ పురిగొల్పుచున్నది. ఇది విధి విధానము. కావున నీవు యుద్ధమొనరించి నీ కర్తవ్య పాలనము కావింపుము. కురుక్షేత్రమందలి ప్రతిపక్షము వారందరినీ సంహరించి వారిని విముక్తులను చేయుము. ఏలనన వారు ఇంతకుముందే నాచే మరణింపచేయబడి ఉన్నారు. నీవు నిమిత్త మాత్రుడవై కర్తవ్యమును నిర్వహింపుము. జరుగు జీవహింస వలన, జరుగు సంహారము వలన నీకెట్టి పాపమును ఈషణ్మాత్రమును అంటదు. అన్నింటికిని నేనే కర్తను “అహం కర్తా” యని హెచ్చరించుచూ అర్జునునిలో నావరించియున్న వ్యామోహములన్నింటిని పటాపంచలు గావించెను. అంత అర్జునుడు యుద్ధమందు స్థితప్రజ్ఞుడై నిలచి, భీకర యుద్ధమొనరించి విజయము సాధించెను.

**సంజయుని ఆనంద పరవశత్వము - ముగింపు :**

సంజయుడు వ్యాసభగవానుని వరప్రసాదంగా యుద్ధమంతయు తిలకించి కృష్ణార్జునుల సంవాదమును విని ధృతరాష్ట్ర మహారాజుతో ఇలా అన్నాడు. ఓ మహారాజా! యుద్ధభూమియందు కృష్ణార్జున సంవాదమును వింటిని. వేదవ్యాసుని దయవలన దివ్యదృష్టిని పొందినవాడనై యోగీశ్వరుడైన కృష్ణభగవానుని ఉపదేశము ప్రత్యక్షముగా వింటిని. ఇది అద్భుతమైనది. నిరంతరము దానినే స్మరించుచూ ఆనందమున ఓలలాడుచున్నాను. విలక్షణమైన హరిరూపమును పదే పదే స్మరించుచు నేను పొందిన సంభ్రమాశ్చర్యములకు అవధులు లేవు అని చెప్పి ధృతరాష్ట్రునకు తన సందేశమును, తన నిశ్చితాభిప్రాయమును చెప్పుచూ ఇంకనూ ఓ రాజా! యోగీశ్వరుడైన శ్రీకృష్ణ భగవానుడు, ధనుర్ధారియైన అర్జునుడు, అచట సర్వ సిరిసంపదలు, సర్వ విజయము, సకల ఐశ్వర్యములు సుస్థిరమై యుండును అని సంజయుడు తన నిశ్చితాభిప్రాయమును ప్రకటించెను.

**శ్లో ॥ యత్ర యోగీశ్వరః కృష్ణో! తత్ర పార్థో ధనుర్ధరః**
**తత్ర శ్రీ విజయ యోర్భూతి ధృవానేతి మతిర్మమః**

**శ్రీ కృష్ణార్పణమస్తు**

# వేములవాడ దగ్గరలోని నాంపల్లి నరసింహ క్షేత్రం

**- శ్రీమతి టి.లక్ష్మి**

కరీంనగర్ జిల్లాలో వేములవాడ ఒక ప్రఖ్యాత శైవక్షేత్రం. రాజరాజేశ్వరుడు దర్శనమిచ్చే పుణ్యక్షేత్రం. వేములవాడకు కేవలం కొన్ని కిలోమీటర్ల దూరంలో మరో పుణ్యక్షేత్రం ఉంది. అదే నాంపల్లి క్షేత్రం. అక్కడ నాంపల్లి గుట్టగా ప్రఖ్యాతి చెందిన కొండమీద శ్రీ నరసింహస్వామి కొలువై ఉన్నాడు. గుట్టమీద ఉన్న ఒక పెద్దబండరాయి మీద నరసింహస్వామి మూర్తి చెక్కి ఉంటుంది. ప్రస్తుతం ఆ మూర్తి చుట్టూ ఒక ఆలయం నిర్మించారు. ప్రహ్లాదుని రక్షించడానికి అతని కోరిక మీద స్తంభం చీల్చుకుని బయటకు వచ్చి హిరణ్యకశిపుణ్ని సంహరిస్తాడు నరసింహస్వామి. సరిగ్గా అలాంటి విగ్రహం (స్తంభం చీల్చుకుని వస్తున్నట్లుండే) ఇక్కడ కనిపించడం విశేషం.



ఇక్కడనే నిర్మించిన నాగదేవత ఆలయం అద్భుతంగా ఉంటుంది. ఈ ఆలయం ఒక సొరంగంలో ఉంటుంది. సొరంగం అంతా పాము పడుకుని ఉన్న ఆకారంలో నిర్మించారు. అందులో నడుచుకుంటూ వెళ్ళి నాగదేవతను దర్శించుకోవాలి. నడకదారిలో అటూ ఇటూ వివిధ దేవతా విగ్రహాలు మనల్ని ఆహ్వానిస్తున్నట్లనిపిస్తుంది. ఈ సొరంగంలోకి వెళ్ళడానికి టికెట్ తీసుకోవలసి ఉంటుంది. నాగదేవత ఆలయం ముందు నరసింహస్వామి స్తంభం చీల్చుకుని బయటకు వస్తున్నట్లుండే విగ్రహం ఉంది. ఇక్కడే శ్రీకృష్ణుడు కాళియునిపై నాట్యం చేస్తున్నట్లుండే మరో అద్భుత విగ్రహం ఉంది. ఈ విగ్రహం పాముతో సహా పడగ అంతా చాలా పెద్దగా అతి సుందరంగా ఉంటుంది.

## తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా
## పంచ దశ (15వ) పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ!

# శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము

ఈ సంవత్సరము
తిరుమల శ్రీవారికి
సమర్పించబోయే 7 కోట్ల
జపములో భాగస్వాములు కండి!
ఆ స్వామి కరుణా
కటాక్షములకు పాత్రులు
కండి..!



మీ మీ కోరికలను
తీర్చమని తిరుమల
శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని
ప్రార్థించే భాగ్యాన్ని మాకు
ప్రసాదించండి!

## సంకల్పం

శ్రీ వేంకటేశ్వరుని కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో... ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫారం ఆవరణలో జపహోమములు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

## నిబంధనలు:

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుండి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/- ఎం.ఓ. (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/- కి తక్కువ కాకుండా పంపండి).
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం', ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్-500 007. అను చిరునామాకు మాత్రమే నేరుగా గానీ/ పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జపసమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతోపాటు ఆహ్వానపత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగి రూ. 5/-లు స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం... 'ఓం నమో వేంకటేశాయ'

గమనిక:

1. మేము శ్రీవారికి 2002 నుండి 2018 వరకు ప్రతి సంవత్సరము సమర్పించదలచిన ఏడు కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.
2. స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు...!

## శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం

ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్- 500007. ఫోన్: 040-27175050

**ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి : 9348212354**

# నవవిధ ముక్తిమార్గాలు

# స్మరణ ప్రాశస్త్యం

డా॥ ఆదంకి శ్రీనివాస్

**న**వవిధ భక్తిమార్గాలు నవవిధ ముక్తిమార్గాలు. ఈ తొమ్మిది భక్తిమార్గాలలో దేనిని ఆశ్రయించినా అనుసరించినా ముక్తి లభిస్తుంది. ఆత్మానం పాశేభ్యః మోచయతీతి మోక్ష. బంధవిముక్తి. ముక్తిః కైవల్య నిర్వాణశ్శ్రేయోనిశ్శ్రేయసామృతమ్ మోక్షః అపవర్గః ముక్తి, కైవల్యం, నిర్వాణం, శ్రేయస్సు, నిశ్శ్రేయసం, అమృతం, మోక్షము, అపవర్గం అనేవి మోక్షానికి పర్యాయపదాలు.

కేవల నామస్మరణ చేతనే మోక్షాన్ని ప్రసాదించే భక్తసులభుడు శ్రీమన్నారాయణుడంటోంది భాగవతం. ఆయన్ని భక్తితో కీర్తించడంకన్నా వేరైన మార్గం లేదని ఆధ్యాత్మవిదులు పేర్కొంటున్నారు. భాగవతం ప్రకారం 'శ్రవణం, కీర్తనం విష్ణోః పాదసేవనం అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్' అనే తొమ్మిది భక్తిమార్గాల ద్వారా శ్రీహరిని పొందవచ్చు. వీటిలో అత్యంత సులభమైనది నామసంకీర్తనం.

భక్తి అంటే ఆకర్షణ. భగవంతుని వైపు మనసులు ఆకర్షింపబడడం. భగవదాకర్షణకు గురయినవారు ఆకార వికార చేష్టాదులలో సామాన్య జనాతీతులై కన్పిస్తారు. వీరి జిహ్వికి ఎల్లప్పుడూ నామస్మరణ చేస్తూనే ఉంటుంది. అందువల్ల వీరు ధన్యాత్ములవుతారు. దీనికి కారణం నామస్మరణే.

పైన పేర్కొన్న తొమ్మిది రకాలైన భక్తిమార్గాలను ఎంచుకొని ఎందరో ఎన్నోవిధాలుగా కైవల్యాన్ని పొందారు. అయితే ఒక్క హరినామ సంకీర్తన ఒక్కటే సులభం. ఆచరణలో మిగిలినవన్నీ ఎంతో కొంత కష్టమైనవే.

హరికథా శ్రవణం చేయాలంటే చెప్పేవారు ఉండాలి. చెప్పేవారుంటే చాలదు. వారికి పౌరాణిక జ్ఞానం ఉండాలి. లేకపోతే సత్కథా శ్రవణం కుదరదు.

అలాగే భగవంతునికి గానీ భాగవతోత్తములకు గానీ సేవ చేయడానికి కూడా కొంత అవరోధం ఉండనే ఉంటుంది.

అర్చన ద్వారా, వందనాలర్పించడం ద్వారా శ్రీహరి కృపకు పాత్రులవడం కష్టసాధ్యమైనదే.

భగవద్భక్తులు మనకు అందుబాటులో ఉండాలి. అలా లేనపుడు 'దాసత్వం' కూడా కష్టతరమైనదే. భక్తిమార్గాలన్నింటిలో శ్రీమహావిష్ణువును ప్రసన్నం చేసుకోవడానికి 'హరినామ స్మరణమే' సులభసాధ్యమైన సాధన మార్గం.

ప్రహ్లాదుడు నిరంతరం హరినామ స్మరణంలో మునిగి తేలుతూ ఉండేవాడు. అత్యల్ప ప్రాయంలో హరికృపకు పాత్రుడయ్యాడు. అలాగే నారదమహర్షి నిత్యం 'నారాయణ' నామాన్ని స్మరిస్తూ, జపిస్తూ శ్రీహరికి అత్యంత ప్రీతిపాత్రుడయ్యాడు.

భగవత్ తత్త్వం తెలిసినవారు కావడం వల్లనే అనేకానేక మహర్షులు, పుణ్యజనులు, విష్ణుభక్తి పరాయణులు హరినామ స్మరణాన్నే అత్యంత సులభసాధ్యమైన మోక్షసాధనమని నమ్మారు. సదా ఆ నామాన్ని స్మరిస్తూ తన్మయులవుతున్నారు.

జానపదులలో కూడా భగవన్నామ స్మరణమే అత్యంత ప్రాచుర్యంలో ఉంది. వీరికి వేదవేదాంగాలు గానీ, స్తోత్ర పారాయణలు గానీ, దండకాల్ని అనుసంధించడం గానీ తెలీదు. కానీ మనసునిండా నిశ్చలమైన భక్తి, భగవంతుని యెడల అవ్యాజమైన అనురాగం మెండుగా ఉంది.

భగవంతుని మెప్పించి, అతని దయా వీక్షణాలకి పాత్రులవడానికి, వేదాంత విజ్ఞతగాని, పురాణపాండిత్యంగాని, బహుగ్రంథ పరిచయంగాని, నిత్య స్తోత్రపారాయణా పరాయణత్వంగాని అక్కర్లేదు. నిష్కల్మషమైన భక్తి, భగవంతునిపై అవ్యాజమైన అనురాగం ఉంటే చాలు. ఆ అనురాగాన్ని తెలిపేందుకు అద్భుతమైన సాధనమే నామస్మరణం.

మిగిలిన వాటిలో లాగా నామస్మరణలో ఏమాత్రమూ క్లిష్టత లేదు. దీనికి మరొకరితో ప్రమేయం అక్కర్లేదు. పూజాది విధులను ఆచరించడానికి అవసరమైన సామగ్రితో నిమిత్తం లేదు. స్వచ్ఛమైన మనస్సు, ఆ మనసులో నిర్మలమైన భక్తి,

నిత్యం నామస్మరణకు సంసిద్ధమైన 'జిహ్వాక' ఉంటే చాలు. వీటితో హరినామ స్మరణ చేస్తూ తరించవచ్చు.

ఈ నేపథ్యంలో పరమ పుణ్యదాయకమూ, సర్వ మనోరంజకమైన రామ శబ్దాన్ని హరి శబ్దానికి మేళవించి, 'హరేరామ హరేరామ రామ రామ హరే హరే' అనే పారాయణ నామ పదబంధాన్ని కల్పించారు. దీనితోపాటుగా సర్వజన రక్షకుడైన శ్రీకృష్ణుని పేరును కూడా అనుసంధానం చేసి, 'హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే' అనే ద్వితీయ పాదాన్ని జోడించారు.

ఈ నామకీర్తనలో మరొక విశేషం ఉంది. శ్రీమన్నారాయణుని అష్టాక్షరీ మంత్రమైన "ఓం నమో నారాయణాయ"లో మొత్తం ఎనిమిది బీజాక్షరాలుంటాయి. పై కీర్తనా పదబంధంలో కూడా రామ, హరి, కృష్ణ శబ్దాలు ఎనిమిది సార్లు ప్రయోగింపబడ్డాయి. దీనిని పరిశీలిస్తే ఈ నామాలు కేవలం స్మరణ కోసమే ఏర్పాటు చేయబడినవి కావు. అష్టాక్షరీ మంత్ర రహస్యాన్ని తెలుసుకొన్న విజ్ఞులు ఆ మంత్రం అందరికీ అందుబాటులో లేకపోవడం వల్ల, పామరుల కోసం "హరేరామ హరేరామ రామ రామ హరే హరే, హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే అనే దానిని రూపొందించారు. దీనిలో హరి శబ్దాన్ని మొత్తం ఎనిమిది సార్లు, రామావతారం, కృష్ణావతారం విష్ణువు అవతారాలే కాబట్టి రామ, కృష్ణ శబ్దాల్ని ఎనిమిది సార్లు స్మరించడం ద్వారా పదహారుసార్లు స్మరించినట్లవుతుంది. ఇది మన పూజా విధానంలో 'షోడశ'కు సరిపోతుంది. సర్వం శ్రీకృష్ణార్పణమనే తాదాత్మ్యంలో మనకి అందుబాటులో ఏవి ఉన్నా లేకపోయినా ఈ తారకనామాన్ని స్మరిస్తే చాలు. ఈ నామస్మరణ ద్వారానే మోక్షాన్ని పొందవచ్చు. దీనికి సంబంధించిన కథలు కూడా ప్రచారంలో ఉన్నాయి.

పూర్వం అజామీళుడనేవాడు తాను జీవించినంత కాలమూ పాపాలు చేస్తాడు. అవసానదశలో తన కుమారుడి పేరైన 'నారాయణ' శబ్దాన్ని పలుమార్లు ఆర్తితో ఉచ్చరిస్తాడు. ఇక్కడ అజామీళునికి ఉన్నది పుత్రవాత్సల్యమేగాని భక్తి కాదు. కొడుకు పేరు నారాయణ కావడం వల్ల, ఆ నామాన్ని స్మరించడం వల్ల అంతకుముందు ఎన్నో పాపాలు చేసినప్పటికీ అతనికి ఉత్తమలోకాల్ని ప్రసాదించాడు శ్రీమహావిష్ణువు.

**'క్రూరాత్ముడజామీళుడు**
**నారాయణ యనుచు నాత్మనందను బిలువన్,**
**ఏరీతి నేలుకొంటివి**
**ఏరీ నీసాటి వేల్పు లెందును కృష్ణా'**

అంటూ కృష్ణశతక కర్త శ్రీకృష్ణుని కీర్తిస్తాడు. హరినామస్మరణంలో ఇంతటి మాహాత్మ్యం ఉన్నదన్నమాట.

అలాగే ఒక స్త్రీ తన పెంపుడు చిలుకకు 'శ్రీరామ' అని పేరు పెట్టుకుంది. పదేపదే శ్రీరామ నామాన్ని స్మరించింది. రామనామ స్మరణ చేయడం వల్ల మోక్షాన్ని పొందింది.

**చిలుకనొక రమణి ముద్దుల**
**చిలుకను శ్రీరామ యనుచు శ్రీపతి పేరున్**
**బిలిచిన మోక్షము నిచ్చితి**
**వలరగ నిను దలచు జనుల కరుదా! కృష్ణా!**

ఈ రెండు కథల్లోనూ ఉద్దేశ్యపూర్వకంగా హరినామ స్మరణ చేయకపోయినప్పటికీ వాళ్ళు సద్గతులు పొందారు. భగవంతుని పైనే మనసు ఉంచి ఉద్దేశ్యపూర్వకంగా చేసినట్లయితే ఇంకా మహత్తరమైన ఫలితాన్ని పొందవచ్చుకదా? ఈ మాహాత్మ్యం తెలిసినవాడు కాబట్టే శ్రీకృష్ణ శతకకర్త –

**'హరియను రెండక్షరములు**
**హరి యించును పాతకముల నంబుజనాభా!**
**హరి నీ నామ మహత్వము**
**హరి హరి పొగడంగ వశమె! హరి శ్రీకృష్ణా**

అని హరినామ మాహాత్మ్యాన్ని పేర్కొన్నాడు.

కొంతమంది భక్తులు నామసంకీర్తనం చేస్తారు. వారితోపాటుగా నలుగురినీ కూడగట్టుకొని నగర సంకీర్తన చేస్తూ ప్రభాతవేళల్లో అందరినీ మేల్కొలుపుతారు. కళాకారులు, హరిదాసులూ కూడా 'హరిలో రంగ హరీ' అని స్మరిస్తూ తరిస్తారు. గ్రామీణులు భజన సమాజాలుగా ఏర్పడి, నిరంతరం స్వామిని భజిస్తూ కీర్తిస్తారు. ఎందుకంటే హరి నామస్మరణ అన్నిటికంటే సులభమైనది కావడం వల్లనే.

మనిషి ప్రాపంచిక బంధనాలకు అతీతుడు కాడు. అలా అని దైవచింతన లోపిస్తే సార్థకత ఉండదు. ఆధునిక కాలంలో అనేక సంక్షోభాలు. కాలాన్ని, ధనాన్ని వెచ్చించి ఉత్కృష్టమైన దైవసంబంధిత క్రియలు చేయడం కష్టం. ఇలాంటి పరిస్థితులలో మనిషిని ఉల్లాసంగా ఉంచి, మనసుని ఉత్సాహపరచి, ఆధ్యాత్మిక చింతనలో తాదాత్మ్యం చెందేట్లు చేయగలిగేది నామస్మరణ ఒక్కటే.

మనం ఎక్కడ ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నా నామస్మరణ చేయడానికి అభ్యంతరంగానీ, ఆటంకంగానీ ఏదీ ఉండదు. మిగిలినవాటిలో లాగా దీనికి వ్యయప్రయాసలకు తావు లేదు. కాలాన్ని వెచ్చించనక్కరలేదు. కార్యాల్ని ఆపుకోనవసరం అంతకన్నా లేదు. మనం చేయవలసిన విద్యుక్త ధర్మాల్ని ఒకవైపు ఆచరిస్తూనే నామ సంకీర్తనం చేసుకోవచ్చు. పని సమయాలలోనో, తీరిక వేళలలోనో, పని చేస్తూనో ఎప్పుడైనా హరినామాన్ని మనసారా స్మరించవచ్చు. దీనికి ఏవి ఉన్నా లేకపోయినా నిరంతరం స్వామి మీద దృష్టి ఉండాలి.

అచంచలమైన భక్తి, అవ్యాజమైన అనురాగం ఉండాలి. అలా ఉంటే హరినామాన్ని స్మరించడం, తరించడం చాలా సులభం. దీనికి ప్రధానమైనది మనసే. మనసు నిరంతరం ఆ స్వామినే కోరుకున్నట్లయితే, నోరు ఆ నామాన్నే నిత్యం స్మరిస్తూ ఉంటుంది. అందుకే అందరూ హరినామాన్ని మనసుకి మప్పాలి. ఆ హరినామ స్మరణలోని మాధుర్యాన్ని ఆస్వాదించేలా చేయాలి. హరి నామస్మరణ ద్వారా వచ్చే ఆనందాన్ని అనుభవించేలా చేయాలి.

ఈ ఆశయంతోనే అన్నమయ్య హరినామ స్మరణలోని శక్తిని తెలుసుకొని మసలుకోమని మనసుకు ఈవిధంగా ఉద్బోధ గావించాడు. 'హరి నామమే! కడు ఆనందకరము; మరుగవో మరుగవో మరుగవో మనసా హరినామమే కడు ఆనందకరము...'

ఇంతటి మహత్త్వం కల హరినామాన్ని గానీ, లేదా విష్ణు సహస్రనామాలలో ఏదైనా ఒక నామాన్ని స్వీకరించి, నిత్యం ఆ నామస్మరణలో తాదాత్మ్యం చెంది తరించేవారే భగవంతునికి అత్యంత ప్రీతిపాత్రులవుతారని భాగవతోత్తముల నమ్మిక.

భవసాగరాన్ని దాటించేది హరినామ స్మరణమేనని దశావతార స్తుతి పేర్కొంటోంది.

**'నామస్మరణా దన్యోపాయం నహి పశ్యమో భవతరణే**
**రామ! హరే! కృష్ణ! హరే! తవనామ వదామి సదానృహరే**
**వేదోద్ధార విచార మతే! సోమక దానవ సంహరణ**
**మీనాకార శరీర! నమో భక్తం తే పరిపాలయ మామ్'**

దుఃఖ భూయిష్టమైన సంసార బంధనాలనుండి విముక్తిని ప్రసాదించే దివ్యమైన సాధనం హరినామ స్మరణాన్ని మించినది వేరొకటి లేదు. అందువల్ల నిత్యం హరినామ స్మరణ చేయడం ద్వారా సద్గతుల్ని పొందవచ్చు. మత్స్యరూప ధారియైన శ్రీమన్నారాయణుడు సదా మమ్మల్ని రక్షించుగాక.

**నామస్మరణాదన్యోపాయం నహి పశ్యామో భవతరణే**
**రామహరే కృష్ణహరే తమనామ వదామి సదానృహరే**
**మంథనా చలధారణ హేతో దేవాసుర పరిపాలవిభో**
**కూర్మాకార శరీర నమో భక్తం తే పరిపాలయమామ్**

దేవతలకు అమృతాన్ని పంచివ్వడం కోసం మంథాచలాన్ని వీపుపై భరించిన కూర్మాకార శరీరుడైన శ్రీహరి మాకు సంబంధించిన సకల భారాలనూ తానే వహించి మమ్మల్ని పరిపాలించుగాక!

**'నామ స్మరణాదన్యోపాయం నహి పశ్యామో భవతరణే**
**రామహరే కృష్ణహరే తవనామ వదామి సదానృహరే**
**భూచోరకర పుణ్యమతే క్రీడోద్భూత భూ శ్రీనృహరే**
**క్రోడాకార శరీర నమో భక్తంతే పరిపాలయమామ్**

సముద్ర మధ్యంలో మునిగిపోయిన భూగోళాన్ని క్రోడాకార శరీరునిగా అవతరించి సముద్ధరించి శ్రీహరి పాపకూపంలో మగ్గుతున్న మమ్మల్ని కూడా సముద్ధరించి పరిపాలించుగాక!

**'నామ స్మరణాదన్యోపాయం నహి పశ్యామో భవతరణే**
**రామహరే కృష్ణహరే తవనామ వదామి సదాన్నృహరే**
**హిరణ్యకశిపుచ్ఛేదనహేతో ప్రహ్లాదా భయధారణహేతో**
**నరసింహాచ్యుత రూప నమో భక్తం తే పరిపాలయమాం'**

మహాగర్విష్ఠి, హరినామ ద్వేషి అయిన హిరణ్యకశిపుని సంహారానికి హేతువైనవాడు, ప్రహ్లాదుని వాత్సల్యంతో రక్షించి అభయహస్తాన్నిచ్చి రక్షించినవాడూ అయిన నరసింహరూపధారి అయిన శ్రీమన్నారాయణుడు సదా విపత్తులలో మమ్ము రక్షించి పరిపాలించుగాక!

**'నామ స్మరణాదన్యో పాయం నహి పశ్యామో భవతరణే**
**రామహరే కృష్ణహరే తవనామ వదామి సదా నృహరే**
**భవ బంధన హర వితత మతే పాదోదక విహతాఘ తతే**
**వటుపటు వేష మనోజ్ఞ నమో భక్తం తే పరిపాలయమాం'**

కేవలం తన పాదోదక మాత్ర విశేషంచేత భవబంధనాల నుండి విముక్తిని కలిగించి రక్షించే ప్రభువు, వటు వేషంలో మనోజ్ఞాకారుడైన శ్రీమహావిష్ణువు మమ్మల్ని పరిపాలించుగాక!

**'నామ స్మరణా దన్యోపాయం నహి పశ్యామో భవతరణే**
**రామహరే కృష్ణహరే తవనామ వదామి సదానృహరే**
**క్షితిపతి వంశ క్షయకర మూర్తే క్షితిపతి కర్తాహర మూర్తే**
**భృగుకుల రామ పరేశ నమో భక్తం తే పరిపాలయమాం'**

దుర్మదాంధులైన రాజులను సంహరించిన ఉగ్రస్వరూపి, పరశును ధరించి రక్షణ భారాన్ని వహించే పరశు రామావతారియైన శ్రీహరి పరిపాలించు గాక!

**'నామ స్మరణా దన్యోపాయం నహి పశ్యామో భవతరణే**
**రామహరే కృష్ణహరే తవనామ వదామి సదానృహరే**
**సీతావల్లభ దాశరథీ దశరథ నందన లోకగురో**
**రావణ మర్దన రామ నమో భక్తం తే పరిపాలయమామ్'**

దశరథ నందనుడై, లోక కళ్యాణార్థం ఉద్భవించి, రావణాది దానవుల్ని సంహరించి, సజ్జనులను రక్షించి, ఆదర్శ పురుషుడైన రామావతారధారి శ్రీహరి మమ్మల్ని సదా పరిపాలించుగాక.

**'నామ స్మరణా దన్యోపాయం నహి పశ్యామో భవతరణే**
**రామహరే కృష్ణహరే తవనామ వదామి సదానృహరే**
**కృష్ణానంత కృపా జలధే కంసారే కమలేశ హరే**
**కాళియ మర్దన లోకగురో భక్తం తే పరిపాలయమామ్'**

కంసాది దానవ సంహారార్థం, భక్తజన సంరక్షణార్థం కృష్ణావతారాన్ని ధరించి ధర్మసంస్థాపన కోసం పాటుపడిన అనంతరూపుడూ కృపాజలధి అయిన శ్రీమన్నారాయణుడు సర్వదా పరిపాలించుగాక!

**'నామ స్మరణా దన్యోపాయం నహి పశ్యామో భవతరణే**
**రామహరే కృష్ణహరే తవనామ వదామి సదాన్నృహరే**
**దానవసతి మానాపహార త్రిపుర విజయ మర్దన రూప**
**బుద్ధ జ్ఞాయ చ బౌద్ధ నమో భక్తం తే పరిపాలయమాం'**

హింసాశక్తులు విర్రవీగుతున్న తరుణంలో సచ్చరిత్రతో, జీవకారుణ్యం వహించి దివ్యప్రబోధలతో లోకాన్ని సత్పథంలో నడిపేందుకు బుద్ధునిగా అవతరించిన శ్రీమన్నారాయణుడు ఎల్లప్పుడూ మమ్మల్ని రక్షించు గాక!

**'నామ స్మరణా దన్యోపాయం నహి పశ్యామో భవతరణే**
**రామహరే కృష్ణహరే తవనామ వదామి సదాన్నృహరే**
**శిష్టజనావన దుష్టహర ఖగతురగోత్తమ వాహన తే**
**కల్కి రూప పరిపాల నమో భక్తం తే పరిపాలయమాం'**

కలియుగ ఘోరకృత్యాల నణచివేసి, శిష్టరక్షణ, దుష్టశిక్షణలకోసం, శ్వేతాశ్వంపై ఖడ్గధారియై అవతరించే కల్కి స్వరూపాత్మకుడైన శ్రీమన్నారాయణుడు సర్వదా మమ్మల్ని రక్షించి పరిపాలించుగాక!

అనేక సందర్భాలలో దివ్యావతారాల్ని ధరించి శిష్టులను గాచిన దయాహృదయుడు ఆ శ్రీహరి. దశావతార దివ్యలీలా విలాసాలను కీర్తిస్తూ, ఆయా నామాలతో హరినామ స్మరణం గావించడం కన్నా వేరే అత్యుత్తమమైన మోక్ష ప్రదాయకమైనదేదీ లేదని ఈ స్తోత్రం నిరూపిస్తోంది.

శ్రీహరి దశావతారాలలో రామ, కృష్ణావతారాలు అత్యంత మహిమోపేతమైనవి. స్వామివారి దీనజనపాలన ఈ రెండు అవతారాలలో విశేషంగా కన్పిస్తుంది.


లోకంలో శాంతిని స్థాపించడం కోసం, ధర్మాన్ని రక్షించడం కోసం మానవ జీవనానికి సంబంధించిన తాత్త్విక రహస్యాలను ప్రకటించడం కోసం ఈ రెండు అవతారాలలోనూ స్వామి తన లీలా విశేషాలను ప్రదర్శించాడు.

అందుకే 'రామహరే కృష్ణహరే తవనామ వదామి సదా నృహరే' అంటూ రామశబ్దాన్నీ, కృష్ణశబ్దాన్నీ నిరంతరం స్మరించడం పుణ్యదాయకం. ఆ నామ స్మరణ చేస్తూ భవబంధాలనుండి విముక్తిని, పరమపదాన్ని ప్రసాదించమని స్వామిని పరిపూర్ణ భక్తి చిత్తాలతో వేడుకొమ్మని ఈ స్తోత్రంలోని ఫలశ్రుతి నిరూపిస్తోంది.

**అవినయ మపనయ విష్ణో**
**దమయ మన శ్శమయ విషయమృగతృష్ణాం**
**భూత దయాం విస్తారయ**
**తారయ సంసార సాగరతః**

***

# రచనలకు 'శ్రీ వేంకటేశం' ఆహ్వానం



**'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం. రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం. ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి. మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.**

రచనలు పంపవలసిన చిరునామా:

**'శ్రీ వేంకటేశం' ఆధ్యాత్మిక మాసపత్రిక,** (శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354

ధారావాహిక



# శ్రీవారి భక్తులు

- ఆచార్య కసిరెడ్డి

**అందరూ శ్రీవారి భక్తులే**
**పరమాత్మను స్మరిస్తూనే పనిచెయ్!**
**ఇది పెద్దలమాట! పెరుగన్నం మూట!!**

కలియుగంలో భక్తికే ప్రాధాన్యం; కృతయుగంలో ధ్యానానికి ప్రాధాన్యం; త్రేతాయుగంలో జ్ఞానానికి ప్రాధాన్యం; ద్వాపరయుగంలో ధర్మానికి ప్రాధాన్యం.

ఇవన్నీ ఈనాటి మనిషికి కావాలి. తానే పని చేస్తున్నా ధ్యాన, జ్ఞాన, ధర్మ, కర్మ, భక్తి యోగాల ద్వారా పరిపూర్ణ మానవుడు కావాలి. ఆధునిక కాలంలో భక్తి ద్వారా సమాజంలో అందరినీ కలుపుకొని పోవాలి. హెచ్చు తగ్గులు లేని, అందరూ సమానమని భావించే సమాజాన్ని నిర్మాణం చేసుకొని శాంతియుతంగా జీవించాలి.

భక్తి ద్వారానే మానవుడు దివ్యుడవుతాడు. పశువు నుండి పశుపతిత్వానికి, నరుని నుండి నారాయణత్వానికి, జీవుని నుండి దేవుని తత్వానికి మనిషి ఎదగాలి.

ఈ సందేశాన్ని అందించడానికి అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ వేంకటేశ్వరస్వామి అందరినీ తన సన్నిధికి పిలుచుకొంటున్నాడు. ఎవరు ఏ విధంగానైనా రానీ, అందరికీ స్వామి దర్శనం లభిస్తుంది.

తిరుమల కొండపై పాదం మోపి, శ్రీవరాహస్వామిని దర్శించి, తదనంతరం శ్రీ శ్రీనివాస పరబ్రహ్మాన్ని గోవిందా గోవిందా అంటూ సేవించి, శ్రీవారి శ్రీపాద దర్శనం చేసుకోవడం కొరకు భక్తులందరూ తపిస్తారు; ఈ దర్శనాలతో తరిస్తారు.

**వేడుకొందామా వేంకటగిరి వేంకటేశ్వరుని**
**వేడుకొందామా వేంకటగిరి వేంకటేశ్వరుని**
**ఆమటి మ్రొక్కులవాడే ఆదిదేవుడు వాడు**
**తోమనిపళ్యాల వాడే దురిత దూరుడే**
**వడ్డికాసులవాడే వనజనాభుడే పుట్టు**
**గొడ్డు రాండ్రకు బిడ్డలనిచ్చే గోవిందుడే**
**ఎలమి గోరిన వరాలిచ్చే దేవుడే వాడు**
**అలమేల్మంగా శ్రీ వేంకటాద్రి నాథుడే**

కొండలలో నెలకొన్న ఆ కోనేటి రాయణ్ణి గూర్చి అలా పాడుకొంటూ భక్తులు కాలినడకన కొండ ఎక్కుతారు. ఒక్కరా ఇద్దరా వందలు, వేలు, లక్షలు.

**శ్రీ శ్రీనివాసా గోవిందా**
**శ్రీ వేంకటేశా గోవిందా**
**భక్తవత్సలా గోవిందా**
**భాగవతప్రియ గోవిందా**

అంటూ వెళ్ళి మొక్కులు చెల్లించుకొంటారు. స్వామి ఆశీర్వాదాలు అందుకొంటారు. ఏడాదికోసారి ఇట్లా వస్తాము అని దండం పెట్టుకొని వెళ్ళిపోతారు.

ఇలా వకుళమాత దగ్గరి నుండి అన్నమయ్య వరకు స్వామిని సేవించుకొన్న భక్తులూ, భక్తురాండ్రూ మళ్ళీ మళ్ళీ పుడుతున్నారు; స్వామిని సేవిస్తున్నారు.

ఒక్కసారి కాదు 108 పర్యాయాలు స్వామి దర్శనార్థం కాలినడకన వచ్చిన వారున్నారు. ఎప్పుడూ సన్నిధిలో ఉన్నవారేగాక, లక్షలాదిమంది వచ్చిపోయే భక్తులను స్వామి తన కరుణా కటాక్ష వీక్షణాలతో రక్షిస్తున్నాడు; పోషిస్తున్నాడు; జీవితంలో దివ్య భవ్య మార్గాన్ని చూపిస్తున్నాడు.

ఆర్తత్రాణ పరాయణుడైన ఆ స్వామి వేంకటాద్రి ఆనంద నిలయంలో అర్చారూపంలో వెలయడానికి పూర్వం ఎన్నో అవతారాలెత్తాడు. ప్రపంచంలో దశ తప్పినప్పుడల్లా శ్రీమన్నారాయణమూర్తి అవతరించారు. అందుకే ఇవి దశావతారాలయ్యాయి.

## దశావతారాలు

1. వేదాలను (దివ్యజ్ఞాన గ్రంథాలను) సోమకాసురుడు బ్రహ్మ దగ్గరి నుండి అపహరించుకొని పోయాడు. ప్రపంచానికే జ్ఞాన ధర్మ కర్మ ఉపాసనాంశాలను బోధించే ఆ దివ్య వేదాలను రక్షించడానికి శ్రీమన్నారాయణమూర్తి మత్స్యమూర్తిగా అవతరించారు. సోమకాసురుణ్ణి శిక్షించి వేదాలను బ్రహ్మదేవునికందించాడు. మత్స్యరూపంలో జీవధాతువులనూ రక్షించాడు.
2. దేవాసురులు క్షీరసాగరాన్ని మథించి అమృతాన్ని పొందే ప్రయత్నంలో ఉన్నారు. సాగరంలో మంథర పర్వతం క్రుంగుతున్నది. అప్పుడు శ్రీమన్నారాయణమూర్తి కూర్మావతారమెత్తారు. మంథరాన్ని నిలిపారు. అమృతావిర్భావానికి దోహదం చేశాడు. అమృతం దేవతలకి పంచడానికి జగన్మోహినీ రూపం ధరించాడు.
3. జలప్రళయంలో మునిగిపోయిన భూమిని ఉద్ధరించడానికి వరాహావతారమెత్తి, హిరణ్యాక్షుణ్ణి సంహరించాడు. అప్పటి నుండి వరాహాద్రిలోనే ఉంటున్నాడు. తిరుమలకు వచ్చే భక్తుల మొదటి పూజలందుకుంటున్నాడు.
4. హిరణ్యకశిపుడు లోకకంటకుడుగా మారాడు. భక్తుడైన తన కొడుకు ప్రహ్లాదుణ్ణి అనేక విధాల హింసలకు గురిచేశాడు. నరసింహావతారమెత్తి ఆ దుష్ట రాక్షసుణ్ణి శ్రీమహావిష్ణువు సంహరించాడు.
5. ఆ ప్రహ్లాదుని మనుమడే బలిచక్రవర్తి. అతడు దానశీలుడే. కాని దేవతల అమరపురిని ఆక్రమించాడు. దేవతలకు నిలువనీడ లేకుండా చేశాడు. అందువల్ల వామన మూర్తియై శ్రీమహావిష్ణువు బలిని పాతాళానికి పంపి దేవతలనాదుకొన్నాడు.
6. లోక కంటకులుగా పరిపాలకులు (రాజులు) వ్యవహరిస్తున్నప్పుడు పరశురామునిగా అవతరించి 21 పర్యాయాలు దేశమంతా పర్యటించి రాజులను సరిదిద్దాడు. మారడానికి సిద్ధంగాలేని వారిని సంహరించాడు.



7. రావణాసురుడు లోకాలను అతలాకుతలం చేస్తున్నాడు. దేవతలకే దిక్కులేదు. అప్పుడు శ్రీరామచంద్రుడై లోక కంటకులైన రావణ కుంభకర్ణాదులను సంహరించాడు. ధర్మమూర్తిగా పరిపాలన చేశాడు.
8. ద్వాపరంలో బలరాముడై వ్యవసాయానికి, గోరక్షణకు ప్రాధాన్యమెంత ఉన్నదో ప్రపంచం తెలుసుకొనేట్టు చేశాడు. వైకుంఠాన్ని వదిలి శ్రీకృష్ణమూర్తియై వేణునాదంతో జీవకోటిలో ప్రేమను నింపాడు. గీతానాదంతో మానవకోటికి ధర్మ రక్షణావశ్యకతను వివరించాడు.
9. భాగవత బుద్ధుడై త్రిపురాసురుల సంహారానికి పరమేశ్వరునికి సహకరించి గ్రామాలను, గ్రామ ప్రజానీకాన్ని రక్షించాడు. చారిత్రక బుద్ధుడై అహింసయే పరమ ధర్మమని బోధించాడు.
10. ఇక కలియుగంలోని పాపాలను ప్రక్షాళనం చేయడానికి అసురీ శక్తులను అంతం చేయడానికి కల్కి అవతారమెత్తి శాంతియుత వాతావరణాన్ని నిర్మించబోతున్నాడు.

**(సశేషం)**

# మకర సంక్రాంతి

- యం. అహల్యాదేవి



**సూ**ర్యుడు సమస్త జగత్తుకు ప్రత్యక్షదైవం. భారతీయ సనాతన పరంపరలో సూర్యునిది ప్రప్రథమ స్థానం. వేదాలు, స్మృతులు, పురాణాలు, రామాయణ, భారత, భాగవతాలన్నీ సూర్యుణ్ణి వేనోళ్ళ పొగడుతాయి.

సూర్యభగవానుడు జగత్తుకు ఆరోగ్యప్రదాత. మన జీవితాలను నడిపే శక్తిధార. అంతేకాక కాలవిభజన కూడా సూర్యునివల్లే జరుగుతున్నాయి.

పరమాణువు, అణువు, త్రసరేణువు, తృటి, వేధ, లవ, నిమేష, క్షణ, కాష్ఠా, లఘు, సాటికా ముహూర్త, పుహర (యాము), దినము, రాత్రి, పగలు, పక్షం, మాసం, ఆయనం, సంవత్సరం మొదలైన కాలవిభజన లెక్క సూర్యుని ఆధారంగానే జరుగుతున్నాయి.

దాదాపుగా మన పండుగలన్నీ తిథి ప్రాతిపదికగా జరుగుతాయి. కృష్ణాష్టమి, విజయదశమి, వినాయకచవితి, దీపావళి మొదలైనవన్నీ ఆవిధంగా నిర్ణయించినవే. కాని భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు తిథి ప్రాతిపదికగా కాక 'సూర్యగమనం' ప్రకారం చేసేవి. ఆంగ్లమానం ప్రకారం ప్రతి యేటా జనవరి 14, 15 తేదీల్లో ఈ పండుగలు వస్తాయి.

## ఉత్తరాయణం - సంక్రమణం

మన పూర్వీకులు సూర్య సంచారాన్ని రెండు భాగాలుగా విభజించారు. సూర్యుడు భూమధ్యరేఖకు ఉత్తర దిక్కులో ఉన్నపుడు 'ఉత్తరాయణం' అనీ, దక్షిణదిశలో ఉన్నపుడు 'దక్షిణాయనం' అని అంటారు.

సూర్యుడు ఏడు గుర్రాల రథంపై 'అనూరుడు' రథసారథిగా ఒక రాశి నుంచి మరొక రాశిలోకి ప్రవేశించడాన్ని 'సంక్రమణం' అంటారు. ఈ సంక్రమణాలు సంవత్సరంలో 12 సార్లు వస్తాయి. సూర్యుని సంచారం ఒక్కొక్క రాశిలో ఒక్కొక్క నెలపాటు ఉంటుంది. ఆవిధంగా రాశిచక్రంలోని ద్వాదశ రాశులను చుట్టి రావడానికి పన్నెండు నెలలు లేదా సంవత్సరం పడుతుంది. మేషరాశి సంచారాన్ని మేష సంక్రమణంగా, వృషభరాశి సంచారాన్ని వృషభ సంక్రమణంగా, ఆవిధంగా ఏ రాశిలో రవి సంచరిస్తుంటాడో ఆ రాశి సంక్రమణంగా పేర్కొంటారు. సంక్రాంతిలో 'సం' అంటే మిక్కిలి 'క్రాంతి' అంటే అభ్యుదయం. మంచి అభ్యుదయాన్ని ఇచ్చు క్రాంతి కనుక దీనిని సంక్రాంతి అని పెద్దలు వివరణ ఇచ్చారు. ఈవిధంగా సూర్యుడు మకరరాశిలో ప్రవేశించినప్పటినుండి మకర సంక్రాంతిగా ఉత్తరాయణం ప్రారంభదినంగా పేర్కొంటారు. అలాగే రవి కర్కాటక రాశిలోని ప్రవేశించే సమయాన్ని కర్కాటక సంక్రమణం మరియు దక్షిణాయనంగా చెబుతారు. మనిషికి శిరస్సు ఎలాంటిదో బ్రహ్మాండానికి మకరరాశి అటువంటిది. అందువలన మకరసంక్రాంతి పుణ్యదినంగా, ఉత్తరాయణ పుణ్యకాలంగా పేర్కొంటారు.

సూర్యుడు మకరరాశిలో ప్రవేశించినప్పటినుండి ఉత్తరాయణం ఆరునెలలకాలం దేవతలకు ముఖ్యమైంది. వారికిది పగటి సమయం. దేవమార్గం ప్రారంభమయ్యే రోజు. మకరరాశిలోకి సూర్య సంక్రమణం జరిగిన సమయం నుండి 16 గంటలు సంక్రమణ పుణ్యకాలంగా గుర్తిస్తారు. ఉత్తరాయణంలో దివంగతులైన వారు ఉత్తమ గతులు పొందుతారు. అందుకే ఇచ్ఛామరణం వరంగా పొందిన భీష్మ పితామహుడు ఉత్తరాయణం వచ్చేదాకా అంపశయ్యపై ఉండి

ఆ తర్వాత తనువు చాలించాడు. దక్షిణాయనం దేవతలకు రాత్రి. పితృదేవతలకు ముఖ్యమైంది. ఈ కాలంలో మరణించినవారు జన్మ పరంపరని పొందుతారు. ఉత్తరాయణం దానాదులకు, పుణ్యకార్యాలకు, గ్రహదోషాల నివారణకు, శుభకార్యాల నిర్వహణకు విశిష్టమైన సమయం.

### భోగి

భోగిరోజు ధనుర్మాసానికి, దక్షిణాయనానికి చివరిరోజు. తెలుగువారు, సూర్యుడు ధనుస్సు రాశిలోకి ప్రవేశించగానే ధనుర్మాసం నెల పడతారు. అప్పటినుండి ఈ పండుగల హడావిడి మొదలవుతుంది. రంగు రంగుల ముగ్గులు ప్రతి ముంగిట దర్శనమిస్తాయి. రంగనాథుని ఆరాధించిన గోదాదేవి స్వామివారిలో ఐక్యం అయినరోజు భోగి. ఇంద్రునికి శ్రీకృష్ణుడు గర్వభంగం చేసిన రోజుగా, ఈ పండుగను చేసుకుంటారు. దీనికి సంబంధించిన పురాణగాథ ఒకటి ఉంది.

మేఘాధిపతియైన ఇంద్రునికి గర్వం హెచ్చింది. ఎంతటి వాళ్ళయినా వర్షంకోసం ఇంద్రపూజ చేయక తప్పదని విర్రవీగసాగాడు. ఈ విషయాన్ని శ్రీకృష్ణపరమాత్మ గమనించాడు. ఇంద్రునికి గర్వభంగం చేయదలచాడు. ఇంతలో యాదవులంతా వర్షాలకోసం ఇంద్రపూజ చేసేందుకు తయారవుతున్నారు. అప్పుడు అక్కడకు వచ్చిన శ్రీకృష్ణపరమాత్మ "మనం పశువులను మాత్రమే మేపుకుంటుంటాం. మనకు వర్షాలతో పనేముంది? మన పశువులకు కావలసినంత మేత గోవర్ధనగిరి ఇస్తోంది. కావాలంటే గోవర్ధనగిరిని పూజిద్దాం. ఇంద్రుడిని ఎందుకు మనం పూజించాలి? అని ఇంద్రపూజకు స్వస్తి చెప్పించాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఇంద్రుడు గోకులంపై జడివానతోపాటు, రాళ్ళవర్షాన్ని కురిపించాడు. గోకుల వాసులంతా శ్రీకృష్ణునికి మొరపెట్టుకోగా, శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని ఎత్తి సమస్త జీవరాశులకు రక్షణ కల్పించాడు. ఇంకా కోపగించుకున్న ఇంద్రుడు రకరకాల ప్రయత్నాలతో బాధపెట్టే ప్రయత్నం చేశాడు. ఫలితం శూన్యం. అప్పుడు గర్వం తొలగిన ఇంద్రుడు, స్వామి మహత్తును గ్రహించి, శ్రీకృష్ణుడి ముందు పాదాక్రాంతుడయ్యాడు. ఇంద్రుని మన్నించిన స్వామి, భోగినాడు ఇంద్రపూజ జరిగేటట్లు అనుగ్రహించాడు. అప్పటినుంచి భోగిపండుగనాడు 'ఇంద్రపూజ' చేసే ఆచారం అమల్లోకి వచ్చింది.

కొన్ని ప్రాంతాలలో వామనుని, బలిచక్రవర్తిని తలచుకుని పూజిస్తారు. బలిచక్రవర్తిని పాతాళానికి అణగదొక్కిన వామనుడు, ఈరోజున భూలోకానికి వచ్చేందుకు అనుమతి ఇచ్చాడని చెప్పబడుతోంది. అప్పటినుండి భోగి పండుగ ఆచారంగా, ఈరోజు బలిచక్రవర్తిని, వామనుని పూజిస్తుంటారు.

భోగినాడు తెల్లవారు ఝామునే భోగిమంటలు వేయాలి. ఈ భోగి మంటలలో ధనుర్మాసం నెలంతా ఆడపిల్లలు తయారుచేసిన గొబ్బి పిడకలను వేస్తారు. ఈ మంటలను వీధి చివర్లో వేస్తారు. ప్రస్తుతం ఈ మంటలలో పనికిరాని పాత వస్తువులను, చెత్తను వేస్తున్నారు. ఈవిధంగా భోగిమంటలు వేయడం వల్ల అశుభం, పీడ తొలగిపోతాయి. వీటిని రావణుని చితిమంటలుగా చెబుతారు. కొన్ని ప్రాంతాలలో మంటలను వేస్తున్నపుడు డప్పులు వాయించే ఆచారం ఉంది. ఈ డప్పులమోత స్వర్గాధిపతి ఇంద్రుని గౌరవార్థం అని చెబుతారు. మంటలు వేసిన అనంతరం తలంటి స్నానం చేయాలి. ఈ స్నానంతో భోగిపీడ వదులుతుందని ప్రతీతి. ఆ తరువాత ఇంటిముందు కళ్ళాపి చల్లి, రంగురంగుల ముగ్గులను తీర్చిదిద్ది, మధ్యలో గొబ్బెమ్మలను పెట్టి వాటికి పసుపు కుంకుమలను పెట్టి గుమ్మడిపూలతో అలంకరిస్తారు. తదనంతరం కన్నెపిల్లలు గొబ్బియళ్ళో... అంటూ పాటలు పాడుతారు. ఇలా గొబ్బిళ్ళ చుట్టూ ప్రదక్షిణలు చేసిన తర్వాత హారతులు ఇవ్వవలెను. ఇలా భక్తి శ్రద్ధలతో చేసే కన్యలకు చక్కటి వరునితో సకాలంలో వివాహం అవుతుంది.

అనంతరం ఇంద్రుణ్ణి, వామనుని, బలిచక్రవర్తిని పూజిస్తారు. ఈరోజునే 'ఇంద్రపూజ' అనికూడా అంటారు. సాయంత్రం వేళ పేరంటాళ్ళను పిలిచి, పిల్లలకు కొత్తబట్టలను తొడిగి, ఒక బల్లపై కూర్చోబెట్టి, రేగుపళ్ళు, నానబెట్టిన శనగలు, చెరుకుముక్కలు, చిల్లర నాణాలు, పూలు అన్నీ కలిపి పిల్లలకు దిష్టి తీసి వారి తలపై పోస్తారు. తలపై పోసేముందు మూడుసార్లు తిప్పాలి. ఇలా చేయడం వల్ల పిల్లలకు దృష్టి దోషాలు తొలగి, ఆయురారోగ్యాలు వృద్ధి చెందుతాయి. వచ్చిన ముత్తయిదువల చేతకూడా భోగిపండ్లు వారి తలపై పోయించి, ఆశీస్సులు ఇప్పిస్తారు. రేగుచెట్టుకు 'బదరీవృక్షం' అని మరో పేరు. శ్రీమహావిష్ణువుకు ఇష్టమైనది. ఈవిధంగా భోగిపళ్ళు పోయడం వల్ల శ్రీమన్నారాయణుని ఆశీస్సులు లభించి చిన్నారులు శక్తివంతులవుతారని, దీర్ఘాయువు కలుగుతుందని శాస్త్రవచనం. రేగిపండ్లు సూర్యునికి ప్రతీక. ఈవిధంగా ఆ స్వామి దయ, కృపావీక్షణాలు పిల్లలపై ఉంటాయని చెబుతారు. కొన్ని ప్రాంతాల్లో ఈరోజున స్త్రీలు ఆయురారోగ్య ఐశ్వర్యాల వృద్ధికోసం గొబ్బిగౌరీ వ్రతం చేస్తారు. గంగిరెద్దుల కోలాహలం, హరిదాసుల సంకీర్తనలు, బంధుమిత్రుల ఆగమనం, పిండివంటలు ఈ విధంగా భోగి ఆనందోత్సాహాలతో సాగుతుంది. అంతేకాక ఈరోజు కొత్తగా ఇంటికి వచ్చిన ధాన్యం, పాలతో పొంగలి చేసి ఇంద్రునికి,

విష్ణువుకి నైవేద్యంగా సమర్పించడం ఆచారంగా మారింది.

### మకరసంక్రాంతి

సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించేరోజు. సంక్రాంతి రోజున చేసే స్నానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. మకరరాశికి అధిపతి శని. నువ్వులపిండి శరీరానికి రాసుకుని రవిని తలచుకుంటూ శిరస్నానం చేయాలి.

**"రవి సంక్రమణే ప్రాప్తేన స్నాయాద్యస్తు మానవః ।**
**సప్తజన్మ సురోగీ స్యాన్నిర్ధన శ్చైవ జాయతే" ॥**

సూర్యసంక్రమణం నాడు స్నానం చేయని వారు ఏడు జన్మల్లో రోగి, భాగ్యహీనుడు అవుతాడు. ఈరోజు చేసే స్నాన, దాన, పూజలకు ప్రత్యేకత ఉంది. పెరుగు దానం మంచి ఫలితాన్నిస్తుంది. నువ్వుల నూనెతో దీపారాధన, నువ్వులు, బియ్యం కలిపి శివుణ్ణి పూజించడం శ్రేయస్కరం. ఈరోజున సూర్యుడిని ఆవుపాలతో అభిషేకిస్తే ఆరోగ్యభాగ్యం. పితృదేవతలకు తర్పణం వదలాలి. శివలింగానికి ఆవునేతితో అభిషేకిస్తే ఐశ్వర్య ప్రాప్తి. మకర సంక్రాంతి నాడు సూర్యోపాసన చేయడం విశిష్టమైంది. మనకు ప్రతిరోజూ ప్రత్యక్షంగా కనిపించే దైవం సూర్యుడు. ఈరోజు శ్రద్ధా భక్తులతో సూర్యునికి అర్ఘ్యప్రదానం, ఉపాసన చేసినట్లయితే ఆరోగ్యాన్ని, సౌభాగ్యాన్ని ప్రసాదిస్తాడు.

దూర్వాసుని సలహాపై యశోద సంక్రాంతినాడు నువ్వులపిండి రాసుకుని స్నానం చేసి, బ్రాహ్మణునికి పెరుగుదానం చేయడం వల్ల శ్రీకృష్ణుని పుత్రుడుగా పొందింది. అదేవిధంగా దూర్వాసుని సలహా మేరకు ఆచరించడం వల్ల ద్రోణుడి భార్య కృపికి అశ్వత్థామ జన్మించాడు.

మకర సంక్రాంతి రోజున రుణవిముక్తి కోసం, శత్రు శమనానికి, అభిప్రాయ భేదాలు పోగొట్టడానికి, గంధంతో అష్టదళ పద్మం వేసి, దాని మధ్యలో సూర్యదేవుణ్ణి ప్రతిష్ఠించి, విధివిధానంగా పూజ చేస్తే పని నెరవేరుతుంది. ముఖ్యంగా తరాల అంతరం వల్ల తండ్రీ కొడుకుల మధ్య అభిప్రాయ భేదముంటుంది. అటువంటి వారు ఈ పూజ చేయడం వల్ల మంచి ఫలితముంటుంది. ఎందుకంటే సూర్యుడు మకరరాశిలో ప్రవేశిస్తాడు. సూర్యుడు, శని తండ్రీకొడుకులు. అయినా వారిమధ్య శత్రుత్వం ఉంది. మకరరాశికి అధిపతి అయిన శని ఇంట్లోకి సూర్యుడు వస్తాడు. అంటే తండ్రి కుమారుని ఇంట్లోకి ప్రవేశిస్తాడు. ఇది చాలా మంచి సమయం కాబట్టి ఈ సూర్యారాధన మంచి ఫలితాలనిస్తుంది.

మకరం అంటే మొసలి. ఇది పట్టుకుంటే వదలదు. ఇది మానవుని యొక్క ఆధ్యాత్మిక మార్గానికి అడుగడుగునా అడ్డుపడుతూ, మోక్షమార్గానికి అనర్హుని చేస్తుంది. అందువల్ల



మకరసంక్రాంతి నాడు దాని బారినుండి తప్పించుకోడానికి ఎవరికి వారు యథాశక్తి దానధర్మాలు చేయడం మంచిదని శాస్త్ర పండితులు చెప్తున్నారు.

### దానఫలం

ఈ సంక్రమణ కాలంలో ఎవరైతే దానధర్మాలు విరివిగా చేస్తారో ఆయా వస్తువులన్నీ జన్మ జన్మలకు లభిస్తాయని ధర్మసింధు చెబుతోంది.

**సంక్రాంతే యాని దత్తాని హవ్యకవ్యానిదాతృభిః ।**
**తాని నిత్యందదాత్యర్కః పునర్జని జన్మని ॥**

స్త్రీలు పసుపు, కుంకుమలు, నువ్వులతో చేసిన వంటకాలు, వెన్న రొట్టెలు దానం ఇవ్వడం వల్ల వారి అనేక జన్మల్లో సకల సంపదలు, సౌభాగ్యాలు లభిస్తాయి. బ్రాహ్మణులకు సుగంధ ద్రవ్యాలు, బెల్లం, బియ్యం, వస్త్రాలు, గుమ్మడికాయ దానమిచ్చి ఆశీస్సులు పొందాలి. ఒక్కపూటే భోజనం చేయడం మంచిది. ధాన్యం, విసనకర్ర, వస్త్రం, బంగారం, కూరగాయలు, దుంపలు, నువ్వులు, చెరకు, గోవు మొదలైనవి దానం చేస్తే విశేష ఫలితాలు ఉంటాయి. మంత్ర జపాలకు, ధ్యానం, పారాయణలు వంటి వాటికి ఉత్తమ ఫలితాలు ఇచ్చే పుణ్యకాలం, ఈ ఉత్తరాయణ పుణ్యకాలం.

### సంక్రాంతి రథం

ఉత్తరాభిముఖుడైన సూర్యుడు రథంపై సంచరిస్తుండగా వైకుంఠ ఏకాదశినాడు రథ మందిరం ఉత్తరద్వారం తెరుచుకుంటుంది. ఆ సమయంలో ఆ ద్వారం నుండి ముక్కోటి దేవతలు సూర్యభగవానుని దర్శించి పూజిస్తారు. దానికి ప్రతీకగా సంక్రాంతినాడు రథం ముగ్గు వేస్తారు. ఆ రథం సంక్రాంతినాడు లోపలికి వస్తున్నట్లు ముక్కనుమనాడు బయటకు వెళ్తున్నట్లు ఉండాలి.

### పెద్ద సంక్రమణం నోము

సంక్రాంతి రోజున స్త్రీలు 'పెద్ద సంక్రమణ నోము'ను ఆచరిస్తారు. ఈరోజు తెల్లవారు ఝామునే స్నానం చేసి లక్ష్మీదేవిని, ఇష్టదైవాన్ని షోడశోపచారాలతో పూజించాలి.

సాయంత్రం శివాలయానికి వెళ్ళి ఆవునేతితో ఒక దీపం నువ్వుల నూనెతో ఒక దీపం వెలిగించాలి. వీటికి వాడే ఆవునెయ్యి, నువ్వులనూనె ప్రతియేటా రెట్టింపు పరిమాణంలో ఉండాలి. ఇలా ఐదేళ్ళు చేసి, ఉద్యాపనగా ఐదుగురు ముత్తయిదువలకు పసుపు కుంకుమలు, రవికెలగుడ్డ, తాంబూలంలో ఉంచి వాయినం ఇవ్వాలి. ఈ వ్రతాచరణవల్ల జ్ఞానాభివృద్ధి, విద్యావంతులు అవుతారు. లక్ష్మీదేవిని పూజించడం వల్ల గతజన్మలో చేసిన పాపాలు నశించి, సకల సౌభాగ్యాలు లభిస్తాయి.

### కనుమ పండుగ

ఇది రైతులకు ముఖ్యమైన పండుగ. సంవత్సరమంతా పడిన శ్రమకు ఫలితమైన ధాన్యరాశులు నట్టింట నిలిచేరోజు. పాడిని ప్రసాదించిన గోమాతను, పంటకు సాయంగా నిలిచిన బసవన్నను ఈరోజున రైతులు పూజిస్తారు. ఈరోజు తెల్లవారగానే పశువులను శుభ్రంగా కడిగి, కొమ్ములకు, ముఖానికి పసుపురాసి, కుంకుమబొట్లు పెట్టి పూలమాలలు వేస్తారు. అలంకరణకు కుచ్చులు కడతారు. కొమ్ములకు వెండి కొప్పులు ధరింపచేసి ఆకులో అన్నంపెట్టి తినిపిస్తారు. కొన్ని ప్రాంతాలలో గోపూజతో పాటు పక్షిపూజ కూడా చేస్తారు. రైతులు సంక్రాంతికి ముందు సాగే కుప్పనూర్పిళ్ళ సందర్భంలో వరివెన్నులను గుత్తులుగా చేర్చి పిచ్చుకలు తినేందుకై ఇళ్ళలోను, దేవాలయ ప్రాంగణాలలోను కుచ్చులుగా కడతారు. దేవునికి వడ్లకుచ్చు ఇస్తామని మొక్కుకుని, ఆ మొక్కును కనుమరోజున తీర్చుకోవడం జరుగుతుంది. కొన్ని ప్రాంతాలలో స్త్రీలు చక్కగా అలంకరించుకొని, తాము పక్షులకు పెట్టదలచుకున్న గింజలతో చెరువుగట్టుకో, బహిరంగ ప్రదేశానికో వెళ్ళి, అక్కడ పక్షులకు మేత వేసి వస్తారు. పక్షులు ఎంత ఎక్కువగా వచ్చి ఆ ముద్దలను ఆరగిస్తే అంత మంచి జరుగుతుందని నమ్మకం. సంవత్సరమంతా చేసిన శ్రమకు ఫలితంగా లభించిన ధన ధాన్య రాశులను పూజించేరోజు కనుమ. వీటిని లక్ష్మి స్వరూపంగా భావించి పూజిస్తే సంపద మరింతగా వృద్ధి చెందుతుందని విశ్వాసం. మినుములతో చేసిన వంటకాలను ఈ రోజున తప్పక భుజించాలి. దీనివల్ల రాహు గ్రహ దోషనివారణ జరుగుతుంది. ఈరోజు పిల్లలు పోటీలు పడుతూ గాలిపటాలు ఎగురవేస్తారు. కొత్త దంపతులకు, ఇంటి అల్లుళ్ళకు నూతన వస్త్రాలు కానుకగా ఇచ్చి గౌరవించడం ఆచారం.

### ముక్కనుమ

కనుమ మరుసటి రోజుని ముక్కనుమ అంటారు. ఈరోజున కొన్ని ప్రాంతాల్లో బొమ్మలనోము (సావిత్రి గౌరీ నోము) చేస్తారు. సావిత్రి గౌరీదేవి వేదమాత. ఈ దేవత గురించి వరాహ, బ్రహ్మవైవర్త, పద్మ పురాణాలు, దేవీ భాగవతం వివరిస్తున్నాయి. స్త్రీలు వివాహమైన తొలి సంవత్సరం ఈ నోమును పట్టి తొమ్మిదిరోజులు చేయాలి. అలా తొమ్మిది సంవత్సరాలు ఆచరించాలి. ఈ నోము ముత్తయిదువలు సమూహంగా చేసుకునేది. అయితే ఆనవాయితీ ఉన్న గృహిణులే ఈ నోము చేయడం జరుగుతుంది. చాలా ప్రాంతాల్లో సంక్రాంతికి బొమ్మల కొలువు పెట్టి బంధుమిత్రులను ఆహ్వానిస్తారు.

రంగు రంగుల ముగ్గులతో వాకిళ్ళు అలంకరిస్తూ కన్నెపిల్లలు పోటీ పడుతుంటారు. గంగిరెద్దును అయ్యగారికి దండం పెట్టు – అమ్మగారికి జేజే చెప్పు అంటూ గంగిరెద్దును శంకరదాసు ఆడిస్తుంటే, అవి తలాడిస్తూ ముందుకాళ్ళతో నృత్యం చేస్తాయి. మనమిచ్చినది తీసుకుని చల్లగా ఉండమని దీవించి వెళ్ళిపోతాడు దాసు. ఆ తర్వాత హరినామ సంకీర్తనలతో తలపై గుమ్మడికాయ ఆకారపు గిన్నెను ధరించి, ఊర్ధ్వ పుండ్రాలతో, చేతిలో చిడతలతో, కుడిభుజంపై తంబురాతో వాకిట్లోకి వచ్చిన హరిదాసుకు కొత్తబియ్యాన్ని దానం చేస్తారు. ఆ తర్వాత అంబ పలుకు, జగదంబ పలుకు అంటూ డమరుక ధ్వనితో బుడబుక్కలవాళ్ళు, ఇంకా జంగమదేవరలు, పిట్టల దొరలు, కాటికాపరులు ఇలా ఈ రోజు అంతా సందడిగా జానపద కళాకారుల ప్రదర్శనలతో గడిచిపోతుంది. కలిగిన దాంట్లో వారికి ఇచ్చి పంపాలి. వారిని రిక్తహస్తాలతో పంపకూడదు. ఇది గ్రామీణుల సదాచారం. భిక్షను స్వీకరిస్తూ హరిదాసు ఇచ్చే దీవెనలు ఎంతో సంతోషాన్ని, స్ఫూర్తిని కలిగిస్తాయి.

బ్రహ్మజ్ఞానం కలగడానికి, సహస్రారంలోకి ఆధ్యాత్మిక సూర్యుడు ప్రవేశించడానికి అనువైన సమయం ఈ మకర సంక్రాంతి. సంక్రాంతి లక్ష్మి తనకు ముందు భోగి అనే చెలికత్తెను, వెనుకగా కనుమ, ముక్కనుమ అనే చెలికత్తెలను వెంట నిడుకుని మహారాణిలా విచ్చేస్తుంది.

ఆ ధాన్యలక్ష్మి మనం చేసే పూజలు, సమర్పించే నైవేద్యాలు స్వీకరించి, అష్టైశ్వర్యాలు ప్రసాదించి ఆశీర్వదిస్తుంది.


పంజాబ్‌లో లాహెడీ పేరుతో, తమిళనాడులో పొంగల్ పేరుతో, కేరళలో ఓనమ్ పేరుతో ఈ సంక్రాంతిని ఉత్సాహంగా చేసుకుంటారు.

ఈ మకర సంక్రాంతి శుభవేళ అందరికీ సమృద్ధి, శాంతి, ఆరోగ్యం, ప్రశాంతత నిండిన జీవితం కలగాలని ఆశిద్దాం.

**జపాకుసుమ సంకాశం కాశ్యపేయం మహాద్యుతిమ్**

**తమోరిం సర్వపాపఘ్నం ప్రణతోస్మి దివాకరమ్**

* * *




# అక్రూరుడు బృందావనానికి రావడం

**గత సంచిక తరువాయి**

**"ప**రీక్షిన్మహారాజా!" అని పిలవడంతో కృష్ణధ్యానంలో నిమగ్నుడైన పరీక్షిత్తు ఉలిక్కిపడి శుకమహర్షి వైపు చూశాడు.

"కంసుడు కృష్ణుని, బలరాముని ఏదో ఒక ఉపాయంతో మధురకు తీసుకురమ్మని అక్రూరుని పంపాడు కదా! ఆ అక్రూరుడు బృందావనానికి బయలుదేరి వెళుతూ దారిలో శ్రీకృష్ణుడి గురించే ఆలోచించసాగాడు. అక్రూరుడు కంసుడికి మిత్రుడైనా, మధురలో నివసిస్తున్నా, అతని మనసంతా ఎప్పుడూ కృష్ణ ధ్యానంతోనే నిండి ఉంటుంది. కృష్ణ దర్శనానికి బయలుదేరాడాయె! ఇక అతని భక్తి కట్టలు తెంచుకొంది. కృష్ణ రూపాన్నే తలచుకోసాగాడు. తన అదృష్టానికి పొంగిపోయాడు.

**"ఎట్టి తపంబు సేయబడె? నెట్టి చరిత్రము లబ్ధమయ్యెనో?**
**యెట్టి ధనంబు లర్హులకు నీబడెనో తొలిబామునందు! నా**
**యట్టి వివేకహీనునకు నాది మునీంద్రులు యోగ దృష్టులం**
**బట్టగలేని యీశ్వరుని బ్రహ్మమయున్ హరిఁ జూడగల్గెడిన్"**

– 1189 ప – ద.స్కం – పూ.భా – భాగవతము

"ఆహా! అవివేకినైన నాకు ఎంతటి భాగ్యం లభించింది? సృష్ట్యాది నుంచి మహా తపస్సు చేసి పునీతులైన మహర్షులే తమ యోగదృష్టులచేత పట్టుకోలేకపోయిన ఆ జగదీశ్వరుని, ఆ పరబ్రహ్మను నేడు చూడబోతున్నాను. క్రిందటి జన్మలలో నేను ఎంత గొప్ప తపస్సు చేశానో కదా! ఎంత సత్ప్రవర్తనతో మెలిగానో కదా! అర్హులైన మహాత్ములకు ఎంత ధనమిచ్చానో! ఎన్నెన్ని దానాలు చేశానో!! లేకపోతే కృష్ణుడి దగ్గరకు కంసుడే నన్ను పిలిచి పంపిస్తాడా? సాక్షాత్తూ భగవత్స్వరూపుడు, విష్ణ్వవతార పురుషుడూ అయిన శ్రీకృష్ణుని వైరబుద్ధితో అయినా సరే – కంసుడు పిలుచుకు రమ్మని నన్ను పంపడానికి నామీద ఆ మహారాజుకున్న నిష్కారణమైన ప్రేమే కారణం. కంసుడు తప్ప నాకింత హితం చేసిన మిత్రులింకెవరైనా ఉన్నారా? ఆలోచించి చూస్తే కంసుడే నాకు నిజమైన స్నేహితుడు.

"కంసుడు పంపినవాడు కదా ఈ అక్రూరుడు. నాకు వైరి కదా! నన్ను సంహరింపచేయటానికే ఇక్కడకు వచ్చి ఉంటాడు!" అని కృష్ణుడు నన్ననుమానిస్తే – నా గతేం కావాలి? పరమాత్ముడికి ఆగ్రహం కలిగితే నేను మాడి మసైపోనూ! నేను నిజంగా తన భక్తుడినే అని ఆదరిస్తాడా? సుగుణశీలినని మన్నిస్తాడా? కృష్ణుడు సర్వాంతర్యామి కదా! నా అంతరాత్మ ఆయనకు తెలియదా? తన దర్శనానికే వస్తున్నానని వాత్సల్యాన్ని ప్రకటించడా? నాతో కరుణతో సంభాషించడా? నా రథం చుట్టూ అడవి మృగాలన్నీ

ప్రదక్షిణంగా తిరుగుతున్నాయి. ఎటు చూసినా శుభసూచకాలే కనిపిస్తున్నాయి. నేను వెళ్ళి ఆయన కాళ్ళమీద పడి సాష్టాంగ నమస్కారం చేస్తే దయాసింధువైన శ్రీకృష్ణుడు తన చేతిని నా తలపై పెట్టి అభయప్రదానం చేయడా?" అని భావిస్తూ అక్రూరుడు అతిలోక సుందరమైన బృందావనంలోకి అడుగుపెట్టాడు. చందన వృక్షాలతో, మద్దిచెట్లతో, గోరంట, తాడి, మామిడి మొదలైన అనేకానేక వివిధ వృక్ష సంపదతో; మల్లె మొల్ల మొదలైన పూపొదరిళ్ళతో చూడముచ్చటగా ఉన్న బృందావనంలో స్వేచ్ఛగా పచ్చిక మేస్తున్న దూడలను, ఆవులను చూశాడు అక్రూరుడు. గొల్లపిల్లల సందడులు విన్నాడు. క్రూర జంతువుల బారిన పడకుండా ఆవులను, వాటి సంతతిని జాగ్రత్తగా కాపలా కాస్తున్న గోపకులను చూశాడు. బలరామకృష్ణులచే సురక్షితంగా ఉన్న బృందావన సౌందర్యానికి ముగ్ధుడై, ఆ నేలపై కనబడుతున్న శుభలక్షణాలతో ఆకర్షిస్తున్న శ్రీకృష్ణుని అడుగుజాడలు చూసి రథం మీదనుంచి ఒక్క ఉదుటున దిగాడు. నాలుగడుగులు నడవగానే బలరామకృష్ణులు కనిపించారు.

**"కనె నక్రూరుడు పద్మనేత్రులను రంగద్గాత్రులన్ ధేను దో**
**హనవాటీగతులన్నలంకృతులనుద్యద్భాసులం బీత నీ**
**లనవీనోజ్జ్వల వాసులంగుసుమ మాలాధారులన్ ధీరులన్**
**వనితాకాముల కృష్ణరాముల జగద్వంద్యక్రమోద్దాములన్"**

– 1199 ప – ద.స్కం – పూ.భా – భాగవతము

జగన్నివాసుల చేత స్తుతింపబడే పరాక్రమోపేతులను, దేదీప్యమాన గాత్రులను, పుష్పమాలాలంకృతులను, నవమన్మథాకారులను, కమలాక్షులను, ధీరగుణోన్నతులను అక్రూరుడు చూసి వారి పాదపద్మాలకు ప్రణమిల్లాడు.



పీతాంబరధారి అయిన శ్రీకృష్ణుని, నీలవస్త్రాన్ని ధరించిన బలరాముని చూస్తూ పులకించిపోయాడు. అక్రూరునిలోని సుగుణాలు తెలిసిన బలరామకృష్ణులాతనిని ఇంటికి తీసుకుపోయి సకల మర్యాదలు చేసి సంతృప్తి పఱిచారు. భక్తవత్సలుడైన శ్రీకృష్ణుడు అక్రూరుని సాదరంగా చూసి కుశల ప్రశ్నలతో ముంచెత్తాడు.

**"శుభమే నీకు? ప్రమోదమే సఖులకుం జుట్టాలకున్ సేమమే**
**యభయంబే ప్రజకెల్ల? గోత్రజుల కాత్మానందమే? మామ ము**
**క్త భయుండే? వసుదేవ దేవకులు తత్కారాగృహంబందు మ**
**త్ప్రభవ వ్యాజనిబద్ధులై బ్రతికిరే ప్రాణానిలోపేతులై?"**

– 1206 ప – ద.స్కం – పూ.భా – భాగవతము

అక్రూరుని క్షేమమడిగి, చుట్టపక్కాల కుశలాన్ని కూడా అడిగి తెలుసుకొన్నాడు. కంసుడు మేనమామ కదా! "నా గురించి ఏ భయం లేకుండా సుఖంగా ఉన్నాడా?" అని అంటూనే "నేను దేవకీ వసుదేవులకు పుత్రుడిగా జన్మించిన కారణం చేత కంసుడు వారిని కారాగారంలో బంధించాడు కదా! కంసుడు పెట్టే బాధలను సహించి వాళ్ళింకా బ్రతికే ఉన్నారా? నువ్విక్కడకు వస్తున్నావన్న విషయం కారాగార భటుల మాటలవల్ల విని నాకేమైనా చెప్పమని నీతో చెప్పి పంపారా? వారెన్ని ఇడుములు పడుతున్నారో గదా! ఆ వివరాలన్నీ చెప్పు అక్రూరా! అసలు కంసుడు నిన్నే పనిమీద మావద్దకు పంపాడో అదీ చెప్పు అని కృష్ణుడు అడగగానే సర్వ వివరించి చెప్పాడు అక్రూరుడు. వెంటనే కృష్ణుడు నందుడివైపు, గోపాలకుల వైపు చూసి "అయ్యలారా! కంసరాజు మనల్ని యజ్ఞం చూడటానికి కబురంపాడు కనుక ఆ రాజుకి కట్నకానుకలు తీసుకు వెళ్ళాలి కదా! పాలు, పెరుగు, నెయ్యి సిద్ధం చెయ్యండి. గోకులంవారి పాలు మొదలైనవంటే మధురాధిపతికి మక్కువ ఎక్కువ. రేపు ప్రొద్దున బయలుదేరి శీఘ్రంగా మథురానగరాన్ని చేరుకుందాం. రాజాజ్ఞను మీరకూడదు కదా! పైగా ఆయన ఆహ్వానించాడాయె!" అని అనడంతో అందరూ లేచి ఎవరి పనులలో వారు నిమగ్నులైపోయారు. ఈ వార్త గోపికారమణుల చెవిన పడింది.

కృష్ణుడు మథురకు, అందులోనూ తల్లితండ్రుల వద్దకు వెళ్ళిపోతున్నాడే అని వ్యథ చెందసాగారు గోపికలు. అది కేవలం సాధారణ బాధ కాదు. విరహబాధ. మళ్ళీ ఎన్నడు కృష్ణుని చూడగలుగుతామో అన్న ఆవేదన. అసలు తిరిగి వస్తాడో రాడో అన్న సందేహం. అసలు అక్రూరుడు ఎందుకు రావాలి? వస్తే వచ్చాడు! కృష్ణుని తనతో ఎందుకు తీసుకుపోవాలి? "వచ్చినవాడు నిజంగా అక్రూరుడు కాదు, క్రూరుడు సుమా" అని దిగులు చెందారు.



**"అక్రూరుండని పేరు పెట్టుకొని నేడస్మన్మనో వల్లభుం**
**జక్రిన్ మాకడ పాపికొంచు నరుగంజర్చించి యేతెంచి నా**
**దక్రూరుండట క్రూరుడీతడు నిజంబక్రూరుడౌనేని ని**
**ర్వక్రత్వంబున కృష్ణుపెట్టి తన త్రోవంబో విచారింపదే?"**

– 1216 ప – ద.స్కం – పూ.భా – భాగవతము

"ఇతడే కనుక మంచివాడైతే తన దారిన తాను పోతాడు గాని, కృష్ణుణ్ణి వెంటబెట్టుకొని పోతాడా? కృష్ణుడు లేకపోతే ఇక్కడ మా గతేం కాను? కృష్ణా! గోవిందా! మాధవా! దామోదరా! మామీద దయచూపు నందనందనా! మమ్మల్ని ఇక్కడ దిగవిడిచి నీవు వెళ్ళడం న్యాయమా? మేమూ నీ వెంట వస్తాం. మమ్మల్ని కూడా మధురానగరానికి తీసుకు వెళ్ళవయ్యా! అక్కడే పాలు పెరుగులమ్ముకుంటూ, నీ ముఖారవిందమే చూసుకుంటూ కాలం గడిపేస్తాం. నీవు లేని గోకులం ఆకులమే కదా కృష్ణా!" అని అనుకొంటూ తామూ ప్రయాణానికి సిద్ధమయ్యారు గోపికలందరూ. అది తెలిసిన శ్రీకృష్ణుడు "నేను మళ్ళీ తిరిగి మీవద్దకు వస్తానని మాట ఇచ్చి అక్రూరుని రథం ఎక్కాడు. అక్రూరుడు రథం తోలుతున్నాడు. బలరామకృష్ణులిద్దరూ బృందావన సౌందర్యాన్ని మరొకసారి తనివితీరా చూస్తూ గత స్మృతులను నెమరు వేసుకుంటూ రథం ఆగగానే గిరుక్కుమని చూశారు. అక్రూరుడు రథం దిగుతున్నాడు. ప్రక్కనే ఉన్న యమునా నదీ తరంగాలు తమను ఆహ్వానిస్తున్నాయా అన్నట్లు తమవైపుకే కదలి వస్తున్నాయి. రథం మీదనే కూర్చుని యమునానది సోయగాలను, చల్లగా వీస్తున్న పిల్లవాయువుల సౌకుమార్యాన్ని, పూపొందరిండ్ల సౌరభాన్ని అనుభవిస్తున్న రామకృష్ణులకు నమస్కరించి అక్రూరుడు యమునానదిలో స్నానం చేయడానికి ప్రవేశించాడు. వేదమంత్రాలు పఠిస్తూ సూర్యభగవానుని దర్శిస్తూ, అర్ఘ్యమిస్తున్న అక్రూరుని చేతులలో నిండివున్న జలంలో బలరామకృష్ణులు కనపడటంతో ఆశ్చర్యపోయాడు అక్రూరుడు. "ఇప్పటివరకు రథంలో ఉన్నారు కదా, రామకృష్ణులు! జలంలోకి ఎప్పుడు వచ్చారా?" అని దిగ్భ్రమ చెందాడు. 'రథంలో వాళ్ళు లేరా?' అని అనుకొని రథంవైపు చూశాడు. రథంలోనూ కనపడ్డారు రామకృష్ణులు. అక్రూరుడు ఆశ్చర్యంతో తలమునకలయ్యాడు.

**"కంటిన్ మున్ను రథంబుపై; జలములో కంటిన్ దుదింగ్రమ్మఱన్**
**గంటిన్ దొంటి రథంబుమీద; నిదెయీకళ్యాణ చారిత్రులే**
**వెంటందోచిరి రెండు దిక్కుల; మనో విభ్రాంతియో? నీటిలో**
**నుంటాశ్చర్యము; చూతు నంచు మరియున్ ఊహించిమగ్నాంగుడై"**

– 1229ప – ద.స్కం – పూ.భా – భాగవతము

"నేను రథం దిగి నది దగ్గరకు వస్తున్నప్పుడు రామకృష్ణులు రథంలోనే ఉన్నారు. నేను స్నానం చేస్తున్నప్పుడు వారిద్దరూ నదీజలంలో కనబడ్డారు. ఇదెలా సాధ్యమవుతుంది? ఒకే వ్యక్తి ఒకే సమయంలో రెండు చోట్ల ఎలా కనబడతాడు? అద్భుతంగా ఉంది. వెనక్కు తిరిగి రథం వైపు చూస్తే మళ్ళీ రథంలోనూ వాళ్ళిద్దరూ కనిపించారు. నా మనసు చంచలించిందా? లేక ఆ కళ్యాణ చారిత్రులైన రామకృష్ణుల మహిమా? ఏమై ఉంటుంది? అయినా, నీళ్ళలో మునిగి మళ్ళీ చూస్తాను. నీళ్ళలో వాళ్ళు ఇంకా కనబడతారో లేదో పరిశీలించి చూస్తాను" అని నదిలోకి మళ్ళీ దిగాడు అక్రూరుడు. అక్కడ అక్రూరుడికి కనపడ్డ దృశ్యం మహా మహిమాన్వితంగా ఉంది. ఆదిశేషుడు వెయ్యిపడగలతో ఆ నీళ్ళలో దర్శనమిచ్చాడు. వేయిపడగల మీద చిత్ర విచిత్రమైన మణులు ధగ ధగాయమానంగా మెరుస్తున్నాయి. నాగులకు చక్రవర్తిగా రాజవేషంతో వెలిగిపోతున్నాడు. మహావీరుడిగా తన ప్రతాపాన్ని అంతటినీ నేత్రాలలోనే ప్రదర్శిస్తున్నాడు. ముఖంలో దయ ప్రస్ఫుటంగా గోచరిస్తోంది. సంతోషాన్ని చిరునవ్వులలో చిందిస్తున్నాడు. నీలవస్త్రాన్ని ధరించి నిగనిగ కాంతులు విరజిమ్ముతున్నాడు. నాగులు, సిద్ధులు మొదలైన దేవతల చేత స్తుతింపబడుతున్నాడు.

ఆ అందాల ఆదిశేషుని పాన్పుపైన మరింత అందంగా ప్రకాశిస్తున్న పీతాంబరధరుడైన శ్రీమహావిష్ణువుని కనులారా చూశాడు అక్రూరుడు. మబ్బు మధ్యలో మెరిసే మెరుపులాగా మెరిసిపోతున్న శ్రీమహాలక్ష్మి ఆదినారాయణుని ఎదలో దేదీప్యమానంగా వెలిగిపోతూ ఉండటం కన్నార్పక చూశాడు. కమలాక్షుడు, శంఖ చక్ర గదాధారి అయిన ఆ నీలమేఘ శ్యాముని దర్శించి తనివితీరక మళ్ళీ మళ్ళీ చూశాడు. పరమాత్ముని నాభికమలంలో బ్రహ్మదేవుడు పసిపాపడుగా ఆడుకుంటున్నాడు. నారద మహర్షులు, బ్రహ్మాది దేవతలు, శంకరాది మిత్రులు, బ్రాహ్మణోత్తములు స్తోత్రం చేస్తుంటే చిదానంద రూపుడిగా గోచరిస్తున్న ఆ పురుషోత్తముని పాదపద్మాలకు అత్యంత భక్తిపరవశుడై మ్రొక్కి

స్తుతించసాగాడు అక్రూరుడు.

“శ్రీమానినీ మానచోరా! శుభాకార! వీరా! నీవు నారాయణాఖ్యుండవంచున్ శివాఖ్యుండవంచుం మతింబెక్కు మార్గంబులన్ నిన్ను నగ్గింతురెగ్గేమి? మహారూప! నీ రూపముల్ వెగ్గలం బుగ్గడింపన్; లయంభోధిలో మీనుమేనన్ విరోధిన్ నిరోధించి మున్ వేధకున్ వేదరాశిం బ్రసాదింపవే? త్రుంపవే కైటభశ్రీ మధుంజక్రివై మొత్తన్ యెత్తవే మందరాగంబు రాగంబుతో కూర్మలీలా పరిష్పందివై పందివై మేదినిన్ మీదికింద్రోచి దోషాచరుం గొమ్ములన్ నెమ్ములన్ జిమ్ముచున్ గ్రువ్వవే త్రవ్వవే ఘోరవైరిన్ నృసింహుండవై, దండివై దండి వైరోచనిం జూచి యాచింపవే? పెంపవే మేను బ్రహ్మాండ మున్నిండ, పాఱుండవై రాజకోటిన్ విపాటింపవే, రాజువై రాజబింబాస్యకై దుర్మదారిన్ విదారింపవే, నొంపవే క్రూరులన్ వాసుదేవాది రూపంబులన్ నిన్నెన్న నేనెవ్వడన్, నన్ను మాయా విపన్నున్, విషణ్ణుం బ్రసన్నుండవై ఖిన్నతం బాపి మన్నింపవే! పన్నగాధీశ తల్పా! కృపాకల్ప! వందారుకల్పా! నమస్తే నమస్తే నమస్తే నమః”

– 1234 దండకం – ద.స్కం – పూ.భా – భాగవతము

“శ్రీమహాలక్ష్మి హృదయాన్ని చూరగొన్న శుభప్రదమైన ఆకారశోభతో విరాజిల్లుతున్న నారాయణా! జగదేకవీరా! సర్వులు నిన్ను విష్ణుమూర్తివని, శివుడివని అనేకవిధాల ప్రస్తుతిస్తుంటారు. నీవు మహారూపుడివి. పురాణ పురుషుడివి. పురుషోత్తముడివి. నీవు విశ్వరూపుడివి. విశ్వమయుడవు. నిన్ను వర్ణించడం అశక్తితో కూడినది. సర్వజీవరాశుల్లోనూ నీవే ఉంటావు. సర్వం నీలోనే ఇమిడి ఉంటుంది. సజ్జన రక్షణ కోసం నీవు ధరించిన రూపాలు అనేకం. ఎత్తిన అవతారాలు లెక్కకు మిక్కిలి. మత్స్యమూర్తివై ప్రళయకాలంలో వీర విజృంభణచేసే మహాసముద్రంలో ఉన్న సోమకాసురుని చీల్చి చెండాడి వేదాలు తెచ్చి బ్రహ్మకిచ్చి వేదవిద్యను పరిరక్షించావు. చక్రధారివై హయగ్రీవావతారంలో మధుకైటభులనే రక్కసులను వధించి బ్రహ్మదేవుని కాపాడావు. కూర్మరూపుడవై మందరపర్వతాన్ని ఎత్తి దేవతలను ఆదుకొన్నావు. వరాహావతారంలో హిరణ్యాక్షుని కొమ్ములతో కుమ్మి విగతజీవుని చేసి భూమిని రక్షించావు. నృసింహరూపం ధరించి అరివీర భయంకరుడైన హిరణ్యకశిపుని నామరూపాలు లేకుండా సంహరించి నీ పరాక్రమాన్ని చాటావు. మహావీరుడవైన నీవు వామనుడిగా వెళ్ళి బలిచక్రవర్తిని మూడడుగుల నేల ఇమ్మని యాచించి, వెంటనే త్రివిక్రముడవై బ్రహ్మాండమంతా నిండి, నీ అతిలోకరూపాన్ని ప్రదర్శించావు. బ్రాహ్మణుడిగా, శాంతమూర్తిగా ఉండవలసిన నీవు జాతిధర్మాన్ని విస్మరించి పరశురాముడివై యావత్ రాజలోకాన్ని కడతేర్చలేదా? క్షత్రియ కులంలో శ్రీరాముడిగా అవతరించి సౌందర్యవతి, అర్ధాంగి అయిన సీతాదేవిని రాక్షసుల బారినుండి కాపాడటానికి రావణాది రాక్షసవీరులను పరిమార్చలేదా? ఇప్పుడు వాసుదేవాది రూపాలలో క్రూర రాక్షసులను ఎందరినో వధించావు. నిన్ను, నీ గుణగణాలను, నీ శౌర్యసంపదను వర్ణించడానికి నేనెంతవాడిని కృష్ణా? మాయతో ఆపదలో చిక్కుకున్నాను. దుఃఖంతో కొట్టుకుపోతున్నాను. దయామయుడివై, నా బాధలన్నిటినీ పారద్రోలి నన్ను రక్షించు. ఆశ్రితులకు వరాలు క్రుమ్మరించే కల్పవృక్షం వంటి నీకు భక్తి ప్రపత్తులతో నమస్కరిస్తున్నాను. శేషతల్పశాయీ! నన్ను కరుణించు. నా విన్నపం ఆలించు. సంసార లంపటత్వంతో మూఢుడినైన నన్ను కటాక్షించు” అని వినుతిస్తున్న అక్రూరునికి శ్రీకృష్ణుడు మళ్ళీ తన నిజరూపాన్ని చూపించి అంతర్ధానమైనాడు. భగవంతుని రూపాన్ని తలచుకుంటూ భక్తిభావంతో కళ్ళు చెమరుస్తుండగా అక్రూరుడు మెల్లగా నీటి బయటకు వచ్చి రథాన్ని ఎక్కడంతో కృష్ణుడు తనకేమీ తెలియనట్లు అక్రూరునివైపు చూశాడు. “అక్రూరా! నది చాలా దగ్గరలో ఉంది గదా! నీవు స్నానానికని వెళ్ళి చాలాసేపయింది. భూలోకంలోనూ, ఆకాశంలోనూ కనపడని క్రొత్త క్రొత్త విషయాలేమైనా నీకు నీళ్ళలో కనపడ్డాయా ఏమిటి?” అని ప్రశ్నించడంతో అక్రూరుడు – కృష్ణుడు తననింకా పరీక్షిస్తున్నాడనుకొన్నాడు. “కృష్ణుడికి తన భక్తి తెలియదా?” అని భావించాడు.

**“నీలోనలేని చోద్యము**
**లీలోకములందు చెప్పరీశ్వర నీటన్**
**నేలన్ నింగిని ఉన్నవె?**
**నీలో చోద్యంబులెల్ల నెగడు మహాత్మా!”**

– 1239 ప – ద.స్కం – పూ.భా – భాగవతము

“మహాత్మా! భక్తవత్సలా! పురాణపురుషా! నీవా పరమాత్ముడివి! నీలో లేని వింతలు ఏ లోకంలోనూ ఉండవన్నది పెద్దలు చెప్పినమాట. అటువంటిది నీలోలేని చోద్యాలు నీళ్ళల్లో, నేలలో, నింగిలో ఉంటాయా? ఉండవు. సర్వాంతర్యామివైన నీలోనే అన్ని వింతలూ ఇమిడి ఉంటాయి. నిన్ను చూస్తే అన్నీ చూసినట్లే నీ దివ్యమంగళ స్వరూపాన్ని చూపి నన్ను ధన్యుణ్ణి చేశావు” అని మాట్లాడుతూ అక్రూరుడు సాయంకాల సమయానికి రథాన్ని మధురానగరానికి తీసుకువచ్చాడు. అప్పటికే నందరాజు, తక్కిన గోపనాయకులు అక్కడ విడిది చేసి ఉండడంతో బలరామకృష్ణులు రథం దిగి వారి వద్దకు వెళ్ళి మాటలలో పడ్డారు. అక్రూరుడు కృష్ణుడివైపు చూసి తన మనసులోని కోరికను ఆ భక్తవత్సలుడికి విన్నవించాడు.

**"నా యింటికి విచ్చేయుము**
**నీ యంఘ్రి సరోజరేణుని కరము సోకన్**
**నాయిల్లు పవిత్రంబగు**
**శ్రీయుత! నీ భటుని పెద్ద సేయందగదే?"**

– 1241 ప – ద.స్కం – పూ.భా – భాగవతము

"దేవదేవా! నా ఇంటికి రావయ్యా! నీ పాదపద్మాల ధూళి సోకగానే నా ఇల్లు పరమ పవిత్రమై శోభిల్లుతుంది. నీ భటుడిని, భక్తుణ్ణి అయిన నన్ను కరుణతో ఆదరించలేవా?" అని ప్రాథేయపడుతున్న అక్రూరునితో కంసుని చంపిన తరువాత తప్పక నీ ఇంటికి వస్తానని మాట ఇచ్చి కృష్ణుడతనిని, తాను వచ్చిన సంగతి కంసుడికి చెప్పమని పంపడంతో అక్రూరుడు నగరంలోకి వెళ్ళి కృష్ణాజ్ఞను పాటించి తన ఇంటికి వెళ్ళిపోతాడు.

పరీక్షిన్మహారాజా! మరునాడు మధ్యాహ్నం శ్రీకృష్ణుడు, బలరాముడు గోపకులు వెంటనంటి వస్తుండగా మథురానగరం ప్రవేశించి, పురవీధులకు రెండువైపులా ఉన్న మేడల అందచందాలను చూస్తూ మెల్లగా నడవసాగాడు. కోటలతో, బురుజులతో, రాజభవనాలతో, చతురంగ బలాలతో, ఉద్యానవనాలతో అత్యంత శోభాయమానంగా ఉన్న మథురానగర సౌందర్యాన్ని తిలకించి పులకించాడు. కృష్ణుడు మథురకు వచ్చాడన్న వార్త తెలిసింది – పౌర కాంతలందరికీ. అదే విషయం ఒకరితో ఒకరు చెప్పుకోసాగారు. "ఎప్పుడు కృష్ణుని చూసి తరిద్దామా" అని తహ తహలాడారు.

**"నందతపఃఫలంబు, సుగుణంబుల పుంజము, గోపకామినీ**
**బృందము నోముపంట, సిరివిందు, దయాంబుధి, యోగి బృందముల్**
**డెందములందు కొండుకడింది నిధానము సేరవచ్చెనో**
**సుందరులార! రండు చని చూతము కన్నుల కోర్కి తీరగన్"**

– 1247 ప – ద.స్కం – పూ.భా – భాగవతము

"ఓ సుందరులారా! రండి రండి. మన నగరానికి ఎవరు వచ్చారనుకుంటున్నారు? కళ్ళారా చూద్దాం రండి. మళ్ళీ ఎప్పటికా జగన్మోహనాకారుని దర్శనం లభిస్తుందో!! ఆ దివ్యమంగళ స్వరూపుని ఒక్కసారి చూస్తే చాలు – పాపాలన్నీ తొలగిపోతాయి. వైకుంఠవాసం కలుగుతుంది. కృష్ణుడు – నందమహారాజు పూర్వజన్మలలో చేసుకొన్న తపస్సుకు ఫలంగా ఆతని చేత పెంచబడ్డాడమ్మా! ఇక యశోద సంగతి చెప్పనే అక్కరలేదు. యశోద కృష్ణుడికి పాలిచ్చి, ప్రేమానురాగాలతో పెంచిందంటే ఆమె కనుసన్నలలో కృష్ణుడు మెలిగాడంటే – నిజంగా కృష్ణుడమ్మా వచ్చింది! కృష్ణుడంటే ఎవరో కాదు, శ్రీమహావిష్ణువే! యశోద చేసుకున్న పుణ్యఫలం ఎంతో కదా! సకల సద్గుణాలు శ్రీకృష్ణుడిలో మూర్తీభవించి ఉన్నాయట! గోపకాంతలు నోచిన నోములెన్నో!! ఆ నోముల ఫలంగానే కృష్ణుడు వారికి అనురక్తుడయ్యాడు. లక్ష్మీదేవి చిత్తాన్ని అలరింపచేసే ప్రేమమూర్తి. ఆ జగన్నాథుడు దయాసముద్రుడమ్మా! యోగుల మనసులలో పెన్నిధిగా, ముక్తిదాతగా నిల్చిన పరమాత్ముడమ్మా శ్రీకృష్ణుడు" అన్న మాటలు ఎన్నో పనులలో నిమగ్నులై ఉన్న మథురానగర పౌరకాంతల చెవులలో పడ్డాయి. అంతే, అందరూ చేస్తున్న పనులన్నీ మాని తమ తమ మేడలపై భాగాలను చేరారు గుంపులు గుంపులుగా. ఎప్పుడెప్పుడు కృష్ణుడు తమ ఇంటి ముందుకు వస్తాడా, ఎప్పుడెప్పుడు ఆ పురుషోత్తముని చూడగలుగుతామా అని ఎదురు చూడసాగారు. ఇంతలో కృష్ణుడు రానే వచ్చాడు. ఒక్కొక్కరి ఇంటిముందు ఒక్కొక్క క్షణం ఆగి నడవసాగాడు. తమ తమ చూపులకు అందేటంతవరకు కృష్ణుని చూస్తూనే ఉన్నారు పౌరకాంతలు. చూపుకు దూరమయ్యేసరికి కృష్ణుని లీలలు, మహిమలు చెప్పుకుంటూ తృప్తి పడసాగారు.

**"వీడటే రక్కసి విగతజీవగ చన్ను**
**పాలు త్రావిన మేటి బాలకుండు!**
**వీడటే నందుని వెలదికి జగమెల్ల**
**ముఖమందు చూపిన ముద్దులాడు!**
**వీడటే మందలో వెన్నలు దొంగిలి**
**దర్పించి మెక్కిన దాపరీడు!**
**వీడటే యెలయించి వ్రేతల మానంబు**
**సూఱలాడిన లోక సుందరుండు**
**వీడు లేకున్న పురమటవీ స్థలంబు**
**వీని పొందని జన్మంబు విగతఫలము**
**వీని పలుకని వచనంబు విహగరుతము**
**వీని చూడని చూడ్కులు వృథలు వృథలు"**

– 1250 ప – ద.స్కం – పూ.భా – భాగవతము

"వీడేనా? రాక్షసకాంత అయిన పూతన చనుబాలు త్రాగి ఆ క్రూరాత్మను చంపిన పసివాడు? వేరెవరైనా ఆ పని చేయగలరా భగవంతుడు తప్ప! అంతేకాదు. వీడేనమ్మా! యశోదకు తన నోరు తెరిచి సమస్త లోకాలు చూపించిన ముద్దుల కొడుకు! మరేనమ్మా! గోకులంలో ఇంటింటిలో చొరబడి వెన్నమీగడలు దొంగిలించి దర్పంతో పరుగులెత్తిన వాడు వీడేనట!! విన్నారా? గోప కన్నియల మనసులను, మానాలను చూరగొన్న లోకైక సుందరాకారుడు ఇతడేనటమ్మా! కృష్ణుడు లేనటువంటి పురం అడవితో సమానమనుకోండి. ఇతని పొందు పొందని జన్మ నిష్ప్రయోజనం. శ్రీకృష్ణుని చూడనటువంటి చూపులు అవి నిజంగా చూపులే కావు. ఎందుకూ పనికిరాని చూపులని

నిస్సంశయంగా చెప్పవచ్చు. కృష్ణుని మహిమ గురించిగాని, కృష్ణుని గురించిగాని పలుకలేని పలుకు అది పక్షికూతే అవుతుందిగాని మంచిమాట కాజాలదు" అని ఒకరితో ఒకరు చెప్పుకొంటూ తన్మయులైపోయారు. కృష్ణుడు తమను దాటి వెళ్ళిపోయేంతవరకు ఆ అందగాడిపైన, ఆ మహిమోపేతుడిపైన పూలజల్లులు కురిపిస్తూనే ఉన్నారు. మథురానగర కాంతలందరూ కృష్ణనామాన్ని జపిస్తూ, కృష్ణునే చూస్తూ, కృష్ణునే తలపోస్తూ పులకించిపోయారు రాజా!!

"ఆహా! ఆకాలంలో జన్మించి, కృష్ణుని దర్శించి, తరించినవారిదే జన్మ అంటే. శ్రీకృష్ణుని ఎక్కువకాలం చూసి, ఆ మహాత్ముడితో గడిపి ధన్యుణ్ణి కాలేకపోయిన మందభాగ్యుణ్ణి నేను" అని క్షణంపాటు చింతించాడు పరీక్షిత్తు. "అనుక్షణం కృష్ణగాథలే వింటున్నావు. కృష్ణ నామాన్నే తలుస్తున్నావు. అపరిమితమైన భక్తితో ఆ పరమాత్ముని ఆరాధిస్తున్నావు. ఆ యోగీశ్వరేశ్వరుని అనుగ్రహంతో జన్మించావు. ఆయన దయ నీమీద పరిపూర్ణంగా ఉంటుంది విచారపడకు" అన్న శుకమహర్షి మాటలతో కొంచెం తేరుకుని, తరువాత ఏం జరిగిందో, కృష్ణుడేం చేశాడో చెప్పమని అడిగాడు పరీక్షిత్తు.

"రాజా! బలరామకృష్ణులు మథురానగరంలో ప్రవేశించి రాజవీధులలో నడుస్తుండగా బ్రాహ్మణోత్తములా విషయం విని, వారిని చేరి వివిధములైన చందన ద్రవ్యాలతో, పుష్పాలతో, అక్షతలతో సత్కరించి రకరకాల పళ్ళను కానుకలుగా సమర్పించారు.

(ఇంకా ఉంది)

# శనీశ్వరుని పెద్ద ఆలయం

- జి.ప్రభాకర్‌రావు

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి (పాండిచ్చేరి) లో తిరునల్లారు (కారైకాల్ దగ్గర) గ్రామంలో శనీశ్వరునికి ఒక పెద్ద ఆలయం ఉంది. చాలా ప్రాచీనమైన ఆలయం ఇది. ప్రతి సంవత్సరం రెండున్నర సంవత్సరాల కోసం శని పెయెర్చి అనే గొప్ప ఉత్సవం జరుగుతుంది. లక్షలాది మంది భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొంటారు. ఆరోజున శనిదేవుడు ఒక రాశినుండి మరోరాశిలోనికి ప్రవేశించే రోజని చెబుతారు. ఆరోజున భక్తులు స్నానం ఆచరించి శుచిగా వుండి బ్రాహ్మణులకు నువ్వులు దానం చేస్తారు.

ఈ శనీశ్వరాలతో ప్రసిద్ధి చెందిన తిరునల్లూరులో దర్భారణేశ్వరుడు అనే మరో ఆలయం వుంది. ఈ దేవునికి దర్భగడ్డి అంటే చాలా ప్రీతి. అందుకే ఈ స్వామిని దర్భాధిపతి అంటారు. ఈయనకు భోగామ్బపోన్ మొలియాళ్ అనే దేవి ఉంది. అమ్మవారి ఆలయానికి తూర్పుదిక్కులో సూర్యునికి ఎదురుగా శనిదేవుని ఆలయం ఉంది. ఇక్కడ రాతిగోడలో ఉన్న రాతి విగ్రహం అత్యంత ప్రతిష్ఠ గలది. రోజూ ఈ విగ్రహానికి వందలకొద్దీ అభిషేకాలు జరుగుతాయట. దర్భ అనే గడ్డి ఇక్కడ అతి పవిత్రమైన మొర్గ్ కావటం విశేషం. శని ఆలయాన్ని దర్శించు భక్తులు గడ్డిమొర్గ్‌ను ముడివేసి సమర్పిస్తారు. అలా చేస్తే తమ కష్టాలన్నీ గట్టెక్కుతాయని భక్తుల నమ్మిక.

తిరునల్లారులో ఎన్నో పవిత్ర తీర్థాలున్నాయి. నల తీర్థం ప్రముఖమైనది. భక్తులు ఈ తీర్థంలోనే తలారా స్నానమాచరించి శనిదేవుని సమర్పించుకుంటారు. చిన్న చిన్న



ప్రమిదలలో నూనె పోసి దీపాలు వెలిగించి శనిదేవుని ముందు పెడతారు. దేవాలయం మధ్యభాగంలో ఉన్న మండపంలో నల దమయంతుల విగ్రహాలున్నాయి. నలతీర్థంలో స్నానం చేసినవారికి అన్ని పాపాలు పోతాయని, అందులో స్నానం చేసినవారికి అపకారం చేయనని శనిదేవుడు చెప్పినట్లుగా అంటారు. శనిపెయెర్చి రోజు వెలిగించిన దీపపు ప్రమిదలో నువ్వులు కట్టిన చిన్న పొట్లాలు శనివిగ్రహం ముందు సమర్పిస్తారు. ఆరోజున దీపాల వైభవంతో ఆలయం ధగధగ మెరిసిపోతుంటుంది. నలతీర్థం దగ్గరే నలబావి (నలకూపం) ఉంది. నలుని కొరకే గంగానది కాశీనుండి ఇక్కడికి వచ్చిందంటారు. భక్తులు ఆ బావిలోని నీళ్ళు నెత్తిన జల్లుకుంటారు.

శని దేవుని వాహనం కాకి. ఆలయంలో బంగారు కాకి విగ్రహ వాహనం ఉంది. ఉత్సవాలలో శనివారం నాడు మూలవిగ్రహానికి బంగారు తొడుగు ధరింపచేస్తారు.

కుంభకోణం, నాగపట్టణం నుండి తిరునల్లారు తేలికగా చేరవచ్చు. మద్రాసు నుండి 350 కి.మీ దూరంలో ఉంటుంది తిరునల్లారు ఆలయం.

వినా వేంకటేశం న నాథో న నాథః
సదా వేంకటేశం స్మరామి స్మరామి



### 697. ఓం వసుమనసే నమః

**– సమదర్శనుడు (ఎట్టి భేదభావము లేని మనస్సు గలవాడు)**


జ్ఞానియైనవాడు అన్ని భూతములను, జీవులను సమదృష్టితో చూచును. గీతలోని విజ్ఞానయోగములో (5.18) (విద్యావినయ సంపన్నే.... సమదర్శినః) ఈ విషయమునే తెలుపుచున్నది. ఇట్టి జ్ఞానులకు పరమ ఉదాహరణము విష్ణువే. సచ్చిదానందమూర్తి యగు విష్ణువు భిన్నత్వములో ఏకత్వమును దర్శించు పరమాత్మ. అట్టి వసుమనునకు నమస్కారము.



### 698. ఓం హవిషే నమః

**– యజ్ఞములయందు హవిస్సు రూపమైనవాడు**

యజ్ఞ యాగములందు సమర్పించు నివేదనలకు హవిస్సని పేరు. హవిస్సు పరమాత్మ స్వరూపము. యజ్ఞకర్త, యజ్ఞభోక్త కూడ పరమాత్మ స్వరూపమే. అందుచేతనే గీత (జ్ఞానయోగము 14.24) "బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్" అని వివరించుచున్నది. పరమాత్మ (విష్ణువు) స్వరూపముగా భావించబడు హవికి నమస్కారము.



### 699. ఓం సద్గతయే నమః

**– సత్సాధకులకు గమ్యమైనవాడు**


విష్ణు సాయుజ్యము సాధకులందరి గమ్యము. బ్రహ్మయొక్క అస్తిత్వమును తెలియువారు సత్సాధకులు. తైత్తిరీయోపనిషత్తు "అస్తి బ్రహ్మేతి చేద్వేద సంతమేనం తతోవిదుః" అని వివరించుచున్నది. సత్సాధకులకు గమ్యమైన విష్ణువు సద్గతియని చెప్పబడుచున్నాడు. సద్గతియగు విష్ణువుకు నమస్కారము.




### 700. ఓం సత్కృతయే నమః

**– జగద్రక్షణ వంటి సత్కార్యములు చేయువాడు**

భగవంతుడు చేయు సృష్టి స్థితి లయ కార్యములన్నియు జీవులకు ప్రపంచమునకు మంచిని చేకూర్చునవిగ నుండును. శాంతి సామరస్యము కొరకు భగవత్కార్యములన్నియు జరుగుచున్నవి. అందుచే విష్ణువు సత్కృతుడని భావింపబడుచున్నాడు. సత్కృతునకు నమస్కారము.








### 701. ఓం సత్తాయై నమః

**– సజాతీయ, విజాతీయ, స్వగత భేదము లేనట్టి భగవంతుడు**

పరమాత్మ ఒకే ఒకడను భావమును "ఏకమేవా ద్వితీయమ్" అని ఛాందోగ్యోపనిషత్తు ధృవీకరించుచున్నది. పరమాత్మ ఒకే రీతిగా ఎల్లప్పుడూ నుండును. "సజాతీయ విజాతీయ స్వగతభేద రహిత వస్తు"వని ఉపనిషద్వాక్యము. ఎటువంటి భేదభావములు లేని ఏకైక వస్తువు పరమాత్మ (విష్ణువు). 'సత్తా'యైన విష్ణువుకు నమస్కారము.



### 702. ఓం సద్భూతయే నమః

**– నిత్యుడు, జ్ఞానరూపుడుగా నుండి, హానినొందక వివిధ విభూతుల ద్వారా ప్రకాశించువాడు**


వివిధావతారములలో తన విభూతులను ప్రదర్శించుటచేత సద్భూతుడని మరియొక విధముగా చెప్పబడుచున్నాడు. విష్ణువు యొక్క మహావిభూతులు లెక్కించుటకు గాని, కొలుచుటకుగాని శక్యము కాదు. దేవతలు సైతము విష్ణువు శక్తి నెరుగజాలరు. పరమయోగులు ధ్యానమందు పరమాత్మ విభూతులను గ్రహించగలరు. సద్భూతియగు విష్ణువుకు నమస్కారము.



### 703. ఓం సత్పరాయణాయ నమః

**– సత్యమార్గమవలంబించు సత్పురుషులకు ధ్యేయము**

ధ్యేయుడు గాన విష్ణువు సత్పరాయణుడని భావింతురు. సత్పురుషులనగా బ్రహ్మను తెలిసినవారని అర్థము. సత్పరాయణునిగా భావింపబడు విష్ణువుకు నమస్కారము.



### 704. ఓం శూరసేనాయ నమః

**– శౌర్య ధైర్య సాహసములు గల సేనాబలము గలవాడు**

శ్రీరామ, శ్రీకృష్ణావతారము లందు, ఆంజనేయ, లక్ష్మణ, భీమార్జునులు వంటి పరాక్రమవంతులు సేనాబలగమందు గలరు. అందుచే విష్ణువునకు శూరసేనుడను నామము కలిగినది. శూరసేనునకు నమస్కారము.



## అన్ని నామాలూ నీవే అయిన ఓ వేంకటేశా! నీకు నమస్కారము

బొమ్మలు: కె.వి. భీమారావు



# భజగోవిందం

- శ్రీశ్రీశ్రీ నిత్య శుద్ధానందగిరి స్వామి 23

## 23. నీవెవరు? నేనెవరు?

**కస్త్వం కోఽహం కుత ఆయాతః కామే జననీ కోమేతాతః।**
**ఇతిపరిభావయ సర్వమసారం - విశ్వంత్యక్త్వా స్వప్నవిచారమ్॥**
**భజగోవిందం భజగోవిందం - భజగోవిందం మూఢమతే**

- నీవెవరు? నేనెవరు? ఎక్కడినుండి వచ్చాను! నా తల్లి ఎవరు? నా తండ్రి ఎవరు? ఇంద్రియాలకు గోచరమయ్యే ఈ అపారమైన మొత్తం ప్రపంచం స్వప్నంలో భావించేలాంటిదే! (అంటే ఊహాజనితమయ్యిందే) అందుకే దీనిని విచారణ చేసి విడిచిపెట్టాలి.

ఆచార్యుల వారి శిష్యుల్లో ఒకరైన యోగానందుల వారు ఈ శ్లోకం చెప్పారు. ఇది ఆచార్యులవారి మార్గమే.

మొదటి రెండు పాదాలు ప్రశ్నలే! మనం ఎవరం? ఎక్కడినుండి వచ్చాం! ఈ ప్రశ్నలీ జీవుడు పుట్టినప్పటి నుండి పుడుతూనే ఉన్నాయి. ఈ జీవలోకం ఉన్నంతవరకు పుడుతూనే ఉంటాయి. ప్రశ్న పుట్టేది మనస్సులో! సమాధానం ఇచ్చేది మనస్సే! సమాధానింపబడేది మనస్సే.

ఇదొక ఇంద్రజాలం. ఈ మనస్సు సమాధానాన్ని పొంది ఊరుకొంటుందా! మళ్ళీ ప్రశ్న వేస్తూనే ఉంటుంది. మరి ఇలాంటిది ఒక అద్భుతం కాక మరేమవుతుంది.

ఇది చలికాలం వేడిని కోరుతుంది; వేసవి కాలం చలిని వాంఛిస్తుంది. నిరుద్యోగంలో ఉన్నప్పుడు ఉద్యోగాన్ని కోరుతుంది. ఉద్యోగాన్ని చేస్తూనే నిరుద్యోగంలో స్వాతంత్ర్యాన్ని ఆపేక్షిస్తుంది; స్వతంత్రతలోనే హాయి ఉందనుకొంటుంది. ఒకప్పుడు సంతానం లేదు కదా అని బాధపడుతుంది; సంతానం కలిగిన తర్వాత కొడుకులతో కోడండ్రతో విపరీతాలు ఏర్పడగానే సంతానం లేని వారే ధన్యాత్ములంటుంది. విపరీత ధోరణిలో సతమతమవుతుంది.

అందుకే తనలో తాను తృప్తి చెందని మనస్సు బాహ్యంలో తృప్తి చెందడమనేది సత్యదూరమైన విషయమని పెద్దలు చెబుతారు. ముఖ్యంగా ఈ మనస్సులో అసత్యపు ఆలోచనలు రాకూడదు.

ఈ "అసత్యం" వైపుగా మనస్సు వెళ్ళకూడదంటే ఆత్మానాత్మ వివేచనా జ్ఞానం కలగాలి. దీనికి సాధన అవసరం. ఏది సత్తో, ఏది అసత్తో తెలియాలి. సదసద్వస్తు వివేచన కలగాలి; సత్యాసత్యాల విచక్షణా జ్ఞానం వల్ల సంపాదించాలి. ఇంతకు మించిన తరుణోపాయం లేదు.

మనస్సు ఎన్నో జన్మల నుండి విషయచింతన చేస్తూనే ఉంది. శరీరం నశించినా ఇది నాశనం కావడం లేదు. మళ్ళీ మళ్ళీ నూతన శరీరంలో ప్రవేశిస్తుంది. పూర్వం చింతించినట్లే మళ్ళీ చింతిస్తున్నది. అందుకే శ్రీకృష్ణ పరమాత్మ ఇలా అంటాడు.

**శ్లో॥ అభ్యాసయోగయుక్తేన - చేతసానాన్యగామినా।**
**పరమం పురుషం దివ్యం - యాతిపార్థాను చిన్తయన్॥**

అర్జునా! అభ్యాసయోగాన్ని అవలంబించాలి. అన్య విషయాలవైపు ఆ మనస్సు వెళ్ళకుండా చేయాలి. ఆ దివ్య పురుషుణ్ణే అనుక్షణం స్మరించాలి. అలా స్మరించే మనుజుడు ఆ పరమాత్మనే పొందుతాడు.

గీతలో చూడండి! కర్మ భక్తి జ్ఞాన యోగాలే కాక అభ్యాసం కూడా యోగమే అంటున్నాడు శ్రీకృష్ణపరమాత్మ.

విషయ చింతనలు తగ్గించి విశ్వేశ్వర చింతనం పెంచాలి. దీనిని అభ్యసించాలి. ఈ మనస్సు మహా మాయలమారి. ప్రశాంతంగా కూచుందాం; ధ్యానం చేసుకుందామనుకుంటాం; అలా కూచున్నామో లేదో మంచి సినిమా వచ్చిందట వెళ్ళుదామా అంటుంది ఒకరితో; మరొకరితో క్లబ్బుకు పోదామా అంటుంది. ఇది శరీరాన్ని ధ్యానం నుండి లేపుతుంది. బహు విషయాల వైపు పరుగెత్తించి అలువగొడుతుంది.

ఈ మనస్సు తత్త్వాన్ని గమనించాలి. అది కోరిన దిశకల్లా పరిగెత్తరాదు. స్థిరచిత్తంతో, అంతఃకరణం ఆధిపత్యంతో, భ్రమించే మనస్సును అరికట్టాలి. పరమధ్యేయమైన పరమాత్మ వైపుగా లక్ష్యం చూపించి అది అటువైపు నడిచేటట్లు చేయాలి.

భక్త కబీరుదాసు -

**మన్‌గయే తో గయే - తన్‌కో మత్ జానేదేవ్**
**"మనస్సు పోతే పోయింది - శరీరాన్ని మాత్రం పోనివ్వకు"**

అన్నారని పెద్దలు చెబుతారు. శరీరం ఉండి మనస్సు



చరిస్తే – అది కూడ మానసిక వ్యభిచారం క్రిందికే వస్తుందని తత్త్వ శాస్త్రాలు చెబుతున్నాయి. అందుకే తత్పరుడై సంయతేంద్రియుడైన శ్రద్ధావంతుడే జ్ఞాని అవుతాడని భగవద్గీత చెబుతున్నది.

సత్యం తెలియనప్పుడు ఈ మనస్సు నీవెవరు అని ప్రశ్నించే శరీరమే అంటుంది. నేనెవరు అని ప్రశ్నించి శరీరమే అంటుంది. తల్లితండ్రులెవరు అంటే శరీరాలే అంటుంది. ఇదంతా అసత్యం. "నేను" నీవు "తల్లిదండ్రి" – అన్నీ ఆత్మలే అని తెలిసేంత వరకు అజ్ఞానంలో ఉన్నట్లే.

అందుకే శ్లోక ద్వితీయ పాదం ఈ శరీరం – ఈ ప్రపంచం... అన్నీ స్వప్నాలే అంటుంది. సారం లేనిది సారమనుకోవడం, శరీరాలనే సత్యాలనుకోవడం భ్రాంతి కాక మరేమవుతుంది అంటున్నది. అందుకే విచారించుమంటున్నది. అందుకే సారహీనమైన ప్రపంచాన్ని వదిలిపెట్టుమంటున్నది.

కలలో రకరకాల వస్తువులు పొందుతాం! రాజ్యమేలినట్లుగా కలగంటాం. కలలో ఇవన్నీ స్థిరమే అనుకొంటాం. మేలుకొన్న తర్వాత ఇదంతా అబద్ధమని తేలిపోతుంది. ఈ స్వప్న ప్రపంచంలాంటిదే ఈ జాగరిత బాహ్య ప్రపంచం కూడా. స్వప్న ప్రపంచం నశించేదే! బాహ్య ప్రపంచం నశించేదే!

ఈ రెండు ప్రపంచాలొక్కటే. స్వప్నానికీ ఆద్యంతాలున్నాయి. ఈ వస్తు ప్రపంచానికీ ఆద్యంతాలున్నాయి.


నీవు వచ్చావు; నీవు వచ్చాక నీ కుమారుడు వచ్చాడు. నీవు పోతావు, నీ వెంబడి నీ కొడుకు రాడు. నీ బంధువులూ రారు. ఎవరివెంటా ఎవరూ రారు.

ఇంత నిస్సారమైన ఈ ప్రపంచాన్ని పట్టుకొని ప్రాకులాడడం సబబు కాదనే ఆచార్యుల మార్గాన్ని అనుసరించిన వారి శిష్యులు పై శ్లోకాన్ని అలాగ నిక్కచ్చిగా చెప్పారు. కండ్లు, చెవులు, సర్వేంద్రియాలు బలహీనమైపోయాయని ఏడిచేవారు కూడా ఆలోచించాలి. అవి సత్యం కావు. ఇవి ఉండడానికి మూలమైన జీవుడు ఒకడున్నాడని గుర్తిస్తే భ్రమలో పడడు మనిషి. ఈ విషయంలో పెద్దలీ క్రింది పద్యాన్ని చెబుతుంటారు.

**సీ ॥ ఆత్మవెళ్ళిన దేహమగ్నిహోత్రుని పాలు**
**కఠిన శల్యములన్ని గంగపాలు**
**మీదగప్పిన బట్ట మేటి బ్యాగరిపాలు**
**దాచుకొన్న ధనంబు ధరణిపాలు**
**ఇల్లు మంచము సొమ్ము ఇతర లోకుల పాలు**
**అల్లజీవుడు కాలయముని పాలు**
**కొడుకు వండిన పిండకూడు కాకులపాలు**
**భ్రష్టు పెండ్లామున్న ప్రజలపాలు**
**ఏది తన వెంట రాబోదు ఎవరికైన**
**మాధవా! నిన్ను దలచుటె మనిన ఫలము..."**

ఈ పద్యం ఎవరిదైతే నేమి! ఎన్ని సత్యాలు వివరించిందో చూడండి! ఇలాంటి వాటికన్నిటికీ మూలం యోగవాసిష్ఠాదులు – ఆదిశంకరుల అన్ని గ్రంథాలు. ఆ గ్రంథ గతాంశాల అధ్యయనం చేస్తూ జీవితాన్ని ముక్తిపథం వైపు మళ్ళిద్దాం.

❊ ❊ ❊



# తిరుమల యాత్ర

- మావూరు విజయలక్ష్మి



గత సంచిక తరువాయి

## మళయాళస్వామి

తిరుమలతో అనుబంధం కలిగిన మరొక యోగిపుంగవుడు సద్గురు శ్రీ మళయాళస్వామి. ఆధ్యాత్మికత, తపస్సు అంటే కేవలం ముక్కు మూసుకొని ఒక మూలన కూర్చోవడం మాత్రమే కాదని లోకానికి చాటి చెప్పిన మహానుభావుడు సద్గురు మళయాళస్వామి. వ్యాసాశ్రమ స్థాపకులుగా, సంఘంలోని పలు వివక్షలు, జంతుబలులు, నరబలులు వంటి దురాచారాలను రూపుమాపేందుకు కృషి చేసిన సంస్కర్త, ఆధ్యాత్మికవేత్త అయిన మళయాళస్వామి కూడా తిరుమలలో ఎంతోకాలం తపస్సు చేసి ఆ శ్రీనివాసుని ఆదరణకు నోచుకున్నారు.

1885వ సంవత్సరం మార్చి 29వ తేదీన కేరళలోని తిరువాయూర్‌కి దగ్గరలోని గ్రామంలో కరియప్ప, నొత్తియమ్మ దంపతులకు జన్మించిన మళయాళస్వామి అసలుపేరు వేలప్ప. చిన్నతనం నుంచి ఆధ్యాత్మికత తప్ప ఇంకో విషయం గురించి ఆలోచించని వేలప్ప కాలినడకతో దేశంలోని పుణ్యక్షేత్రాలన్నీ తిరిగి రావాలని సంకల్పించి బయలుదేరారు. అనేక పుణ్యక్షేత్రాలను దర్శించుకొని చివరి మజిలీగా తిరుమలకు చేరుకున్నారు వేలప్ప. దైవత్వం నిండిన ఆ ఎత్తైన కొండలు, ఆ పచ్చటి ప్రకృతిలోని ప్రశాంతత, వేదఘోష వినిపిస్తున్నట్టుగా జాలువారుతున్న జలధారలు వేలప్పకు బాగా నచ్చాయి. అందుకే అక్కడే తన సాధన కొనసాగించాలని తపస్సుకు పూనుకున్నారు. గోగర్భం చేరి, అక్కడ ఒక గుహలో తపస్సు ప్రారంభించారు. అలా కొంతకాలం తపస్సు చేసిన స్వామి మధ్యలో ఒకసారి ఇంటికి వెళ్ళినా అక్కడ ఉండలేక తిరిగి తిరుమల చేరుకొని గోగర్భం వద్ద గుహలో తపస్సు కొనసాగించారు. కొంతకాలం భిక్షాటన చేస్తూ, ఒక పూట మాత్రమే తింటూ ఆ తర్వాత భక్తులు పెట్టిన ప్రసాదం మాత్రం తింటూ, ఆ తరువాత అది కూడా మాని పచ్చిపిండిని తింటూ కాలం గడిపేవారు. శ్రీనివాసుని ఆదేశానుసారం మళయాళస్వామి వారికి మైసూరు తిరువేంకటాచార్యుడు అనే భక్తుడు వేంకటేశ్వర పూజ చేసి, ప్రసాదం ఇచ్చి వెళ్ళేవాడు. ఒకసారి మూడురోజులపాటు ఎడతెగని వర్షాలు పడి అతనికి ప్రసాదం అందించే వీలు లేకపోవడంతో అందించలేకపోయాడు. అప్పుడు సుబ్బరామశెట్టి అనే భక్తునికి వేంకటేశ్వరుడు కలలో కనబడి స్వామికి ఆహారం అందించమని చెప్పాడట. వెంటనే సుబ్బరామశెట్టి, స్వామికి ఆహారం అందించడానికి బయలుదేరాడు. కాని అతను కూడా

స్వామి ఉన్న గుహకు, నీరున్న ప్రదేశానికి మధ్య వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తున్న ఏరును దాటలేక ఒక వెదురు కర్రకు ఒక చివరన ప్రసాదం కట్టి దానిద్వారా స్వామికి ప్రసాదాన్ని ఆహారంగా అందించారట. అది మొదలు భగవంతుడు తనకు తానుగా ఏది ఇస్తే అది తింటాను తప్ప తాను ఆహారం కోసం ప్రయత్నించనని ఉండిపోయారట మళయాళస్వామి. అయితే తన భక్తుడు నిరాహారంగా ఉంటే ఆ భగవంతుడు చూస్తూ ఊరుకోడు కదా! అందుకే ఆ తర్వాతి కాలంలో స్వామివారి ఆహారానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా, అప్పటి మహంతు ప్రయాగదాసు సోదరుడు రామలఖనదాసు స్వామివారికి మఠంలోనే భోజనాన్ని ఏర్పాటు చేశారు. అయితే అది కూడా ఎన్నో రోజులు కొనసాగలేదు. ఒకరోజు స్వామివారు తీవ్రమైన ధ్యాననిష్ఠలో ఉండిపోయి వేళ దాటిపోయిన తరువాత మఠానికి వెళ్ళారు. దాంతో అక్కడివారు మీకు వేళాపాళా లేదా? అంటూ విసుక్కున్నారట. అప్పటినుంచి స్వామి మఠానికి వెళ్ళడం మానుకున్నారు. అయితే భగవంతుని కరుణతో ప్రతిరోజు ఎవరో ఒకరు స్వామి ఉన్న గుహ దగ్గరకే వచ్చి ఆహారం అందించి వెళు తుండేవారట. అలా కొంతకాలం పాండవ గుహల్లోను, మరికొంత కాలం తుంబురు తీర్థంలోని వెంగమాంబ గవికి చేరువలో ఒక పాక వేసుకొని అందులోను, కొంతకాలం సనక సనందన తీర్థం ఇలా తిరుమలలోని వివిధ ప్రదేశాలలో సుమారు పన్నెండు సంవత్సరాలపాటు తపస్సు చేశారు వేలప్ప. అక్కడ తపస్సు చేసుకుంటున్నప్పుడే అక్కడివారు వేలప్ప వేషాన్ని, భాషను చూసి అతనిని మళయాళస్వామి అని పిలిచేవారట. ఆ పేరే స్థిరపడి వేలప్ప మళయాళస్వామిగా పేరు మారిపోయింది.

మళయాళస్వామి విషయంలో ఎన్నో విచిత్రాలు చోటు చేసుకున్నాయని చెప్తారు. ఒకసారి తీవ్రమైన తపస్సులో ఉండగా పొదలచాటునుంచి చూసిన వేటగాడు, అక్కడేదో మృగం ఉందనుకొని రెండుసార్లు తుపాకీ పేల్చాడట. అయితే విచిత్రంగా ఆ గుళ్ళేవీ స్వామిని తాకలేదు. అవి ఆయననేం చేయలేకపోయాయి. అదేవిధంగా గోగర్భం దగ్గర పాండవగుహలో ఆయన తపస్సు చేస్తున్నపుడు ఆయన చుట్టూ పులులు, సింహాలు, ఎలుగుబంట్లు తిరుగుతూ ఉండేవట. కానీ స్వామి ఏమాత్రం కంగారు పడకుండా ఆ వేంకటేశ్వరుని వేడుకుంటూ ప్రార్థన చేయగానే అవి నెమ్మదిగా అక్కడినుంచి వెళ్ళిపోయేవట.

మళయాళస్వామి వారు కేవలం తన ధ్యాసలో తాను తపస్సు చేసుకుంటూ ఎవరికీ ప్రయోజనం లేకుండా ఉండాలని కోరుకోలేదు. అందుకే ఒకవైపు భగవంతుని గూర్చి తీవ్రమైన తపస్సు చేస్తూనే మరోవైపు ఎన్నో సమాజ హితకరమైన పనులను చేశారు. గోగర్భ తీర్థంలో ఉన్న సమయంలో స్వామివారు అక్కడ యాచనతో బ్రతుకులను వెళ్ళదీస్తున్న కొందరు అనాథ పిల్లలను చేరదీసి వారికి విద్యాబుద్ధులు చెప్పించే ప్రయత్నం చేశారు. స్వామీజీ ఆలోచనలు కూడా విభిన్నంగా ఉండేవి. అప్పుడెప్పుడో స్వామి వివేకానంద చెప్తుండేవారట. "నేను కోరుకునేది జన్మరాహిత్యం కాదు. ఎందుకంటే మనం జన్మనెత్తితేనే కదా మన సాటివారికి సాయం చెయ్యగలం. అందుకే నేను నా సాటి మనుషులకు సహాయపడే అవకాశం వస్తుందంటే ఎన్ని జన్మలెత్తడానికైనా సిద్ధమే!" అని. అదేవిధంగా స్వామివారిని కూడా సనక సనందన తీర్థంలో స్వామివారు ధ్యానంలో గడుపుతున్న సమయంలో ఎవరో అడిగారట. స్వామీ మీరెందుకు ఇంతగా తపస్సు చేస్తున్నారు. మోక్షం కోసమా? భగవంతుని సాక్షాత్కారం కోసమా? అని. అపుడు స్వామి చెప్పిన సమాధానం ఇదే. మళ్ళీ జన్మించి సాటివారికి సహాయం చేసే శక్తిని ప్రసాదించమని భగవంతుణ్ణి కోరుకుంటున్నానని.

చివరకు పన్నెండేళ్ళు కఠోరమైన దీక్షతో ధ్యాననిమగ్నులై తిరుమలలోనే ఆత్మసాక్షాత్కారాన్ని, దివ్యప్రబోధాన్ని పొందారు మళయాళస్వామివారు. గోగర్భంలోని క్షేత్రపాలక శిలకు ఉత్తరదిశలో శ్రీవేంకటేశ్వరుని అర్చనకు తులసివనాన్ని నిర్మించి భగవంతునికి తులసిని అందించడానికి ఒక సాధువును కూడా ఏర్పాటు చేశారు.

స్వామివారి అభిప్రాయాలు కూడా ఎంతో అభ్యుదయ పథంలో ఉండేవి. స్త్రీలు కూడా విద్య నేర్చుకోవాలని, వర్ణవ్యవస్థ లోని లోపాలను సరిదిద్దడానికి కృషి చేశారు. జాతి, వర్ణ, లింగ భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ బ్రహ్మవిద్యకు అర్హులేనని ప్రకటించారు మళయాళస్వామివారు. సహజంగానే ఈ అభిప్రాయాలేవీ ఆనాటి సనాతనులకు ముఖ్యంగా తిరుమలలోని కొందరు పెద్దలకు రుచించలేదు. దాంతో వారు స్వామివారిని అక్కడినుంచి వెళ్ళగొట్టాలని ప్రయత్నించారు. సరిగ్గా అదే సమయంలో స్వామివారు కూడా తను చేయదలచిన సంస్కరణలకు తిరుమలలో ఉండడం కంటే, అక్కడినుంచి బయటకు వెళ్ళడమే మంచిదని భావించి తిరుమలను వదిలి పయనం కట్టారు. తిరుపతి, శ్రీకాళహస్తి మధ్యన ఏర్పేడు వద్ద ఆది గురువైన వ్యాసుని పేరుమీద ఒక ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. అదే ఈనాడు ఎంతోమంది ఆధ్యాత్మిక వేత్తలకు, గ్రంథరచనకు, ప్రచురణలకు నిలయంగా ఉన్న వ్యాసాశ్రమం. ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు సందేహాలను నివృత్తి చేసేవిధంగా ఎన్నో గ్రంథాలను రచించారు. ఇలా ఎన్నో సంస్కరణలకు మారుపేరుగా, భావితరాల వారికి

మార్గదర్శిగా నిలిచిపోయిన మళయాళస్వాములవారు 1962లో శయనైకాదశినాడు పరమాత్మునిలో లీనమయ్యారు.

## తిరుమలనంబి

సాక్షాత్తూ శ్రీవేంకటేశ్వరుని చేతనే తాతా అని చనువుగా పిలిపించుకున్నవాడు, అణువణువు శ్రీవేంకటేశ్వరుని భక్తిని నింపుకున్న భక్తశిఖామణి, శ్రీ రామానుజులవారికి స్వయాన మేనమామ తిరుమలనంబి. క్రీ.శ. పదవ శతాబ్దానికి చెందిన వైష్ణవ భక్తుడు తిరుమలనంబి. వీరినే శ్రీశైలపూర్ణులు అని కూడా పిలుస్తారు. వీరు విష్వక్సేనుని పరివారములోని సుముఖుని అంశతో జన్మించారట. శ్రీశైలపూర్ణులు యమునాచార్యులవారి శిష్యులు. కంచిలో యమునాచార్యులవారి దగ్గర శిష్యరికం చేస్తూ, గురువుగారిని సేవిస్తూ ఉండేవారు. వైష్ణవ మతాచార్యుడైన యమునాచార్యులు తిరుమలలోని శ్రీవేంకటేశ్వరునికి నిత్య అలంకార, ఆరాధనలు జరిపించాలన్న ఉద్దేశ్యంతో తన శిష్యులలో ప్రముఖుడు, శ్రీవేంకటేశ్వరుని భక్తుడు అయిన శ్రీశైలపూర్ణులను తిరుమల వెళ్ళి శ్రీవేంకటేశ్వరునికి నిత్యం పూమాలలు ఇవ్వడం, అభిషేకాదులు నిర్వహించడం వంటి బాధ్యతలను ఇచ్చి తిరుమల పంపారు. అలా వచ్చిన శ్రీశైలపూర్ణులు ఇక వెనుకకు మరలలేదు. తన కర్తవ్యం అతనికి తెలిసివచ్చింది. తిరుమల శ్రీనివాసుని సేవలు, ఆరాధనలతోనే తన జీవితం ధన్యమవుతుందని తెలుసుకున్నారు. తిరుమలగిరుల పవిత్రతకు ఆకర్షింపబడి, శ్రీవారి భక్తితత్పరతలో మునిగి ఇక కంచి వెళ్ళకుండా తిరుమలలోనే ఉండిపోయారు. నిరంతరం శ్రీవారిని సేవిస్తూ, వారికి వివిధ రకాల సేవలు చేస్తూ ఉండిపోయారు. అలా తిరుమలలోనే స్థిరంగా ఉండిపోయి తిరుమలనంబిగా స్థిరపడిపోయారు. అప్పట్లో కంచిలో మరొక నంబి ఉండడంవలన వీరిని తిరుమలనంబి అని పిలిచేవారట. తిరుమలలో పూలతోటలను పెంచి, పూలను మాలలుగా కట్టి స్వామిని అర్చిస్తూ ఉండేవారు. ప్రతిరోజు పదిమైళ్ళ దూరంలో ఉన్న పాపనాశనం నుంచి స్వయంగా నీటిని తెచ్చి స్వామికి అభిషేకాదులను నిర్వహిస్తూ ఉండేవారు.

## తాతాచార్యులుగా మారిన శ్రీశైలపూర్ణులు

సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరుని చేతనే తాతా అని పిలిపించుకున్న కారణంగా శ్రీశైలపూర్ణులు తాతాచార్యులుగా ప్రసిద్ధి చెందారు. దీనికి సంబంధించిన కథనాన్ని గురించి చెప్పుకోవాలంటే... ఆ వయసులో కూడా ప్రతిరోజు పదిమైళ్ళ దూరంలో ఉన్న పాపనాశనం దగ్గర నుంచి మట్టికుండలో



నీళ్ళు తీసుకువచ్చి స్వామికి అభిషేకాదులను నిర్వహించేవారు. అదేవిధంగా ఒకరోజు పాపనాశనం నుంచి నీటిని తీసుకువస్తూ ఉంటే ఒక బోయపిల్లవాడు శ్రీశైలపూర్ణుల వెన్నంటే వస్తూ తాతా నాకు చాలా దాహంగా ఉంది, కాసిన్ని నీళ్ళివ్వవా? అనడిగాడు.

అయ్యో పాపం పిల్లవాడు దాహంతో ఉన్నాడే అని జాలిపడినప్పటికీ, తాను తీసుకువెళుతున్న నీరు స్వామి అభిషేకం నిమిత్తం కాబట్టి నిరాకరించారు తిరుమలనంబి. ఇవి శ్రీవేంకటేశ్వరుని అభిషేకానికి తీసుకుపోతున్న నీరు, నీకు ఇవ్వడం కుదరదని చెప్పి తన దారిన తాను సాగిపోయాడు. అయితే ఆ బోయపిల్లవాడు అక్కడితో ఆగలేదు. తాతా... దాహంగా ఉంది. నీరివ్వవా అంటూ వెంటపడ్డాడు. అయినా శ్రీశైలపూర్ణులు తన దారిన తాను పోతూనే ఉన్నాడు గాని నీరివ్వలేదు. నీరివ్వమని వెంటపడిన బాలునితో, నీకు నీరు కావాలంటే ఎక్కడో దొరుకుతుంది చూడు. నేను నీకు నీరు ఇవ్వలేను. ఎందుకంటే నేనీ నీరు శ్రీవారి అభిషేకం నిమిత్తం తీసుకువెళుతున్నాను. దానిని నీకు ఇస్తే ఈ వయసులో నేను మళ్ళీ అంత దూరం వెళ్ళి నీరు తేలేను అంటూ ముందుకు సాగిపోయాడు. దాంతో వెనకే నడిచి వస్తున్న బోయపిల్లవాడు ఒక రాయితో శ్రీశైలపూర్ణుల నెత్తిమీద ఉన్న కుండకు గురిచూసి కొట్టాడు. దాంతో కుండకు చిల్లుపడి ధారగా నీరు కారసాగింది. అలా వెనకే నడుస్తూ ఆ నీటిని తాగుతున్నాడు బోయపిల్లవాడు. తన నెత్తిమీద కుండ బరువు తగ్గడం గమనించిన శ్రీశైలపూర్ణులవారు ఏమయిందా అని కుండను చూసి జరిగినది గ్రహించారు. దాంతో ఆగ్రహించి ఆ బోయపిల్లవాణ్ణి మందలించి, అయ్యో! శ్రీనివాసుని అభిషేకానికి తీసుకెళుతున్న నీటిని తాగేశావు. ఈ వయసులో మళ్ళీ అంతదూరం వెళ్ళి నీళ్ళు తేవడానికి తగిన శక్తిలేనివాడను, సమయం కూడా లేదని చింతించడం మొదలుపెట్టాడు.

తిరుమలనంబి విచారాన్ని చూసిన బోయబాలుడు తాతా! ఎందుకు బాధపడతావు? నువ్వు నీటికోసం మళ్ళీ అంతదూరం వెళ్ళనవసరంలేదు. ఇక్కడికి సమీపంలోనే ఆకాశగంగ ఉంది. ఆ ఆకాశగంగ నీటినే నీ స్వామి

అభిషేకానికి వాడుకో అంటూ చెయ్యిపట్టి, సమీపంలో ఉన్న కొండవాలుకు తీసుకెళ్ళి ఆ కొండను తన దగ్గరున్న బాణంతో కొట్టగా అక్కడినుండి నీటిధార వెలువడిందట. ఇకనుంచి అంతదూరం వెళ్ళనవసరం లేదని, ఈ నీటినే వాడుకోమని ఆకాశగంగను చూపించాడు బాలుడు. తిరుమలనంబి సంతోషంతో ఆకాశగంగ నీటిని తీసుకుని బాలుని కోసం చూడగా, బాలుడు ఎక్కడా కనిపించలేదట. సరేనని చెప్పి శ్రీనివాసుని సన్నిధికి వచ్చి అభిషేకానికి పూనుకోగా, తాను ఈరోజు కడుపునిండా నీటిని తాగానని, అందువలన తన కడుపు చల్లగా ఉందని, తనకు అభిషేకం వద్దని ఆచార్యుల ద్వారా చెప్పించాడట శ్రీనివాసుడు. దాంతో తనకు అంతకు ముందు కనిపించి నీటిని తాగి, ఆకాశగంగను చూపించిన బోయపిల్లవాడు మారువేషంలో వచ్చిన శ్రీనివాసుడేనని తెలుసుకున్నారు శ్రీశైలపూర్ణులవారు. సాక్షాత్తు శ్రీవారే తాతా అని పిలిచి గౌరవించడంతో అందరూ తాతాచార్యులవారని సంబోధించడం మొదలుపెట్టారు. అప్పటినుండి తాతాచార్యులుగా పేరుపొందారు తిరుమలనంబి.

వారి భక్తి ఫలితమే అలిపిరి దగ్గర వెలసిన శ్రీవారి పాదాలు. ఒక సందర్భంలో భగవద్రామానుజులు రామాయణ రహస్యాలను తెలుసుకోవడం కోసం ప్రతిరోజు తిరుమలనంబి గారి దగ్గరకు వెళుతుండేవారు. అప్పుడు తిరుమలనంబి కొండపైనుంచి అలిపిరి మార్గంలో ఉన్న మోకాలిమిట్ట దగ్గరకు వచ్చేవారు, రామానుజులవారు కూడా కొండ దిగువ నుంచి అక్కడికి చేరుకొని మేనమామ అయిన తిరుమలనంబి దగ్గర రామాయణ రహస్యాలను చెప్పించుకునేవారు. తిరుమలనంబి ప్రతిరోజూ ఉదయం స్వామివారి కైంకర్యాదులు ముగించుకొని కొండ క్రిందకు వచ్చి రామానుజులవారికి బోధన గావించి తిరిగి కొండమీదికి వెళ్ళేసరికి సాయంత్రమయ్యేది. అప్పుడు మళ్ళీ స్వామివారి కైంకర్యాలు చేసుకునేవారు. అయితే ప్రతిరోజూ తిరుమలనంబిని ఒక చింత పట్టి పీడిస్తూండేది. ఉదయం, సాయంత్రం స్వామిని సేవించుకోవడం జరుగుతోంది. కాని కొండ క్రిందికి వచ్చి మళ్ళీ కొండమీదికి వెళ్ళే సమయానికి సాయంత్రం అవడంతో మధ్యాహ్నం వేళ పూజలకు వీలు కావడం లేదు. అందుకే విచారపడుతూ ఉండేవారు. మనసంతా మధ్యాహ్నంవేళ స్వామిని సేవించుకోలేకపోతున్నానే అన్న చింత పీడిస్తూ ఉండేది. భక్తుడు చింతాక్రాంతుడై ఉంటే భగవంతుడు చూస్తూ ఊరుకుంటాడా? అందుకే తిరుమలనంబి చింతను తీర్చడానికి ఆ శ్రీనివాసుడే పూనుకొన్నాడు. నంబీ! నా సేవ చేసుకోలేకపోతున్నానని నీవు చింతపడవలసిన పనిలేదు. మధ్యాహ్నంవేళ నన్ను సేవించుకోవడానికి నీకు చక్కని అవకాశం ఇస్తున్నాను. నా పాదాలను అలిపిరి దగ్గర ఏర్పడేలా చేస్తున్నాను. వాటిని సేవించుకో అంటూ వరాన్ని అందించాడు శ్రీనివాసుడు. అలా అలిపిరి దగ్గర స్వామివారి పాదాలు ఏర్పడ్డాయి. అలా కొండ కిందనే శ్రీవారి పాదాలను సేవించుకొనే అవకాశం భక్తులకు కలిగేలా చేసిన ధన్యజీవి తిరుమలనంబి.




## ఆళ్వారులలో ప్రముఖునిగా



శ్రీవారి ఆలయ ప్రదక్షిణ మార్గంలో ఉత్తరాభిముఖంగా తిరుమలనంబి ఆలయం ఉంది. స్వామివారి ఊరేగింపుల సమయంలో తొలి హారతి తిరుమలనంబి ఆలయం నుంచే అందుకోవడం ఆచారంగా వస్తున్న విషయం. స్వామివారి పట్ల తిరుమలనంబి ప్రకటించిన భక్తివిశేషాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం తిరుమలలో తిరుమలనంబి అవతారోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

(ఇంకా ఉంది)

# ధనుర్మాసం - గోదాదేవి లక్ష్యసిద్ధి

- డా.కె.బి. రాజేంద్రప్రసాద్

శ్లో ॥ విద్యాత్వమేవ నను బుద్ధిమతాం నరాణామ్
శక్తిస్త్వమేవ కిలశక్తిమతాం సదైవ ।
త్వం కీర్తికాంతి కమలామల తుష్టిరూపా
ముక్తిప్రదా విరతిరేవ మనుష్యలోకే (దేవీ భాగవతం)

జగన్మాతా! పండితులయందలి విద్య, శక్తిమంతుల యందలి శక్తి, మానవులకు కీర్తి, కాంతి, తుష్టి, పుష్టి, ముక్తిప్రదాలైన కమలవు, విశ్రాంతి ప్రదాయినివి నీవే అని విష్ణుమూర్తి ప్రకృతి శక్తియైన భగవతిని కీర్తిస్తాడు. జ్ఞానం, సమృద్ధి, సంపద, ఐశ్వర్యం, యశస్సు, పరాక్రమం అనే ఈ ఆరింటికిని భగము అని సంకేతం. ఈ ఆరు విధములైన సంపద గల తల్లి భగవతి. ఈ భగవతితో కూడియున్న పురుషాకృతుడైన ఆత్మ భగవంతుడు. ఈ ఆత్మశక్తి ప్రకృతిశక్తి సంయుక్తం కావడం విశ్వసృష్టికి శ్రీకారం. పురాణ దంపతుల సాంగత్య, సాన్నిహిత్య, సంస్కారబలం, ఫలం సకల సృష్టికి మూలం.

ప్రకృతి శక్తియైన పరదేవత అవతారాలు, ఆంతర్యాలు, అర్థాలు, పరమార్థాలు ఎవరికీ గహన సాధ్యంకాదు. అయితే దుర్గ, మహాలక్ష్మి, సరస్వతి, సావిత్రి, రాధ అనే పేర్లతో మూల ప్రకృతి ప్రధానాంశాలుగా కావడం జరిగింది. ఈ రూపాలు కాకుండా అనేక కళాంశలు, కాలాంశలు ముల్లోకాలలో అనేక దివ్యమూర్తులుగా కనిపించడం కూడా మనం గమనించాలి. ఆ ప్రకృతిశక్తి ప్రధానాంశ సంభూతురాలే, సర్వం సహా దేవియైన భూదేవి, సకల సంపద్ధాత్రి, సర్వాధార, సురాసుర మానవ సంపూజ్యమానం.

ఈ భూమాతే సత్రాజిత్తునకు తనయ సత్యభామ యైనది. ఆ తల్లే గోదాదేవిగా శ్రీవిల్లిపుత్తూరులో తులసీవనంలో అయోనిజగా అవతరించింది. అలనాడు సీతమ్మ నాగటిచాలులో దొరికి అయోనిజగా సీతమ్మ పేరుతో ప్రసిద్ధమైంది. ఈనాడు అదే భూమాత అంశతో ఆవిర్భవించిన గోదమ్మ శ్రీరంగని అర్చకుడైన విష్ణుచిత్తునకు "బావికిం చెంగట, నుల్లసిల్ల తులసీ వనసీమ, శుభాంగి నొక్క బాలం గురువిందకందళ ప్రతిమాంఘ్రి కరోదరాధరన్" బావి ప్రక్కన, తులసీవనంలో, గురువింద బీజంవలె ఎరుపురంగు గల కరచరణాద్యవయవాలతో అమ్మ లభించిందట. అలా గోదామాత దొరకిన దినక్షేత్రాలను గుర్చి -



శ్లో ॥ కర్కటీ పూర్వ ఫల్గుణ్యాం తులసీ కాననోద్భవాం
పాండ్యేవిశ్వమ్భరాం గోదాం వందే శ్రీరంగనాయకీమ్ ॥

అనే శ్లోకాన్ని బట్టి పూర్వ ఫల్గుణీ నక్షత్రంలో, శ్రావణ శుద్ధ తదియ గోదామాత జన్మతిథిగా వైష్ణవ సమాజం భావిస్తోంది. "ఆండాళ్ తిరునక్షత్రం" పేరుతో అమ్మవారి జయంతిని కూడా భక్తులు జరుపుకుంటున్నారు. గో అంటే జ్ఞానం, దా అంటే ఇచ్చేది. జ్ఞానాన్ని అందించిన తల్లి గోదాదేవి. అయితే ఆమె లక్ష్మీమాత స్వరూపమే అని భావించే వారున్నారు. అందుకే ఆ తల్లికి ఆండాళ్ అని పేరు (లక్ష్మీమాత అని అర్థం). తాను ధరించిన పూలమాలను శ్రీరంగశాయికి అర్పించడం చేత రాయలవారు "ఆముక్తమాల్యద" అని అందంగా సంస్కృతీకరించారు. తమిళులు ఇదే అర్థంలో "చూడి కొడుత్త నాచ్చియార్" అని పిలుచుకున్నారు.

విష్ణుచిత్తుని దగ్గర పెరిగి పెద్దదియైన గోదాదేవి మధురభక్తి మార్గాన్ని అనుసరించింది. భగవంతుడు నాయకునిగా, భక్తుడు తనను నాయికగా భావించి భజించడం మధురభక్తి సంప్రదాయం. అయితే గోదామాత విష్ణుచిత్తునకే ఎందుకు దొరికింది? ఆయన దగ్గరే ఎందుకు పెరిగింది? విష్ణుచిత్తుడు శ్రీరంగశాయికి మామ కావడం వెనుక ఆంతర్యం మొదలైనవానికి సంబంధించిన ఒక ఐతిహ్యం కూడా వినిపిస్తోంది.

గత జన్మలో పూరీజగన్నాథస్వామి ప్రధాన పూజారియే ఈ

జన్మలో విష్ణుచిత్తుడట. అయితే జగన్నాథుని ప్రక్కన లక్ష్మీమాతలేని కారణంగా పరితపించి ప్రార్థించిన పూజారికి జగన్నాథస్వామి ప్రత్యక్షమై "భక్తాగ్రేసరా! చింతించకు. నీ కోరిక వచ్చే జన్మలో నెరవేరుతుంది. నీవు వచ్చే జన్మలో లక్ష్మీ అంశతో జన్మించిన బిడ్డకు తండ్రిగా, విష్ణుచిత్తుడనే పేరుతో నాకు సేవ చేస్తావు. అప్పుడు నీవే నా కాళ్ళు కడిగి కన్యాదానం చేసి, ధన్యత పొందుతావు" అన్నాడట. దాని ఫలితమే విష్ణుచిత్తునకు గోదామాత బిడ్డ కావడం జరిగిందట. ఒకనాడు హిమవంతునకు కల్గిన అదృష్టం వంటిదే ఇది.

తండ్రి చేసిన మాలను గోదమ్మ ముందుగా తాను అలంకరించి అద్దంలో చూచుకొని, తిరిగి తీసి పూలసజ్జలో పెట్టి స్వామికి పంపేదట. పూలమాలతో పాటు గోదమ్మ తన భక్తిని, రక్తిని, అనురక్తిని, వలపును, వలపు వలన కలిగే కులలుకులను, పలుకులను, మనసును, వయస్సును, మేధస్సును వాని మాధుర్యాలను పంపేది. జీవుల తలపుల మెదిలో తత్త్వ ప్రదీపుడైన స్వామి సర్వాన్ని గ్రహించాడు. ఆత్మలు పరమాత్మ సొంతం కదా! మొత్తానికి విష్ణుచిత్తునకు తెలియడం వివాహానికి దారి తీయడం జరిగింది.

అయితే మధ్యలో ఒక వ్రతకథ, వలపుల వ్యథ, మనసులు మాట్లాడుకొనే కథ నడిచింది. అదే "తిరుప్పావై". శ్రీవ్రతం అని తెలుగులో అంటాం. ఈ శ్రీ వ్రతానికి ధనుర్మాసం వేదికయైంది. "తిరుప్పావై"కి ముందు ధనుర్మాసాన్ని కూడా కొంత చెప్పవలసి ఉంది.

ధనుస్సు అనేది ఉపనిషద్భాషలో ధర్మం అని అర్థం. సూర్యభగవానుడు ధనుస్సు రాశిలో ప్రవేశించడం వలన ధనుర్మాసం. మరి సూర్యుడు ప్రతినెల ఒక రాశిలో ప్రవేశించడం సర్వసాధారణమే కదా! అంటే నిజమే. కాని ఇక్కడ ఒక కథ ఉంది.

చతుర్ముఖ బ్రహ్మ తన ఇల్లాలు సరస్వతీమాతతో హంసవాహనంలో విహరిస్తున్నాడట. ఈ సంగతి తెల్సియు సూర్యభగవానుడు తన ప్రతాపాన్ని ప్రదర్శించాడట. ఆ ఆతప తాపానికి హంస సన్నగిల్లడం, సరస్వతీమాతకు అలసట గల్గడం, బ్రహ్మకి కోపం కల్గడం, దానితో "భాస్కరా! నీ ప్రతాపం మాపై కూడానా? ఇకపై నీవు క్షీణించుగాక" అని శాపాన్నివ్వడం జరిగింది. సూర్యుడు "క్షమించు"మని వేడుకొన్నా ఫలితం లేదు. సూర్యుని కాంతి క్షీణించింది. యజ్ఞయాగాది క్రతువులు ఆగిపోయినాయి. అప్పుడు సర్వ దేవగణాలు మరలా బ్రహ్మను ప్రార్థించాయి. బ్రహ్మ ప్రసన్నుడై "ధనుర్మాసంలో మధుసూదనుని పూజించినచో తిరిగి సూర్యుడు తేజోవంతుడవుతాడ"ని శాపానికి విరుగుడు సూచించాడు. సూర్యుడు మొదలు సకల దేవతలు విష్ణుదేవుని ధనుర్మాసంలో పూర్తిగా ఉపాసించడం, భజించడం జరిగింది. ధనుర్మాసం మార్గశిరమాసంలో ఆరంభమవుతుంది. "మాసానాం మార్గశీర్షో –హమ్" అని గీత సెలవిస్తోంది కనుక విష్ణువుకు ప్రీతికరం. చివరకు విష్ణువు సంతుష్టుడు కావడంతో సూర్యభగవానుడు యధాపూర్వం శక్తివంతం కావడం జరిగింది. లౌకిక కార్యక్రమాలు యథాపూర్వం నడిచాయి.

కనుక ధనుర్మాసంలో సూర్యభగవానుడు కొంత ప్రసన్నంగానే ఉంటాడు. శూన్యమాసం కనుక పూజలు, వ్రతాలతోనే ప్రొద్దులు పుచ్చాలి. పెండ్లిండ్లు, గృహప్రవేశాల వంటివి ఉండవు.

అయితే కాత్యాయనీ వ్రతానికి సానుకూలం. కోరినవాడు భర్తగా కావాలని కన్యలు ఆచరించేది కాత్యాయనీవ్రతం. అనుకూల దాంపత్యం కొరకు కాత్యాయనీవ్రతం. వివాహ ప్రతిబంధకాలు తొలగడానికి కాత్యాయనీవ్రతం. కుజగ్రహదోష నివారణకు కాత్యాయనీవ్రతం. పరమేశ్వరుడు లోకకళ్యాణం కొరకు ఈ కాత్యాయనీవ్రతాన్ని భక్తులకు అనుగ్రహించాడు.

ఈ కాత్యాయనీవ్రత స్ఫూర్తితోనే గోదామాత శ్రీరంగడే తనకు భర్త కావాలని "తిరుప్పావై" వ్రతం ఆచరించింది. అయితే చెలులతో కలిసి ఆచరించింది. సంయుక్తంగా ఆచరించడం ఈ వ్రతం విశేషం. అమ్మకు వేద వేదాంత పరిజ్ఞానం పరిపుష్టంగా ఉంది. వేదం స్వయంప్రకాశమైన జ్ఞానం. ఆ జ్ఞానం గోదమ్మకు సద్యః స్ఫూర్తితో అందడం, ఆ తల్లి భూమాత అంశ లేదా లక్ష్మి అంశ కనుకనే చేకూరింది. అమ్మకు సంకీర్తనా రచన, సంకీర్తనా సామర్థ్యం అలవడింది. అందుకే తాను రోజుకు ఒక పాశురం (కీర్తన) తో శ్రీరంగశాయిని కీర్తించి పూజించింది.

బ్రాహ్మీ ముహూర్తంలో లేవడం, శుచిస్నాతులు కావడం, దేవాలయానికి తులసి, పూలమాలలతో రావడం, స్వామికి సమర్పించడం, గానం చేయడం, సేవించడం, నైవేద్య సమర్పణం. పగలల్లా ఉపవాసం, రాత్రి భోజనం. సత్సాంగత్యం, ధార్మిక చర్చలు, పూజలు, విష్ణునామస్మరణ, పురాణ ప్రవచనాలతోనే ప్రొద్దును కరిగించాలి. గోదామాత 30 పాశురాలు పాడింది. గోపికలను నిద్రలేపడం, నీళాదేవి అనుగ్రహం పొందడం, వ్రతనియమాలు చెప్పడం, స్వామి అవతార గాథలను మననం చేయడం, "జన్మ జన్మల బాంధవ్యం ఉండాలి" అని గోదామాత స్వామిని కోరింది. 29, 30 పాశురాలలో తిరుప్పావై ఫలశ్రుతిని చెప్పడం విశేషం.

మొత్తం మీద గోదామాత వలచి, వలపించి, పాశురములను పాడి, మెప్పించి, ఒప్పించి, శ్రీరంగశాయిని భోగరంగడిగా చేసి, చేపట్టి స్వామిలో లీనమైంది. మధురభక్తి

అంత్యంలో ఆత్మార్పణతో ముగిసింది. "మార్గళిత్తంగళ్" మార్గశిర మాసం వచ్చింది అని పాశురమును మొదలుపెట్టి స్వామిలో లీనమై పన్నిద్దరాళ్వారులలో ఏకైక మహిళా ఆళ్వారుగా ప్రసిద్ధిని పొందింది గోదామాత. ధన్యురాలైంది. మనకు భక్తిభావనా మార్గాలను అందించింది.

**"సిరినోము హరిపూజ గిరిపుత్రివరము**
**గోకులం కన్నెలకు కళ్యాణకరము**
**లోకులందరికిదే సౌభాగ్యప్రదము**

పల్లె పిల్లా మేలుకో వ్రేపల్లె పిల్లా మేలుకో" అని పాడుకోవడం గమనిస్తాం. తాళ్ళపాక అన్నమయ్య గోదామాతను వేంకట విభుడు తమితో చేపట్టినట్లు ఈ క్రింది గీతంలో చెప్పారు.

**"చూడరమ్మ సతులాల శోభాన పాడరమ్మ**
**కూడున్నది పతి చూడికుడుతనాంచారి**
**శ్రీమహాలక్ష్మియట చక్కదనాలకేమరుదు**
**సోమునితోబుట్టువట సొంపుకళలకే మరుదు**
**కోమలాంటి యీ చూడి కుడుత నాంచారి**

-------------------------

**తమితో శ్రీ వేంకటేశు దానె వచ్చి పెండ్లాడె**
**కొమెర వయసు చూడికుడుత నాంచారి"**

శ్రీ వేంకటేశుడు కావాలనే శ్రీవిల్లిపుత్తూరు వెళ్ళి, అందాల వయసున్న గోదమ్మను వివాహమాడినాడట. గోదమ్మ మహాలక్ష్మి. మన్మథుని మాత, చంద్రుని తోబుట్టువు, కోమలాంగి కనుక అందచందాలకు ఆ తల్లికేమి లోటు అంటాడు. అచ్చమైన, స్వచ్ఛమైన తెలుగుభాష, తెలుగుయాస, తెలుగుశ్వాస, తెలుగువాడు అన్నమయ్య ఆశలపల్లకి ఇది. ఎంత అందం? తిరుమలలో బ్రహ్మోత్సవాలలో గరుడసేవ రోజున, ఇప్పటికీనీ శ్రీవిల్లిపుత్తూరు గోదామాత ఆలయం నుండి తులసీమాలలు రావడం విశేషం. అలాగే ధనుర్మాసం మొత్తం ఆర్జితసేవ అయిన సుప్రభాతసేవను రద్దుచేసి, ఆండాళ్ తిరుప్పావై పాశురాలను పఠించడం సంప్రదాయం. అయితే ఇది ఆర్జితసేవ కాదు. ఏకాంతంగా వేంకట విభునకు నిర్వహించే సేవ.

వైష్ణవాలయాలలో ధనుర్మాసం గోదామాత తిరుప్పావై సర్వసాధారణం. అలాగే ప్రసాదాల గుబాళింపు కూడా పరిమళిస్తుంది. మకర సంక్రాంతి ముందురోజు భోగినాడు గోదా రంగనాథుల కళ్యాణం జరుగుతుంది. ధనుర్మాసంలో పులగం, పొంగలి, చక్కెరపొంగలి, దధ్యోదనం స్వామివారికి నైవేద్యాలు. అయితే వైష్ణవ సంప్రదాయం ప్రకారం 15 రోజులు పొంగలి, 15 రోజులు దధ్యోదనం విధిగా నైవేద్యం సమర్పించాలని చెప్తారు. అలాగే తులసీమాలల సమర్పణకూడా విధిగా ఉండాలి.


నవవిధ భక్తిమార్గాలలో మొదటి మూడు శ్రవణం, కీర్తనం, స్మరణం తప్పక అనుసరిస్తారు. కర్మల వలన జన్మని పొందుతున్నాం. భక్తి కర్మానుష్ఠానంతోనే కర్మ ముక్తిని పొందుతుంది. ధనుర్మాసంలో విష్ణుమూర్తిని మధుసూదనునిగ కీర్తించడం, పూజించడం ప్రార్థించడం శాస్త్ర సమ్మతం.

**శ్లో ॥ మధుసూదన దేవేశ**
**ధనుర్మాస ఫలప్రద**
**తవమూర్తి ప్రదానేన**
**మమ సంతు మనోరథాః ॥**

అని ప్రార్థించి, బ్రాహ్మణులకు, పండితులకు దానం ఇస్తారు. "మధుసూదనదేవా! నీ మూర్తి ప్రదానంతో ధనుర్మాస ఫలాన్ని నాకందించు. నా మనోరథాలను ఈడేర్చు"మని కోరుతారు. దాన ప్రతిగృహీతలైనవారు "ఇందిరా ప్రతిగృహ్ణాతు" అంటూ దానం పుచ్చుకొని వారిని ఆశీర్వదిస్తారు. నేను అన్న భావమే అహం. అహం త్యజిస్తే సత్యం బోధపడుతుంది. పరమాత్మ ఆత్మతత్త్వ ప్రదీపుడై అనుభవంలోనికి వస్తాడు. గోదామాత అందించిన జ్ఞానకాంతులివే. మధుర భక్తి రసస్ఫూర్తితో తన ఆత్మను పరమాత్మకు నివేదించింది. స్వామి సాయుజ్యాన్ని అందుకుంది. అందుకే గోదారంగనాథుల కళ్యాణం జరిపి, ఆ అక్షితలను ఔదల (తలపై) దాల్చడం ఆనవాయితీ అయింది. "కలౌ నామ సంకీర్తనమ్". కలియుగంలో పరమాత్మ నామసంకీర్తనతో భవబంధ విముక్తులం కావచ్చు. మానవజన్మ సర్వోత్కృష్టమైంది. ఈ జన్మకు ఒక అర్థం ఉంది. పరమార్థం ఉంది. దీన్ని అర్థరహితం చేయరాదు. కనుక భక్తి కర్మానుష్ఠానంతో పరమార్థాన్ని సాధిద్దాం. పరమాత్మ ఎవరు? అనే ప్రశ్నే వద్దు. ప్రకృతి శక్తే పరమాత్మ. పదాలు వేఱు. పరమాత్మ ఒక్కడే రాముడు కావచ్చు. కృష్ణుడు కావచ్చు. ప్రకృతి శక్తి పరమేశ్వరీ కావచ్చు. "దర్శనంబ వేఱు దైవంబది యొక్కటే" అని వేమనసూక్తి. దృష్టిని బట్టి దృశ్యం. ఆ దృశ్యాన్ని లక్ష్యం చేసుకొని శ్రవణ కీర్తన స్మరణాదులతో భజించుదాం. ధనుర్మాస స్ఫూర్తికి, దీప్తికి సంతరించుకుందాం.

**"శ్రీలక్ష్మి నీ మహిమలూ గౌరమ్మ చిత్రమై దోచునమ్మా**
**భారతీ సతివయ్యు బ్రహ్మకిల్లాలివై**
**పార్వతీ దేవివై పరమేశురాణివై**
**బరగు శ్రీలక్ష్మివయ్యూ గౌరమ్మ భార్యవయితివి హరికినీ..."**

అన్న జానపదులు ఎంతటి విజ్ఞులు! మూడు శక్తులు, మూడు గుణాలు, మూడు మూర్తులు ఒకే ఒక్క ప్రకృతిశక్తి ఆవిర్భూతులు. ఈ భావం ఎంతటి మాధుర్యం! ఎంతటి ఆలోచనామృతం! ఈ అమృతపానంలోనే ముందుకు సాగుదాం.



# భగవద్గీత

- శ్రీమాన్ రాళ్లబండి శ్రీనివాసన్

ధారావాహిక

## 11వ అధ్యాయం - విశ్వరూప సందర్శనయోగం

**గత సంచిక తరువాయి**

**తొం**డమాన్ చక్రవర్తి వేంకటేశ్వరస్వామి భక్తుడు. శత్రు సంహారానికి తన చక్రం ఇచ్చాడు ఆ రాజుకి. ప్రతినిత్యం వెయ్యి బంగారు పుష్పాలతో ఆ స్వామిని పూజిస్తున్న భక్తాగ్రేసరుడనని అహంకరించాడు తొండమానుడు. ఆ చక్రవర్తి అహంకారం అణచాలనుకున్నాడు స్వామి. తిరుమల కొండ కింది భాగంలో అలిపిరి వద్ద ఓ కుమ్మరి ఉన్నాడు. పేరు కురువరచినంబి. కుండలు చేసి అమ్ముకొని జీవనయాత్ర సాగించేవాడు. ఓరోజు మిగిలిన మట్టితో వెంకన్న రూపం తయారు చేశాడు. మట్టితో పూలను చేసి ఆ స్వామి పాదాలపై ఉంచాడు. అలా ప్రతిరోజూ చేయసాగాడు. ఆతని భక్తికి మెచ్చి ప్రత్యక్షమయ్యాడు వేంకటరమణుడు. పరమానందభరితుడయ్యాడు నంబి. తనని గూర్చి ఎవరికీ చెప్పవద్దని ప్రమాణం చేయించుకున్నాడు. స్వామితో ఈ పేదవాడిని అనుగ్రహించినందుకు నేను నీ దాసుడను స్వామీ అన్నాడు. అప్పటినుంచి కురువరచినంబి కుమ్మరిదాసుడని పిలువబడ్డాడు.

ఆరోజు ఆలయం తలుపులు తెరిచారు అర్చకులు. సువర్ణ పుష్పాలు తొలగించబడ్డాయి. స్వామి పాదాల చెంత మట్టిపూలున్నాయి. అహంకారివైన నీకన్నా కుమ్మరిదాసుడు నాకు ప్రియమైనవాడని పలికాడు స్వామి. చక్రవర్తిలో అహంకారపు పొరలు చెదిరిపోయాయి. పరుగువంటి నడకతో కొండ దిగాడు. కురువరచినంబి చేసే ఆరాధన చూశాడు. సాష్టాంగ నమస్కారం చేశాడు చక్రవర్తి. ప్రముఖ వాగ్గేయకారుడు అన్నమాచార్యులు కుమ్మరిదాసుని కీర్తించాడు. ఒట్టు పెట్టుకొని చక్రవర్తికి తన విషయం చెప్పినందుకు విచారపడ్డాడు కురువరచినంబి.

**ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ**
**కర్ణం తథాన్యానపి యోధవీరాన్ ।**
**మయా హతాంస్త్వం జహి మా వ్యథిష్ఠా**
**యుధ్యస్వ జేతాసి రణే సపత్నాన్ ॥** 34

భీష్మ ద్రోణ కర్ణ సైంధవులు (జయద్రథుడు) తదితర యుద్ధవీరులను ఇదివరకే నేను చంపాను. చచ్చినవాళ్ళని నీవు చంపెయ్. భయపడకు. యుద్ధం చెయ్. సమరంలో శత్రువులను తప్పక జయించగలవు.

మావ్యథిష్ఠా - భయపడకు అంటున్నాడు అర్జునునితో. అతని భయానికి అనేక కారణాలున్నాయి. 1. విశ్వరూపంలోని ఉగ్రతేజం చూసి భయపడ్డాడు. 2. గురువులు, బంధుమిత్రులను చంపలేనని (1-35) అన్నాడు. చంపితే పాపం చుట్టుకుంటుందని భయం. 3. భీష్మ ద్రోణులు తనకంటే గొప్పవారు. వారిని ఎలా జయించాలో తెలీక భయం. సకల అస్త్ర శస్త్రాలు నేర్పిన ఆచార్యుడు ద్రోణుడు. ఆయన చేతిలో ఆయుధం ఉన్నంతవరకు ఎవ్వరూ చంపలేరు. ఇక భీష్ముడు కురువృద్ధుడు. స్వచ్ఛంద మరణం తండ్రి వల్ల పొందినవాడు. ఇలా ఎన్నో భయాలున్నాయి.

జయద్రథుడు సింధుదేశపు రాజు. కనుక సైంధవుడని పేరు. కౌరవుల ఏకైక సోదరి దుస్సల భర్త. అరణ్యవాసంలో

ఒంటరిగా ఉన్న ద్రౌపదిని అపహరించాడు. విషయం తెలిసి భీమార్జునులు వెంటబడి పట్టుకున్నారు. ధర్మరాజు మాట కాదనలేక చంపకుండా వదిలేశారు. అయితే తలగొరిగి పంపించాడు అర్జునుడు. అతని మీద పగతో శివుని గూర్చి తపస్సు చేశాడు. నేనే అర్జునుని జయించలేకపోయాను. అయితే అర్జునుడు లేని పాండవసేనని ఒక్కరోజు నిలువరించగల వరం ఇస్తున్నా తీసుకో అన్నాడు పరమశివుడు. యుద్ధరంగంలో పరాకుగా ఉన్నప్పుడు నా కొడుకు తలని ఎవరు నరికి పడేస్తాడో వాడి తల నూరు ముక్కలై చస్తాడని వృద్ధ క్షత్రుడు (సైంధవుని తండ్రి) ఒక వరమిచ్చాడు. సైంధవుని ఎలా చంపాలో తెలియదు. అదొక భయం.

తనకి సరిజోడు కర్ణుడని అర్జునుడు తలచాడు. కవచకుండలాలు ఇంద్రునికిచ్చి శక్తి ఆయుధం తీసుకున్నాడు కర్ణుడు. ఆ శక్తిని ఎపుడు ప్రయోగిస్తాడో ఊహించలేకపోతున్నాడు అర్జునుడు. భీష్మ ద్రోణ కర్ణ సైంధవులు ఈ నలుగురి పేర్లు చెప్పాడు. మిగిలిన మహావీరులను "అన్యాన్" అనే విశేషణంతో సరిపెట్టాడు వ్యాసమహర్షి. అశ్వత్థామ, శల్యుడు, భగదత్తుడు, భూరిశ్రవుడు, శ్రుతాయుధుడు వగైరాలు.

నరకాసురుని కొడుకు భగదత్తుడు. తండ్రి నుంచి వైష్ణవాస్త్రం పొందాడు. సుప్రతీకం అనే భయంకరమైన ఏనుగు వాడి వాహనం. యుద్ధంలో వైష్ణవాస్త్రం ప్రయోగించాడు అర్జునుని మీద. ఆ అస్త్ర మహిమ తెలియదు అర్జునునికి. పార్థుడే కాదు మహావీరులెవ్వరూ ఎదుర్కొనలేరు ఆ అస్త్రాన్ని.



సారథియైన కృష్ణుడు హఠాత్తుగా లేచి అర్జునునికి అడ్డుగా నిలిచాడు. ఆ అస్త్రం కృష్ణుని హృదయాన్ని తాకి వైజయంతీమాలగా మారిపోయింది.

భూరిశ్రవుడు శివుని వరప్రసాదితుడు. మహాపరాక్రమశాలి. సాత్యకిని కింద పడేసి కత్తితో చంపే సమయంలో అర్జునుడు భూరిశ్రవుని చేతిని నరికివేశాడు. వరుణదేవుడు శ్రుతాయుధునికి ఓ గదనిచ్చాడు. ఆ గద చేతిలో ఉన్నంతవరకు అతడు అజేయుడు. తనతో యుద్ధం చేయనివానిపై ప్రయోగిస్తే ఆ గద ప్రయోగించినవానినే చంపేస్తుంది. వరుణదేవుడు ఆ విషం చెప్పాడు. అయితే యుద్ధంలో ఆ మాట మరచిపోయాడు. తన రథాశ్వాలను కూల్చిన అర్జునిమీద వేయకుండా కృష్ణునిపై గదని ప్రయోగించాడు. అది తిరిగి వచ్చి వానినే సంహరించింది.

తను శివుని వరంవల్ల జన్మించాననే దురహంకారి అశ్వత్థామ. అంతేకాదు మహాక్రూరుడు. బ్రహ్మశిరోనామకాస్త్రం తండ్రి నుంచి పొందాడు. అది ప్రయోగిస్తే లోకాలన్నీ భస్మమైపోతాయనే భయం ఉంది అర్జునునికి.

శల్యుడు నకుల సహదేవులకు మేనమామ. అంటే పాండురాజు రెండోభార్య మాద్రికి సోదరుడు. మద్రదేశాధిపతి. మహా పరాక్రమశాలి. యుద్దంలో చివరికి ధర్మరాజు చేతిలో చచ్చాడు.

భగవానుడు భరోసా ఇస్తున్నాడు అర్జునునికి. శత్రుసేనలోని మహావీరులు నాతో చచ్చారు. చచ్చినవాళ్ళని చంపటమే నీ పని. భయపడాల్సిన పనిలేదు. యుద్ధం చేయాలని ప్రోత్సహించాడు.

మావ్యథిష్ఠా భయపడవద్దు అనే మాట మనకూ వర్తిస్తుంది. జీవితంలో ఎన్నో కష్టనష్టాలు, ఆటుపోట్లు సంభవిస్తాయి. భయపడకూడదు. ఎదురీతతో ఎదుర్కోవాలి. అదే యుద్ధస్వ యుద్ధం చేయాలి మనం కూడా. అంత శక్తి లేదనుకో, శరణాగతి చెయ్. కర్తవ్య కర్మలన్నింటిని భగవదాజ్ఞగా ఆచరించు, చాలు. పరమాత్మ మన వెనక ఉండి నడిపిస్తాడు మనల్ని. కృష్ణ పరమాత్మ ధైర్యవచనాలు విన్న అర్జునుని స్పందన ఎలా వుందో చెబుతున్నాడు సంజయుడు ధృతరాష్ట్రునితో.

**సంజయ ఉవాచ**

**ఏతచ్ఛ్రుత్వా వచనం కేశవస్య కృతాంజలిర్వేపమానః కిరీటీ ।**
**నమస్కృత్వా భూయ ఏవాహ కృష్ణం సగద్గదం భీతభీతః ప్రణమ్య॥ 35**

ఇలా కృష్ణుని మాటలు విన్నాడు అర్జునుడు. వణికిపోతూ చేతులు జోడించి నమస్కరించాడు కృష్ణునికి. భయం భయంగా మళ్ళీ నమస్కరించాడు. గద్గద కంఠంతో పలికాడు.

క అంటే బ్రహ్మ. ఈశ అంటే రుద్రుడు, శివుడు. ఆ ఇద్దరినీ తనలో ఇముడ్చుకున్నవాడు కేశవుడు. ఇది ఒక అర్థం. కేశి అని ఒక రాక్షసుని సంహరించి కేశవుడయ్యాడు. ఇది మరొక అర్థం. అందమైన కేశాలు కలవాడు కేశవుడు. ఇది ఇంకో అర్థం.

ఇంద్రుని తపస్సుకి మెచ్చాడు బ్రహ్మ. ఒక దివ్యకిరీటం ఇచ్చాడు. నివాత కవచుల యుద్ధంలో అర్జునుని సాయంతో విజయం సాధించాడు ఇంద్రుడు. ఆ సందర్భంలో బ్రహ్మదేవుడు తనకిచ్చిన కిరీటం అర్జునునికిచ్చాడు. ఆనాటినుంచి కిరీటి అని పేరు వచ్చింది అర్జునునికి. కర్ణునితో జరిగిన ద్వంద్వ యుద్ధంలో నాగాస్త్రం ప్రయోగించాడు అర్జునునిపైకి. అది సరిగ్గా అర్జునుని కంఠానికి గురిపెట్టి వుంది. సారథిగా ఉన్న కృష్ణుడు తన రథాన్ని కాలితో తొక్కాడు. ఆ దెబ్బకి రథం అయిదు అంగుళాలు భూమిలోకి కృంగిపోయింది. అర్జునుని తలకు బదులు దివ్యకిరీటం నేల రాలింది.

మళ్ళీ మనం శ్లోకం వివరణలోకి వచ్చాం. విశ్వరూపాన్ని ఉపసంహరించాలని కోరుతున్నాడు అర్జునుడు. భయభ్రాంతుడయ్యాడు. మాటిమాటికి నమస్కారాలు చేస్తున్నాడు. వణికిపోతున్నాడు. గొంతు బొంగురు పోయింది. మాట రాలేదు. అయినా తెప్పరిల్లుకున్నాడు. మళ్ళీ స్తుతిస్తున్నాడు కృష్ణ భగవానుని. వరుసగా పదకొండు శ్లోకాల దాకా ఈ స్తుతి సాగుతుంది.

**అర్జున ఉవాచ**

**స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా జగత్ప్రహృష్యత్యనురజ్యతే చ ।**
**రక్షాంసి భీతాని దిశో ద్రవంతి**
**సర్వే నమస్యంతి చ సిద్ధసంఘాః ॥ 36**

కృష్ణా నీ నామ సంకీర్తనంతో దేవ గంధర్వాది సమస్త దేవజాతి ఆనంద అనురాగాలతో సంప్రీతిని పొందుతోంది. నిన్ను చూసి భయపడుతూ రాక్షసులు నలు దిక్కులకు పారిపోతున్నారు. సిద్ధ సమూహాలు నమస్కరిస్తున్నాయి నీకు. ఇవన్నీ నీ మహిమకు తగినట్లున్నాయి.

ఈ శ్లోకంలో బీజాక్షరాలున్నాయి. నిత్యం జపించటం వల్ల భూతప్రేత పిశాచాదులను నాశనం చేసి మనల్ని సర్వదా రక్షిస్తుంది. విష్ణుపంజరాదిలో ముఖ్యమంత్రం ఇది. రక్షోఘ్న మంత్రం అని పేర్కొన్నారు మధుసూదన సరస్వతి స్వామి. అష్టాక్షరీ మంత్రంతో కాని, సుదర్శన మంత్రంతో కాని సంపుటం చేసి జపిస్తే శీఘ్రఫలం లభిస్తుందన్నారు పెద్దలు.

హృషీకేశుడనే పదం వచ్చింది ఇదివరకు. అయినా భగవన్నామం ఎన్నిసార్లు చెప్పుకున్నా పునరుక్తి కాదు కదా. హృషీకాలు అంటే ఇంద్రియాలు. వాటికి ఈశుడు అంటే నియామకుడు. సకల చరాచర ప్రాణికోటి ఇంద్రియాలకు నియామకుడు, శాసించువాడు. బ్యాక్టీరియా నుంచి బ్రహ్మదేవుని వరకు సర్వభూతకోటిని నియంత్రించేవాడు. హృషీ అంటే సంతోషం. క అంటే సుఖం. ఈశ అంటే నియామకుడు అని మరొక అర్థం ఉంది.

అలికిడి కలిగితే తాబేలు తన అవయవాలను లోనికి తీసుకున్నట్లు విషయ వాసనలనుంచి తన ఇంద్రియాలను నియంత్రించుకోవాలని స్థితప్రజ్ఞుని పరంగా రెండో అధ్యాయంలో చెప్పాడు భగవానుడు. అది మొదలు సందర్భానుసారంగా అనేకచోట్ల ఇంద్రియ నిగ్రహం కల్గి ఉండాలని చెబుతూ వచ్చాడు. అలా నియంత్రించుకునే శక్తి యోగికి కాని సాధకునికి గాని వున్నపుడు ఇక హృషీకేశునితో పనేమిటి అని ప్రశ్న. అది కేవలం అంతర్యామిగా ఉన్న పరమాత్మ అనుగ్రహం వల్ల లభిస్తుందని జవాబు. ఆ స్వామి కాదంటే జీవుని గతి అథోగతి కింద లెక్క. మానవుని ఇంద్రియాలు అనే గుర్రాలకి సారథి భగవానుడే ఇంద్రియాణి హయనాహుః అంటుంది కఠోపనిషత్తు.

దశావతారాల్లో ప్రధానమైనవి రామకృష్ణులవే. రాముడు చెప్పలేదు, చేసి చూపాడు. లోకానికి ఏదో ఒక ఉపదేశం ఇవ్వాలని వచ్చాడు కృష్ణుడు. చెప్పాలి, చెప్పినదాన్ని ఆచరించి చూపాలి అని నిశ్చయించుకున్నాడు. చతుర్భుజుడై పుట్టాడు. ఎవరు నువ్వు అని అడిగితే చెప్పాలనుకున్నాడు. దేవకీ



వసుదేవులు అడగలేదు, చెప్పలేదు. ఆ రూపం ఉపసంహరించు అన్నారు అంతే. అయిదోరోజు పూతనని చంపాడు. పసిబిడ్డ ఎలా చంపగల్గింది? ఎవరు నువ్వు? ఎలా చంపావ్? అని అడిగితే చెప్పాలనుకున్నాడు. ఎవ్వరూ అడగలేదు. దిష్టి తీసింది యశోదమ్మ. శకటాసురుడు మొదలు కాళియమర్దనం వరకు ఎన్నో అద్భుతాలు చేశాడు. ఎవ్వరైనా అడిగితే తనెందుకు వచ్చాడో చెప్పాలనుకున్నాడు. ఎవ్వరూ అడగలేదు. ఇక ద్వాపరయుగాంతం. కురుపాండవుల యుద్ధం. అందరూ కొట్టుకుని చస్తారు. తన అవతార ప్రయోజనం సిద్ధించాలి అని సంకల్పించాడు. ఉభయ సేనల మధ్య రథం నిలుపు, ఎవరెవరిని ఎలా చంపాలో ఓసారి పరిశీలించాలన్నాడు అర్జునుడు. అదే సమయం

అనుకున్నాడు. అర్జునునిలో శోక మోహాలు గుప్పించాడు. యుద్ధం చేయనని గాండీవం పడేసేటట్లు చేశాడు. శరణాగతుడయ్యాడు. తనకి హితం ఉపదేశించమన్నాడు అర్జునుడు. అలా అర్జునునిలో అడిగేటట్లు చేశాడు. అతనిని తప్ప తక్కిన సేనా సమూహాలన్నింటి ఇంద్రియాలను స్తంభింపచేశాడు. లోకానికి ఉపదేశించాలనుకున్నది అర్జునుని నెపంతో చేయ నిశ్చయానికి వచ్చేశాడు కృష్ణుడు. అదుగో అపుడు పుట్టింది గీత. ఆ పరమ రహస్యాన్ని గమనించిన వ్యాసభగవానుడు హృషీకేశః ప్రహసన్నివ (2-10) అన్న పద ప్రయోగం చేశాడు.

ప్రకీర్త్యా - భగవన్నామాన్ని గట్టిగా కీర్తిస్తున్నారట. లోక ప్రసిద్ధి చెందేవిధంగా భట్టబాణుడు గద్యకావ్యం రచించాడు. దాని పేరు కాదంబరి. అందులో మహారాణి ప్రసవించిన సూతికాగృహ వర్ణన ఉంది. నిరంతరం విష్ణుసహస్రనామ స్తోత్ర ఘోష అక్కడ వినబడుతున్నట్లు పేర్కొన్నాడు ఆ మహాకవి. పురుషసూక్తం విష్ణు సహస్రనామ స్తోత్రం స్తుతించి అనేక వ్యాధులను పోగొట్టుకోవచ్చునంటుంది చరకసంహిత.

భగవానుని విశ్వరూపం దర్శిస్తూ ఎప్పుడైతే దేవతాది గణాలు స్తుతించడం మొదలుపెట్టాయో రాక్షసులు పరుగులు తీశారట భయంలో (రక్షాంసి భీతాని). కామ క్రోధాది అరిషడ్వర్గమైతేనేం అహంకార మమకారాలైతేనేం అసురగుణాలైతేనేం అన్నీ పటాపంచలైపోతాయి భగవన్నామ సంకీర్తనంతో.

**కస్మాచ్చ తే న నమేరన్ మహాత్మన్ గరీయసే బ్రహ్మణోప్యాదికర్త్రే।**
**అనంత దేవేశ జగన్నివాస త్వమక్షరం**
**సదసత్ తత్పరం యత్॥ 37**

మహాత్మా కృష్ణా! బ్రహ్మదేవుని కన్నా గొప్పవాడివి. ఆదికారణుడవు. నీకు దేవతలు ఎందుకు నమస్కరించకుండా ఉంటారు అంటే నమస్కరిస్తారని తాత్పర్యం. అనంతా దేవేశా జగన్నివాసా సత్ అసత్ రెండింటికీ అతీతమైన అక్షరం నీవు. పరబ్రహ్మ స్వరూపుడవు నీవు.

సత్ అంటే ఏనాటికీ నాశనం కానిది. శాశ్వతమైంది. అసత్ అంటే నాశనమయ్యేది, అశాశ్వతమైంది. కార్యావస్థలో ఉండటం సత్ అని, కారణావస్థలో ఉండటం అసత్ అని మరొక అర్థం. సత్ అంటే వ్యక్తమని, అసత్తంటే అవ్యక్తమని స్థూల సూక్ష్మ రూపాల్లో పరమాత్మ ఉంటాడని ఇంకో అన్వయం.

ఈ శ్లోకంలో ఎనిమిది రకాలుగా భగవంతుని కీర్తించాడు. 1. మహాత్ముడు 2. అనంతుడు 3. దేవదేవుడు 4. జగన్నివాసుడు 5. ఆదికారణుడు 6. సత్తు 7. అసత్తు 8. అక్షరుడు. ఇన్ని విధాల కీర్తింపబడేవాడు సర్వవంద్యుడు. అందరిచేత నమస్కరింప తగినవాడు.

**త్వమాదిదేవః పురుషః పురాణః**
**త్వమస్య విశ్వస్య పరం నిధానమ్।**
**వేత్తాసి వేద్యం చ పరం చ**
**ధామ త్వయా తతం విశ్వమనంతరూప॥ 38**

అనంతరూపుడైన కృష్ణా! నీవు ఆదిదేవుడవు. పురాణ పురుషుడవు. ఈ జగత్తుకు ఆత్మరూపుడవు. ఆధారభూతుడవు. తెల్సుకోదగినవాడవు. తెలియబడే వాడవు నీవే. పరంధాముడవు. పరిపూర్ణంగా ఈ విశ్వాన్నంతా వ్యాపించి ఉన్నావు నీవు.

సృష్టి స్థితి లయ కారకుడవు. ఆదిదేవుడవు. బ్రహ్మాదుల కంటే అతి ప్రాచీనుడవు, పురాణ పురుషుడవు. జగత్తులో



చరాచర ప్రాణికోటికి అంతర్యామిగా వ్యాపించి ఉన్నావు. అనేక అవతారాల వల్ల నీ మహిమ ప్రభావాలు తెల్సుకోగల్గుతున్నాం. నీ కళ్యాణ గుణాలు వేదాల వల్ల తెలియబడుతున్నాయి.

**వాయుర్యమోఽగ్నిర్వరుణ శ్శశాంకః**
**ప్రజాపతిస్త్వం ప్రపితామహశ్చ।**
**నమో నమస్తేఽస్తు సహస్రకృత్వః**
**పునశ్చ భూయోఽపి నమో నమస్తే॥ 39**

వాయువు, యముడు, అగ్ని, వరుణుడు, చంద్రుడు, ప్రజాపతియైన బ్రహ్మ, బ్రహ్మకు తండ్రి అన్నీ నీవే. నీకు వేలసార్లు నమస్కరిస్తున్నాను. మళ్ళీ నమస్కారం, తిరిగి నీకు నమస్కారం.

సనక సనందాదులు సృష్టికార్యం చేయలేమన్నారు. కశ్యపుడు, దక్షుడు, సప్తర్షులు సృష్టికార్యంలో పాల్గొన్నారు. వాళ్ళకి తండ్రి బ్రహ్మ. ఆ బ్రహ్మకు తండ్రి పరమాత్మ. ప్రపితామహుడు అంటారు ఆయన్ని.

ఉపనిషత్తులు ఎన్నో ఉన్నా ప్రధానమైనవి పది. అందులో చిన్నది ఈశావాస్యం. పద్దెనిమిది మంత్రాలున్నాయి. అగ్నిదేవునిలో పరమాత్మను ధ్యానిస్తూ చెప్పే మంత్రం చివర ఉంది. అగ్నేనుపథారాయే అస్మాన్... అగ్నికి అంతర్యామి

అయిన ఓ దేవా మమ్మల్ని సన్మార్గంలో నడిపించు. నిన్ను అర్చించటానికి తగిన ఐశ్వర్యాన్ని ప్రసాదించు. నిన్ను పొందటానికి ప్రతిబంధకమైన పుణ్యపాపాల్ని పారద్రోలు. అందుకు భూయిష్ఠాంతే నమ ఉక్తిం విధేమ. ఎన్నెన్నో నమస్కారాలు చేస్తూ ఉంటాం.

జీవుడు దేవుని సొత్తు. మః న – నమః. నాకు నేను కాదు. నీకు చెందినవాడిని. పరమపదంలోని ముక్తులు నమః నమః అంటూ ఉంటారట. నీకు సేవలు చేయడానికి ఏవి అడ్డుపడుతూ ఉంటాయో వాటిని తొలగించు స్వామీ. సర్వాత్మనా నీకు అర్పింపబడాలి నేను. యజ్ఞయాగాది క్రియలు ఆచరించేటపుడు ఈ మంత్రం ప్రార్థనగా అనుసంధానం చేయడం కద్దు. అవకాశం కల్పించుకుని ఈశావాస్య ఉపనిషత్తులోని చివరి నాలుగు మంత్రాలు ప్రతినిత్యం అనుసంధానం చేసి జన్మని చరితార్థం చేసుకోవాలి. అందుకే ఇక్కడ అర్జునుడు మాటి మాటికీ నమస్కారాలంటూ వున్నాడు. భయభక్తులతో మనస్సు సమ్మిళితమైందని గ్రహించాలి. తర్వాత శ్లోకంలో కూడా నమస్కార పరంపరలు సాగిస్తున్నాడు.

**నమః పురస్తాదథ పృష్ఠతస్తే నమోఽస్తు తే సర్వత ఏవ సర్వ ।**
**అనంతవీర్యామితవిక్రమస్త్వం**
**సర్వం సమాప్నోషి తతోఽసి సర్వః ॥ 40**

ఓ సర్వాత్మా! నీకు ముందు వెనుక నమస్కారాలు. అన్నివైపుల నుంచి నీకు నమస్కారాలు. అనంతవీర్యుడవు నీవు. అమిత విక్రముడవు. విశ్వాన్నంతా వ్యాపించి వున్నావు కనుక నీవు సర్వస్వరూపుడవు.

ఈ జగత్తులో చరాచర సకల పదార్థాలు తన శరీరంగా భావిస్తునందువల్ల పరమాత్మ సర్వః అని పిలువబడుతున్నాడు. సర్వం సమాప్నోషి తతోసి సర్వః అంటుంది విష్ణుపురాణం కూడా.

పరమాత్మ పాదారవిందాలకు ఒక్కసారి నమస్కారం చేస్తే చాలు. జాతి, మతం, కులంతో పనిలేదు. ఎవడైనా ఏ స్థితిలో ఉన్నా నమస్కరించవచ్చు. శుచిత్వాది నియమాలు అక్కర్లేదు. అధికార నియమాలు అవసరం లేదు. ఒక్కసారి మనస్ఫూర్తిగా అంజలి ఘటిస్తే చాలు అంటుంది. ఆళవందార్ స్తోత్రంలోని ఒక శ్లోకభావం అదే అయితే అర్జునుడు అన్నిసార్లు నమస్కరించడం – విశ్వరూప సందర్శనం వల్ల భయం కావచ్చు, భక్తి కావచ్చు. తర్వాతి రెండు శ్లోకాల్లో తను చేసిన అపరాధాలను క్షమించమంటున్నాడు.

**సఖేతి మత్వా ప్రసభం యదుక్తం**
**హే కృష్ణ! హే యాదవ! హే సఖేతి ।**
**అజానతా మహిమానం తవేదం**
**మయా ప్రమాదాత్ ప్రణయేన వాపి ॥ 41**
**యచ్చాపహాసార్థమసత్కృతోఽసి విహారశయ్యాసనభోజనేషు**
**ఏకోఽథ వాప్యచ్యుత తత్సమక్షం తత్**
**క్షామయే త్వామహమప్రమేయమ్ ॥ 42**

నీ మహిమ తెల్సుకోలేక నిన్ను స్నేహితుడవని భావించాను. ఆ చనువుతో కాని, పొరపాటువల్ల కాని కృష్ణా! యాదవా! మిత్రమా! అని వినయం లేకుండా పిలిచాను. ఓ అచ్యుతా! మనం ఇద్దరం కలిసి విహరించేటప్పుడు, పడుకునేటపుడు, కూర్చుండేటపుడు, భోంచేసేటపుడు, ఒంటరిగాగాని, నలుగురిలోగాని పరిహాసంగా నిన్ను కించపరిచి వుండొచ్చు. ఓ అప్రమేయా నా అపరాధాలను క్షమించాలని ప్రార్థిస్తున్నాను.

ఒక్కోసారి నోరుజారి అనరాని మాటలెన్ని అన్నానో, చేయరానివి చేశానో, ఇంకా వేళాకోళంగా ఎన్నెనా చేసి వుండొచ్చు. ఒక్కోసారి నీ మాటల్ని తిరస్కరించి వుండొచ్చు. అది నీవు చనువు ఇచ్చావని అనుకున్నా. ఇవ్వకపోయినా ఇచ్చినట్లుగా భావించానో తెలియదు. తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పులన్నీ క్షమించు స్వామీ. చేసిన తప్పులను గుర్తించి పశ్చాత్తాపపడటం, ఆ తప్పుల్ని మళ్ళీ చేయకుండా ఉండటం బుద్ధిమంతుల లక్షణం అని అర్జునుని మాటలతో మనకొక హెచ్చరిక చేస్తున్నాడు వ్యాసమహర్షి.

చ్యుతం అంటే జారిపోవడం. అచ్యుతా అంటే తను జారిపోడు. తనని ఆశ్రయించిన వారిని జారిపోనివ్వడు. ఎన్ని ప్రతిబంధకాలేర్పడినా తనని నమ్మినవారిని విడిచిపెట్టడు అని అచ్యుత పదానికి అర్థాలు. ఇక అప్రమేయుడు అంటే సృష్టికి పెద్దవాడనిపించుకున్న బ్రహ్మకుగాని, రుద్ర ఇంద్రాదులకుగాని ఇంతటివాడని తెల్సుకోటానికి సాధ్యం కానివాడిని అప్రమేయుడు అంటారు. ప్రమా అంటే యదార్థ జ్ఞానం. ఆ జ్ఞానానికి సాధనాలు ఇంద్రియాలు. బ్రహ్మ రుద్రేంద్రాది ఇంద్రియాలకి కూడా గోచరం కాని వాడు పరమాత్మ.

అలా క్షమించమని ప్రార్థించిన అర్జునుడు భగవానుని పొగుడుతూ తనపట్ల ప్రసన్నుడు కావాలని మళ్ళీ వేడుకుంటున్నాడు రెండు శ్లోకాల్లో.

**పితాఽసి లోకస్య చరాచరస్య త్వమస్య**
**పూజ్యశ్చ గురుర్గరీయాన్ ।**
**న త్వత్సమోఽస్త్యభ్యధికః కుతోఽన్యో**
**లోకత్రయేఽప్యప్రతిమప్రభావ ॥ 43**

సాటిలేని ప్రభావం కలవాడా ఈ సమస్త చరాచర జగత్తుకు నీవు తండ్రివి. పూజ్యుడవు. గురుడవు. సర్వశ్రేష్ఠుడవు. ఈ ముల్లోకాల్లో నీకు సమానమైనవారు లేరు. నీకన్నా అధికుడైనవాడు కూడా లేడు.

"నీవే తల్లివి తండ్రివి, నీవే నా తోడు నీడ నీవే సఖుడౌ, నీవే గురుడవు దైవము, నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా" అన్నారు నృసింహ కవి. దాత, దైవంబు, తల్లియు, తండ్రి నీవే అని నమ్మి వున్నాను నీ పాద నళినములను అన్నాడు శేషప్పకవి. త్వమేవ మాతాచ పితా త్వమేవ, త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ, త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ, త్వమేవ సర్వం మమ దేవ దేవ అన్నారు భగవద్రామానుజులు. పరమాత్మకి జీవునికి గల సంబంధం తొమ్మిది రకాలన్నారు పెద్దలు. 1. తండ్రి 2. రక్షకుడు 3. శేషి 4. భర్త 5. జ్ఞేయుడు 6. స్వామి 7 ఆధారం 8. ఆత్మ 9. భోక్త.

**తస్మాత్ ప్రణమ్య ప్రణిధాయ**
**కాయం ప్రసాదయే త్వామహమీశమీడ్యమ్ ।**
**పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః ప్రియః**
**ప్రియాయార్హసి దేవ సోఢుమ్ ॥** 44

కనుక ఈ శరీరాన్ని వంచి సాష్టాంగ దండ ప్రణామం చేస్తున్నాను. స్తుతింపతగిన సర్వేశ్వరుడవు నీవు. నన్ను అనుగ్రహించాలని వేడుకుంటున్నాను. దేవా తప్పు చేసిన కొడుకును తండ్రి క్షమిస్తాడు. అలాగే స్నేహితుని తప్పును స్నేహితుడు - ప్రియురాలి అపరాధాన్ని ప్రియుడు క్షమించినట్లు నా తప్పులన్నీ క్షమించు.

అపచారాలు మూడు రకాలు. భగవదపచారం ఒకటి. భాగవత అపచారం రెండోది. మూడోది అసహ్య అపచారం. సీతమ్మ భగవత్ భాగవత అపచారాలు రెండూ చేసింది. వనవాసానికి నేనూ వస్తానంది రామయ్యతో. వద్దన్నాడు. ఎన్నోసార్లు వస్తానంది. వద్దు వద్దంటూ వుండటంతో కోపించింది భర్తమీద. పురుష వేషంలో ఉన్న ఆడదానికి ఇచ్చి చేశాడా నన్ను మా నాన్న. ఆమాత్రం అరణ్యంలో నన్ను కాపాడుకోలేనా అంది. అది భగవత్ అపచారం. జనస్థానంలో పధ్నాలుగు వేలమంది ఖరదూషణాదులను ఒకటిన్నర ముహూర్తం (72 నిమిషాలు) లో సంహరించి తను ఆడది కాదని, పురుషుడని జవాబు చెప్పకుండా చేసి చూపాడు శ్రీరాముడు. రాముని గొంతుపెట్టి సీతా! లక్ష్మణా! అని చావు అరుపు అరిచాడు మారీచుడు. రామప్రభువుకి ప్రమాదం ముంచుకొచ్చిందని భయపడింది సీతమ్మ. లక్ష్మణుని వెళ్ళమంది. నీకు రక్షణగా నన్ను పెట్టాడు అన్న, వెళ్ళనంటే వెళ్ళను అన్నాడు. రాముడు పోతే నన్ను పొందాలని ఉన్నావు. మిత్రరూపంలోని శత్రువువి నీవు. నిన్ను భరతుడు పంపించి ఉంటాడు. నీ కోరిక నెరవేరదు. ఇపుడే ఈ గోదావరిలో దూకి చస్తా లేదా ఉరి వేసుకుంటా అంది. కొడుకులాంటి లక్ష్మణస్వామి శీలాన్ని శంకించటం - అది భాగవత అపచారం. రెండు అపచారాలకి ఆరేసి నెలలు మొత్తం వెరసి పన్నెండు నెలలు. ఏడాదిపాటు లంకలో శిక్ష అనుభవించింది సీతమ్మ తల్లి. దేవుని పట్ల అపచారం చేసినా సహిస్తాడు భగవంతుడు. కాని భాగవతులపట్ల చేస్తే ఏమాత్రం సహించడు. అందుకే లక్ష్మణుడు అటు వెళ్ళగానే రావణుని రాక. సీతాపహరణం జరిగింది.

తెలిసో తెలియకో కొడుకు చేసిన తప్పులను తండ్రి క్షమిస్తాడు. సరదాగా మిత్రులు సరసాలాడుతూ పొరపాటున అనరాని మాటలు అంటే ఆ మిత్రుడు చేసిన తప్పును మరో మిత్రుడు క్షమించగలడు. ప్రేమాతిశయంలో ప్రియురాలు చేసిన దోషాలను ప్రియుడు మన్నించగలడు. కొడుకు, స్నేహితుడు, ప్రియురాలు - ఒక క్రమంగా ఒకరి స్థాయిని మించి మరొకరు ఉన్నట్లు గోచరిస్తోంది. ఒకవేళ మొదటి ఇద్దరూ చేసిన తప్పులు క్షమించబడకపోయినా ప్రియురాలు చేసిన తప్పులను ప్రియుడు తప్పక క్షమించగలడు కదా. ఆ ఆశతో అలా ప్రార్థించాడు పార్థుడు.

ఈ అధ్యాయంలో 43-44 శ్లోకాలు నిత్యం అనుసంధాలని భగవద్రామానుజులు శరణాగతి గద్యలో చేర్చాడు. అలా తన తప్పులను క్షమించాలని ప్రార్థించిన అర్జునుడు భగవానునితో తన సౌమ్యరూపం చూపాలని వేడుకుంటున్నాడు.

**అదృష్టపూర్వం హృషితోఽస్మి దృష్ట్వా**
**భయేన చ ప్రవ్యథితం మనో మే ।**
**తదేవ మే దర్శయ దేవరూపం**
**ప్రసీద దేవేశ జగన్నివాస ॥** 45

ఇదివరకెన్నడూ చూడని నీ విశ్వరూపాన్ని చూసి సంతోషంతో పాటు భయంతో కలత చెందాను. జగన్నివాసా పూర్వరూపంతో దర్శనమిచ్చి దేవేశా ప్రపన్నుడవు కమ్ము.

ప్రళయాగ్ని సదృశమైన రూపాన్ని చూసి ప్రసీద దేవేశ జగన్నివాసా అని ఇరవై అయిదో శ్లోకంలో అన్నాడు అర్జునుడు. ఇక్కడ అవే సంబోధనలతో మామూలు రూపం చూడాలని వేడుకుంటూ పలికాడు.

24-30 శ్లోకాల్లో విష్ణో అని సంబోధన ఉంది. చతుర్భుజుడైన విష్ణురూపం చాలా సౌమ్యంగా ఉంటుంది. ఆ రూపం చూడాలని కోరుతున్నట్లుగా భావించవచ్చు. దేవా తత్‌రూపం అంటే ఓ దేవా పూర్వపు రూపం అని అర్థం ఉంది.

దేవ-రూపం ఈ రెండు పదాలు కలిపితే దేవరూపం అని వస్తుంది. దేవరూపం అంటే విష్ణురూపం అని కొందరు వ్యాఖ్యానించారు. అంటే చతుర్భుజాలతో కూడిన విష్ణురూపం అని అనుకోవాలి. దేవ అని శబ్ద ప్రయోగం వల్ల మానుష రూపం కన్న దివ్యమైన రూపం. వైకుంఠం లోని పరమపద నాథుని రూపం అని కొందరు వ్యాఖ్యానించారు.

**(ఇంకా ఉంది)**


# ఉత్తరాయణం

- కౌతా నిర్మల


సంవత్సరానికి రెండు అయనాలు ఉంటాయి. ఆరు నెలలకు ఒక అయనం వస్తుంది. వాటిని ఉత్తరాయణం, దక్షిణాయనం అని చెప్తారు. జగానికి వెలుగును ప్రసాదించే సూర్యభగవానుడు పన్నెండు రాశులలో, ప్రతి నెలా ఒక రాశిలో సంచరిస్తూ ఉంటాడు. మేషం నుంచి మీనం వరకు సూర్యుడు ఒక రాశిలోంచి, మరో రాశిలోకి మారుతూండటాన్ని సంక్రమణం అంటారు. ఈ సంక్రమణానికి సంక్రాంతి అని మరో పేరు కూడా ఉంది. సూర్యుడు మేషరాశిలో ప్రవేశించినప్పుడు మేష సంక్రాంతి అని చెప్తారు. అదేవిధంగా మిగిలిన రాశుల పేరు చివర సంక్రాంతిని చేరుస్తారు. భాస్కరుడు ప్రవేశించిన ఇతర రాశుల కన్నా మేషం, కర్కాటకం, తుల, మకర రాశులు విశేషమైనవిగా పరిగణింపబడుతున్నాయి.

ఆదిత్యుడు మకరరాశిలోకి మారినప్పటి నుంచి ఉత్తరాయణం ఆరంభమవుతుంది. ఉత్తరాయణాన్ని శ్రేష్ఠమైనదిగా చెప్తారు. ఉత్తరాయణాన్ని పుణ్యకాలంగా పరిగణిస్తారు. ఈ అయనంలో పంటలు సమృద్ధిగా పండి, పచ్చదనం వెల్లివిరుస్తూ ఉంటుంది. ఈ కాలంలో ధనం, ధాన్యం, ఆరోగ్యం పెంపొందుతాయి. ఉత్తరాయణ పుణ్యకాలంలో స్వర్గద్వారాలు తెరచి ఉంటాయని, ఉత్తరాయణంలో మరణించినవారికి మోక్షం లభించి, స్వర్గప్రాప్తి కలుగుతుందని ప్రజల గాఢ విశ్వాసం. భీష్ముడు, కౌరవ పాండవ యుద్ధంలో మరణాన్ని సమీపించాడు. అది దక్షిణాయనం అవడం వల్ల, స్వచ్ఛంద మరణాన్ని వరంగా పొందిన ఆద్యుడు. అంపశయ్య మీద ఉండి, ఉత్తరాయణ పుణ్యకాలంలో విగతజీవుడై స్వర్గలోకానికి చేరుకున్నట్లు పురాణాల ద్వారా తెలుస్తోంది.

ఉత్తరాయణం పరమ పవిత్రమైనదిగా భావిస్తూ, ఆ కాలంలో కొత్తపనులు చేయటానికి శ్రీకారం చుడతారు. శుభకార్యాలను కూడా ఉత్తరాయణంలో చేస్తే, శుభఫలితాలు చేకూరుతాయని అందరి ప్రగాఢ విశ్వాసం. పిల్లలకు అక్షరాభ్యాసం చేస్తారు. ఉపనయనాలు, వివాహ ముహూర్త నిర్ణయం చేస్తారు. ఉత్తరాయణంలో శంకుస్థాపన కార్యక్రమాలు, గృహప్రవేశాలు చేస్తారు. ఈ అయనం దేవతలకు పగటికాలం, దక్షిణాయనం రాత్రి సమయం. ఈ రెండు అయనాలు కలిపి దేవతలకు ఒక రోజు అవుతుంది. ఉత్తరాయణంలో దేవతలు మెలకువగా ఉంటారు. కనుక భక్తుల పూజలు, అభిషేకాలు, అర్చనలు, భజనలు, పారాయణలు లాంటివి స్వీకరించి భక్తులకు తమ ఆశీస్సులను అందజేస్తారు. ఉత్తరాయణంలో చేసే దానాలు, పుణ్యకార్యాల వల్ల సద్గతిని పొందుతారని శాస్త్రం తెలుపుతోంది.



నువ్వుల దానం వల్ల శనిదేవుని బాధల నుంచి తప్పించుకోవచ్చు. శివాలయంలో నువ్వుల నూనెతో ప్రదోష సమయాన దీపాన్ని వెలిగిస్తే, వారి జీవితం ప్రకాశవంతమవుతుంది. ఉత్తరాయణ పుణ్యకాలంలో, విప్రునికి బియ్యం, ఆకుకూరలు, కూరగాయలు ముఖ్యంగా గుమ్మడికాయను, పాదరక్షలు, గొడుగు, శయ్య, ఒక పాత్రలో ఉదకం లాంటివి దక్షిణ తాంబూలాలతో దానమిచ్చి ఆ బ్రాహ్మణుని సంతృప్తి పరచి, ఆయన ఆశీర్వాదాన్ని పొందటమన్నది మంచిపనిగా శాస్త్రం చెప్తోంది. పితృదేవతలను స్మరిస్తూ, వారికి తర్పణాలు వదిలి, వారి ఆత్మలకు శాంతిని చేకూర్చాలి. స్త్రీలు నోములు, వ్రతాలు లాంటివి ఆరంభించే కాలమిది. సూర్య నమస్కారాలు చేస్తూ, సూర్యుని పూజిస్తూ, ఆదివారం నాడు సూర్యభగవానునికి పాయసాన్ని నైవేద్యంగా సమర్పించి ఆయురారోగ్యాలను పొందవచ్చు.



# మహాభారతంలోని రసవద్ఘట్టాలైన జాతీయాలు, సామెతలు, కథలు

శ్రీమాన్ లక్కరాజు శ్రీనివాసరావు

## కర్ణుని చావుకు కారణాలెన్నో...

ఒక వ్యక్తి జీవితంలో మూకుమ్మడిగా కోపాలు, శాపాలు, ప్రేమ, వాత్సల్యం, సమాజంలో గౌరవస్థానంపై వచ్చు నిందలు, ఎగతాళులు, ఆలంబనము లేకుంటే అతనికి మరణం దాకా శాంతి ఉండదు. సుఖాలెన్ని ఉన్నా మనశ్శాంతి ఉండదు. ఇలా ఉక్కిరి బిక్కిరి కానీయక జీవితాంతం వేటాడబడిన విధివంచితుడి కథే కర్ణుడి గాథ.

అయినా మొక్కవోని ధైర్య సాహసాలతో, తాను నమ్మిన సిద్ధాంతాలతో, తన పరువు ప్రతిష్ఠలు పదిమందిలో నిలబెట్టి ఆదరించిన స్వామియందు ప్రభుభక్తిని ప్రకటించుకొని వీరుడిగా, ధీరుడుగా, నాటి సమాజంలో ఎదిరించే తత్త్వము గల సాహసుడిగా, దానములో గొప్ప పేరుగాంచిన దాతగా, కష్టకాలంలో పలుమార్లు మంత్రిగా, స్నేహితుడిగా, ఆప్తుడిగా, ఆలోచనాపరుడిగా, శత్రు వ్యూహాలనెదిరించు యోధుడిగా పేరు పొందినవాడు కర్ణుడు.

కర్ణుడు లేని భారతముండదు. తింటే గారెలే తినాలి, వింటే భారతమే వినాలని సూక్తి ఎంతో గొప్పది. మహాభారతమును పద్దెనిమిది పర్వాలతో వ్యాసమహర్షి రచించెను. భారతంలో లేని విషయాలు లోకంలో ఉండవు. లోకంలో జరుగు విషయాలు భారతంలోనే గలవు. ఆతని అద్భుత సృష్టియే కర్ణుడు.

“కర్ణుడి చావుకు కారణాలెన్నో” అనే జాతీయమును నేటికీ మన సమాజంలో వాడటం పరిపాటి. కర్ణుడు కుంతీదేవికి దుర్వాసుని వరం వలన వివాహము కాకముందు జన్మించిన ప్రథమపుత్రుడు. పసితనము, ఆపై అవివాహిత కావటం వలన లోకాపవాదుకు వెరచి పసివాడగు కర్ణుని ఒక పెట్టెలో ఉంచి గంగలో విడిచెను. పుట్టుకరీత్యా క్షత్రియకులమైనా పిల్లలు లేని ఒక సూతునికి దొరికి పెంపుడుబిడ్డగా రాధేయుడిగా ప్రసిద్ధి గాంచెను. తండ్రి హస్తినాపురంలో రథ చోదకుడు. ధృతరాష్ట్రుని కొలువులో ఒక ఉద్యోగిగా జీవించుచుండెను. వారికి దొరికినబిడ్డగా పెంపుడు కుమారుడై, దినదిన ప్రవర్ధమానుడై, సహజ కవచకుండలాలు కలిగి కర్ణుడనే పేరున ఖ్యాతిలోనికొచ్చెను.

ఎన్నో కష్టాలకు, అవమానాలకు గుర్రై, కష్టాల కడలిలో ఈదుచు తనకిష్టమగు విలువిద్యను నేర్చెను. కర్ణుని పుట్టుక మొదలు మరణం వరకు తన ఉన్నతికిని, దుర్యోధనుని

అభివృద్ధికి, తన వ్యక్తిత్వమును నిలబెట్టుకొనుటలో తోటి క్షత్రియ కులంలో విభిన్న మనస్తత్వమును కల్గి మహాభారతంలో మరువరాని పాత్రగా మహర్షిచే సృష్టించబడెను.

ఆతని జీవితము ద్వారా ఎన్నో విలువైన అంశాలు నేటికిని మనం అన్వయించుకోవచ్చును. కొన్ని పొరపాట్లు, మరికొన్ని అవాకు చవాకులు ప్రేలినప్పటికీ, నమ్మిన వ్యక్తిగా, పౌరుషవంతుడిగా, చేసిన మేలు మరువనివాడిగా, పరాక్రమమును పలుమార్లు ప్రదర్శించిన వీరుడిగా కీర్తింపబడెను. దాన వీర శూర కర్ణుడని ప్రసిద్ధుడయ్యెను.

కొన్ని వక్రగుణాలున్నా, దానంలో మేటిగా స్తుతించబడెను. దానంలో దధీచి, శిబి, బలి చక్రవర్తుల తర్వాత కర్ణుని ప్రముఖుడిగా చెప్పవచ్చును.

కర్ణుని జననంలో స్వచ్ఛత ఉన్నా, పెరిగి పెద్దయిన వాతావరణంలో అసమసమాజము, ఒంటరితనము, కులవివక్షత, అవమానాలు, శాపాలు అతనిని క్రుంగదీశాయి. పాపపుణ్యము నెరుగని పసిగుడ్డుగా ఉన్నప్పుడే తల్లి యొక్క ప్రేమ, వాత్సల్యం, అనురాగములు, అమ్మ మెత్తని వడిలోని సుఖము, రాచరికపు భోగభాగ్యాలు కోల్పోయి, ఎదురుగా సోదరులున్నా వారితో కలవలేని వైనంతో నిరంతరం వ్యథకు గురికాబడిన విశిష్ట పాత్ర కర్ణుడు.



బాల్యమొక ఊయలలా, కమ్మని గీతంగా, మరచిపోని మధుర స్వప్నంలా గడవక సూతుని గృహమందు అనుకోని అతిథిలా జీవించెను. గుడ్డిలో మెల్ల అన్నట్లు తల్లితండ్రులు కన్నవారు కాకపోయినా పెంచినవారు అమృతమూర్తులు. దొరికిన బాలుణ్ణి పెన్నిధివోలె పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు నేర్పించారు. బాల్యం నుండి ధనుర్విద్యలో అనురక్తి గలవాడు, అట్టివిద్యలో నాడు నిష్ణాతులు, పరశురాముడు, భీష్ముడు, అగ్నివేశుడు, ద్రోణుడు, అర్జునులు. ద్రోణుడు నాటికే కురుకులంలోని పాండవ, కౌరవులకు విద్యలు నేర్పు మహా అధ్యాపకుడు. పైగా నిమ్నకులాలవారికి యుద్ధవిద్యలు నేర్పనని, నేర్పలేనని ఏకలవ్యుడి వృత్తాంతం ద్వారా తెలుసుకొన్నవాడు. కావున విద్య నేర్పేవారు ఎవరో అని ఆలోచించినా ఆ చిన్ని బుర్రకు తట్టలేదు. మారువేషంలో (బ్రాహ్మణ) పరశురాముని చేరి విలువిద్యలు నేర్చుకొనెను.

ఒకనాడు గురుదేవులు మధ్యాహ్న సమయంలో శిష్యుడగు కర్ణుని తొడపై నిద్రిస్తూ విశ్రాంతి తీసుకొనుచుండెను. అప్పుడొక కీటకం అతని ఊరువుపైకి చేరి కుట్టి గాయపరచెను. ఆచార్యులవారికి నిద్రాభంగమగునేమోనని తలంచి గురువుగారి యెడల భయభక్తులు మెండుగా గలవాడగుటచే, రక్తం కారుతున్నా, బాధ ఎక్కువగా ఉన్నా ధైర్యంతో, సహనంతో ఓర్చుకొని కూర్చొనెను. అది పెద్దగాయమై రక్తం ప్రవాహంగా మారి పరశురాముడిని తాకెను. ఆ తేమకు ఉలిక్కిపడి లేచి, జరిగిన విషయం గ్రహించి కుపితుడై "ఎవడవురా నీవు? నిజం పల్కుము. అబద్ధం చెప్పి గురువు వద్ద విద్యలు నేర్చుకొనుచుంటివని కణకణ మండు అగ్నికణంలా ప్రజ్వరిల్లుతూ నిలదీసెను.

అంతట కర్ణుడు భయంతో ఉన్న విషయం చెప్పెను. "గురువు యెడల చేసిన ద్రోహానికి కష్టపడి నేర్చుకున్న విద్యలు నీకు అవసరమగు కాలంలో స్ఫురణకు (గుర్తుకు) రాకుండుగాక" అని శపించెను. ఇది పరశురాముని శాపం. దినదిన ప్రవర్ధమానమగు మొక్కపై గొడ్డలివేటులా చదువు సంధ్యలలో వృద్ధి చెందాల్సిన వ్యక్తి తొలి జీవితంలో జరిగిన సంఘటన.

ఆ తరువాత మరొకమారు ఆశ్రమజీవితంలో ఉన్నప్పుడు నేతిని తీసుకుని వెళుతుండగా పొరపాటుగా జారి నేలపాలయ్యెను. అద్దానిని ఎలాగైనా తీసుకొని వెళ్ళాలనే తొందరలో నేయి పడిన భూభాగమును పెళ్ళగించి పిండి పాత్రలో పోసెను. అంతట ధరణీదేవి కోపంతో ఓరీ! మూర్ఖుడా! బలం ఉన్నదని సహజగుణమగు నన్ను నీ అపార శక్తితో పట్టి పిడికిలి బిగించి బాధించావు కనుక నీవు ఏ ఉద్దేశంతో ఈ పనిని చేశావోగాని, నీ విపత్కరస్థితి సమయాన నీ రథం నాలోకి క్రుంగిపోవుగాక అని శాపమొసంగెను. ఇది కర్ణుని జీవితంలో మరొక దెబ్బ.

పెరిగి పెద్దవాడై వ్యక్తిత్వ వికాసంతో, స్వయంకృషితో నాటి కౌరవ సమాజములో గుర్తింపు పొందు సమయాన పాండవ మధ్యముడగు అర్జునునికి ప్రతిద్వందిగా, కౌరవులకు హితుడిగా, దుర్యోధనుని దుష్టచతుష్టయంలో ఒకడిగా ఎదుగుచున్న సమయంలో శత్రుపక్షాన తన కుమారుడగు



కౌంతేయుడికి రాబోవు మహాసంగ్రామంలో నెదురు విలుకాడు కర్ణుడు కాగలడని భవిష్యద్దర్శనం గల ఇంద్రుడు దాతయగు రాధేయుడిని కవచకుండలాలు దానంగా పొంది మరింత కష్టాలలోకి త్రోసెను. యోధులకు కవచ కుండలాలు ఎంతో క్షేమదాయకము. అయినా తన మర్యాదకు, పరువుకు నష్టము వాటిల్లకుండునట్లు తండ్రి యగు సూర్యుడు ఇంద్రుని ఎత్తుగడను ముందుగా చెప్పి జాగ్రత్తపడమని చెప్పినా వినక మరో కష్టమును తెచ్చుకొనెను.

అరణ్య, అజ్ఞాత పర్వములు ముగిసి పాండవులు తమ పాలిమ్మని పెదతండ్రిని కోరిరి. దుర్యోధనుడి దురాలోచన వలన అది భంగమయ్యెను. శ్రీకృష్ణుడి రాయబారము బెడిసి ఇరుపక్షాల నడుమ పోరు సంసిద్ధమయ్యెను. సేనా సమీకరణలో భాగంగా శ్రీకృష్ణుడు కర్ణుడికి అతని జన్మరహస్యం చెప్పి, పాండవుల పక్షంలో చేరమని చెప్పినా, కౌరవ సామ్రాట్టు ఉప్పు తిని మోసం చేయటం తనవల్ల కాదని, పాండవులకు మేటి విలుకాడు అర్జునుడు కలడని, కౌరవులకు నన్ను నమ్ముకొన్న సుయోధనుని వీడి రాలేనని నిర్ద్వంద్వంగా చెప్పెను. అయినా కృష్ణుడు చివరి ఉపాయంగా కుంతీదేవిని ప్రయోగించెను. వంటరిగా, సంధ్యావందనము ఆచరించుచున్న మహారథి కర్ణుడి వద్దకేగిన కుంతి తన మొదటి సంతానము నీవేనని, నిన్ను ధర్మరాజు భావి సామ్రాజ్యమునకు చక్రవర్తిని చేస్తాడని, పాండవులు నీ సోదరులని చెప్పి విలపించెను. అయినా ధర్మం వీడనివాడై, అర్జునుని తప్ప మరెవ్వరైనా యుద్ధరంగంలో చిక్కినా, దక్కినా చంపనని మాటనిచ్చెను. కన్నతల్లి కుంతికిచ్చిన మాట ఆతని భవిష్యత్తుకే గొడ్డలిపెట్టుగ మారెను. అవకాశం వచ్చినా పాండవులలో మిగిలినవారిని వదిలేసి పరోక్షంగా కౌరవ సైన్యానికి అపకారం చేసెను. పాండవులలో ధర్మరాజు, భీముడు చేతికి దొరికారు. కాని అన్నమాటకు కట్టుబడెను. అది కూడా అతని జీవితానికి శాపమయ్యెను. తన జన్మ వృత్తాంతం ధర్మజునికి చెప్పరాదని తల్లినుండి మాట తీసుకున్నాడు.

ఇక కృష్ణుడు - ఏ ఆయుధం చేపట్టనని ప్రతిన బూనినవాడై రథసారథిగా ఉండి పాండవులకు పలుమార్లు ప్రమాదములు కలిగి విపత్కర పరిస్థితిలో పడి కొట్టుమిట్టాడిన సమయాన హితుడిగా, సన్నిహితుడిగా, బంధువుగా, మేలు కోరువాడిగా, యుద్ధనిపుణుడిగా, యుద్ధ మంత్రాంగం తెలిసిన మేధావిగా, రాబోవు ఆపదలను తొందరగా గుర్తించినవాడిగా రథమును యుద్ధరంగంలో నడిపించెను. ముందు, వెనుక అన్నీ అతడై నిలిచెను. కృష్ణుడి సలహా మేరకు తటపటాయిస్తున్న అర్జునుడిని "కర్ణ పర్వంలో" పరుష పదజాలంతో కర్ణుడిపై పగను పెంచుతూ, దుర్మార్గుడిగా, దుర్యోధనుడి అనుచరుడిగా, అభిమన్యుడి ప్రాణహంతకుడిగా, ద్రౌపది అవమానాలు గుర్తుచేసి మరీ చంపించెను.

భారత యుద్ధరంగంలో తొలి సేనానాయకుడుగా భీష్మ పితామహుడు, తరువాత ద్రోణుడు, ఆ తరువాత కర్ణుడు నాయకత్వం వహించారు. మహాయోధుడై అక్షౌహిణి సేనావాహినిని నడిపించెను.

ఆది, సభ, అరణ్య, అజ్ఞాత, యుద్ధ పర్వాలలో పలు సంఘటనలలో దుర్యోధనుడి దురాలోచనలకు, నిరంతరం అగ్నికి ఆజ్యం పోసినవారగు దుష్టచతుష్టయం సమూహంలో ఒక శక్తివంతుడిగా మెలగెను. అర్జునుడికి ప్రతిసారీ ప్రతిద్వంద్విగా, నిరంతరం ఎదుర్కొనే ప్రతివాదిగా నిలబడెను. శకుని ఉపాయమును చెప్పు బుద్ధిశాలి కాగా, దుర్యోధనుడు అమలు పరచువాడుగా, దుశ్శాసన, కర్ణులు ఆయుధాలుగా కౌరవ సమూహమున నిలబడిరి.

ద్రౌపది వస్త్రాపహరణ సమయంలో ఆక్షేపించబోయిన వికర్ణుడిని వారించెను. తప్పును తప్పుగా నిరూపించబోయిన పెద్దలను ఆక్షేపించి, పాండవుల ప్రథమ శత్రువుగా మిగిలెను. అరణ్యవాసంలో ఘోషయాత్రలో, గంధర్వునితో యుద్ధం జరిగినపుడు కర్ణుడు పలాయనం చిత్తగించెను. అజ్ఞాతవాసంలో పాండవుల ఉనికిని గుర్తించటంలో దుర్యోధనుడికి ఆలోచనలు రేకెత్తించెను. యుద్ధరంగంలో అభిమన్యుని, ఘటోత్కచుని చంపి మరింత శత్రువయ్యెను.

ఫలితంగా అర్జునుడి తొలిగురి కర్ణుడే. నిరంతరం తన ప్రతిద్వంది, విలువిద్యలో తనతో సాటియగు కర్ణుని మరణమే తనకు, తన వారికి క్షేమం. కర్ణుడి చావుతోనే తన మనస్సు సాంత్వన యుండగలదని గట్టిగా నమ్మెను. కృష్ణుడు సారథిగా పదకొండు అక్షౌహిణులతో వీరోచితంగా పోరాడి పార్థుడు విజయుడయ్యెను. శల్యుడు తన సారథ్యంతో నిరంతరం అతని మనస్సును కుళ్ళబొడిచెను. తప్పుడు సారథ్యం చేసెను. తన నిశిత శర పరంపరతో నేరుగా కర్ణుని ప్రాణం దీసిన కర్ణునికి మరొక పెద్దశాపంగా మారెను.

ఇలా ఒక వ్యక్తి తన జీవితంలో ఎన్నో బాధలు, కోపాలు, శాపాలకు గురియై వీరమరణం పొందినవాడెవరంటే కర్ణుడని చెప్పక తప్పదు.

అతని జీవితంలో ఏదో ఒక శాపం తప్పినా మరొక విధంగా భారతకథ నడిచి వుండేది. అసలే ఎండ, ఆపై కాలికి చెప్పులు లేవు, ఆపై బట్టతల, వీచేవడగాలి, నిండు మండువేసవిలో నడుస్తూ, కాస్త నీడకోసం నడుస్తూ ఒక తాళవృక్షం ఛాయలో నిలిచెనొక దైవోపహతుడు. ఆ వెంటనే మగ్గిన తాటిపండు రాలి తలపై పడిన చందంగా కర్ణుడు జీవితంలో ప్రతి ఘట్టం బాధతో కూడినదే. ఇలా ఉక్కిరి బిక్కిరి అవుతున్న ఒక వ్యక్తి కొన్ని సుగుణాల వలన భారతగాథలో మరచిపోలేని వ్యక్తిగా నిలబడిపోయెను.

అతి దాతృత్వము, స్వామి పరాయణత్వం, నమ్మిన సిద్ధాంతం కొరకై అహర్నిశలు పాటుపడటం, అన్నమాటను నిలబెట్టుకోవటం అనే గుణాలు అతనిపై వేలాది సంవత్సరాలు గడిచినా సానుభూతి కల్గిస్తున్న గొప్ప సాహిత్యంగా మహాభారతమున నిలిచిపోయెను.

చివరగా ధృతరాష్ట్రుడు తన నూర్గురు పుత్రులు మరణించినా కర్ణుడి పరాక్రమము ఏమైందని విదురుని ప్రశ్నిస్తాడు, విలపిస్తాడు.

శాంతి పర్వంలో తనలో గల్గిన శంకను నారదుల వారి ద్వారా తెలుసుకుని మరింత దుఃఖిస్తాడు.

**"వినుము నరేంద్ర, విప్రుడలిగెన్, జమదగ్ని సుతుండు శాపమి**
**చ్చె, నమర భర్త వంచనము సేసె, వరంబని కోరి కుంతి, మా**
**న్చె నలక, భీష్ముడర్థ రథునిజేసె యడంచె, కలంచె మద్రరా**
**జ నుచితమాడి, శౌరి విధియయ్యె, నరుండని జంపె కర్ణునిన్"**

బ్రాహ్మణశాపం, పరశురాముని శాపం, అమరపతి (ఇంద్రుడి మోసం, కుంతీదేవి కోరిక, భీష్ముడి అలక, శల్యుడి కఠినవాక్కులు, కృష్ణుడు కారణం (కర్త), అర్జునుడు (యుద్ధం) - ఇంతమంది ఇన్ని రకాలుగా ఒక వ్యక్తిని, అతని జీవితమును చుట్టుముట్టి తుద ముట్టించిరి. విధి చాలా బలీయం. దానిని తప్పించుకు తిరుగుట అసాధ్యం" అని వివరించెను.

అందుకే "కర్ణుని చావుకు కారణాలెన్నో" అనే నానుడి నేటికీ వాడబడుతూనే ఉంది. ఒక రాజకీయ వ్యవస్థ గాని, ఒక కుటుంబం గాని, ఒక ఉన్నతవంశం గాని ఛిన్నాభిన్నమై, పరాజయం పొందినపుడు సంబంధిత వ్యక్తులు తమలో తాము క్రోడీకరించుటకు పలు పరాజయ కారణాలు శోధిస్తుంటారు. తెలివితో ఆ లోపం గుర్తించి పూడ్చుకోవటానికి ప్రయత్నిస్తారు. కానికాలం ఏ మాత్రమూ ఎవరికోసం ఆగదు. అది ఒక అనంత ప్రవాహం.

# సంక్రాంతి శుభవేళ

## (కవిత)

హేమంత నిశీథిలో
ఉత్తరాయణ శుభవేళలో
అరుణారుణ కాంతులు
తెలుగు వాకిళ్ళలో దోబూచులాడేవేళ
స్వాగతించు భోగిమంటలు
మకర సంక్రాంతి ఉదయకాంతులు
పచ్చని పొలాలు, కొత్తధాన్యము
పాలు, పొంగళ్ళ రుచులు
రంగులీను ముంగిళ్ళలో
గొబ్బెమ్మల మురిపాలు
బంతి, చేమంతుల సొగసులు
శోభించే బొమ్మల కొలువులు
ముత్తయిదువుల ఆశీస్సులు
పసిడి ప్రాయానికి ధవళకాంతులు
హరిదాసు భజనలు
గంగిరెద్దుల మురిపాల ధ్వనులు
అంబరాన్నంటే వేదమంత్రాలు
భక్తులకు శుభాశీస్సులు
కొత్త అల్లుళ్ళ చిలిపి అలకలు
హొయలొలుకు మరదళ్ళ కొంటె చూపులు
కోడెదూడల రణగొణ ధ్వనులతో
రైతన్న గుండెలలో ఆనందపు సిరిజల్లులు
నిండిన గాదెలతో
ఉప్పొంగిన హృదయాలతో
పిండి వంటల ఘుమ ఘుమలతో
కొంగ్రొత్త రుచుల
కనుమ సంబరాలు
తెలుగు సాంప్రదాయాలకు
నిలువెత్తు దర్పణాలు

**- యం. అహల్యాదేవి**

ధారావాహిక



# శ్రీ విష్ణు మహాపురాణం

- డా॥ కిడాంబి నరసింహాచార్య

### గత సంచిక తరువాయి

సురోదకము చుట్టూ కుశద్వీపముతో చుట్టబడినది అంతా. శాల్మలద్వీపము కన్నా విస్తారంలో రెట్టింపుగా ఉంది ఈ ద్వీపము. ఇది కుశద్వీపము. ఈ ద్వీపంలో జ్యోతిష్మంతుని ఏడుగురు పుత్రులున్నారు. వారి పేర్లను విను. ఉద్భిదుడు, వేణుమాన్, వైరథుడు, లంబనుడు, ధృతి, ప్రభాకరుడు, అతికపిలుడు అని. వారి పేర్లతో దేశాలున్నాయి. ఆ ప్రదేశంలో మనుష్యులు, దేవతలతో, రాక్షసులతో కలిసి జీవిస్తున్నారు. అట్లాగే అక్కడ దేవ గంధర్వ యక్ష కింపురుషాదులు ఉన్నారు. అక్కడున్న నాల్గు వర్ణాలవారు తమ తమ ధర్మాలను చక్కగా అనుష్ఠిస్తున్నారు. అక్కడున్న నాల్గు వర్ణాలవారి పేర్లు దమినులు, శుష్మిణులు, స్నేహులు, మందేహులు అని. వారు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు. క్రమంగా తమకు విధించిన కర్మలు చేస్తున్నందువల్ల వారు తమ అధికారనాశం కొరకు అక్కడే ఆ కుశద్వీపంలో ఉన్న బ్రహ్మరూపుడైన జనార్దనుని, ఉగ్రుని అధికార ఫలాన్నిచ్చే వాడిని పూజిస్తూ కాలం గడుపుతున్నారు. ఓ మహామునీ! ఆ ద్వీపంలో ఏడు వర్షాచలాల పేర్లు ఇవి - విద్రుమము, హేమశైలము, ద్యుతిమంతము, పుష్పవంతము, కుశేశయము, హరిపర్వతము, మందర పర్వతము అని. అక్కడ ఏడు నదులున్నాయి. వాటి పేర్లను వినండి. ధూతపాపా, శివా, పవిత్ర, సమ్మతి, విద్యుత్, అంభా, మహి అని. ఇవన్నీ అన్ని పాపాలను తొలగించేవి. ఇవికాక అక్కడ వేలకొలది నదులు, పర్వతాలు ఉన్నాయి. అవి చిన్న చిన్నవి. కుశద్వీపంలో కుశస్తంభమున్నది. దాని పేరుతోనే అది కుశస్తంభ ద్వీపమని పిలువబడినది. (కుశలు, దర్భలు స్తంభంలాగా ఉన్నాయి కనుక అది కుశస్తంభము - కుశద్వీపము) దాని వైశాల్యంతో దాన్ని ఘృతోదము చుట్టి ఉంది.

ఘృతోద సముద్రము క్రౌంచ ద్వీపముతో చుట్టబడింది. క్రౌంచద్వీపము మరొక ద్వీపము. ఓ మహాభాగా! దాని గురించి వినండి. విస్తీర్ణములో ఇది కుశద్వీపము కన్న రెట్టింపు విస్తారమైనది. క్రౌంచ ద్వీపములో ద్యుతిమంతుని పుత్రులన్నారు. వారి పేరే వారి వారి రాజ్యాలకు ఏర్పడ్డాయి. కుశలుడు, మల్లగుడు, ఉష్ణుడు, పీవరుడు, అంధకారకుడు, ముని, దుందుభుడు ఈ ఏడుగురు ఆతని పుత్రులు. అక్కడి దేశాలు దేవతలతో, గంధర్వులతో సేవింపబడేవి. మనోహరమైనవి అక్కడి వర్షాచలాల పేర్లు వినండి - క్రౌంచము, వామనము, అంధకారకము, స్వాహినీ, హయసన్నిభ ముఖం గలది. రత్నముల పర్వతము నాల్గవది (స్వాహనీ). ఐదవది వావృత, పుండరీకము మరొకటి. ఏడవది దుందుభి మహాపర్వతము. ఇవి ఒకదానిని మించి మరొకటి రెట్టింపు విస్తారం కలవి. ద్వీపము లెట్లాగో ద్వీపములలోని పర్వతాలు కూడా అట్లాగే ఒకదాని కంటే మరొకటి రెట్టింపైనవి. రమ్యమైన ఈ దేశాలలో, పర్వతాలలో ఏ అడ్డంకీ లేకుండా దేవతలతో కలిసి ప్రజలు నివసిస్తున్నారు. అక్కడి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు పుష్కరులు, పుష్కలులు, ధన్యులు, తితిఖ్యులు అని క్రమంగా పేరు. ఓ మైత్రేయా! అక్కడ నదులున్నాయి. వాటి నీటినే త్రాగుతున్నారు. ఏడు ప్రధాన నదులు, మిగిలినవి నూర్లకొలది క్షుద్రనదులు (చిన్నవి). గౌరీకుముద్వతి, సంధ్య, రాత్రి, మనోజవ, క్షాంతి, పుండరీక అని ఈ ఏడు వర్ష (దేశ) నదులు. అక్కడ కూడా భగవాన్, జనార్దనుడు, విష్ణువు, పుష్కరాది యాగాలతో యజ్ఞ సన్నిధిలో రుద్ర స్వరూపుడై పూజింపబడుతున్నాడు. క్రౌంచద్వీపము, దధి మండోదక సముద్రంతో (చిక్కని, జిగురు తేలిన పెరుగు) చుట్టబడినది. ఇది క్రౌంచ ద్వీపంతో సమానంగా ఈ దధి సముద్రం వ్యాపించి ఉంది. దధి మండోదక సముద్రము చుట్టూ శాక ద్వీపమున్నది. ఈ శాకద్వీపము క్రౌంచ ద్వీపము కన్న రెట్టింపు విస్తారంగా ఉన్నది. శాక ద్వీపాధిపుడు భవ్యుడు. అతనికి ఏడుగురు సంతానము. వారికి ఏడు దేశాలు. వారిపేర్లు జలదుడు, కుమారుడు, సుకుమారుడు, మరీచకుడు, కుసుమోదుడు,

మౌదాకి, మహాద్రుముడు అని. వారి పేర్లతోనే వారి దేశాలు పిలువబడుతున్నాయి. అక్కడ దేశాలను విభజించే ఏడు పర్వతాలున్నాయి (సరిహద్దులుగా). అవి ఉదయగిరి, జలాధారము, దైవతకము, శ్యామము, అస్తగిరి, ఆంబికేయము, రమ్యమైన కేసరి. శాకమనేది అక్కడ గొప్ప వృక్షము. దానిని సిద్ధులు, గంధర్వులు సేవిస్తున్నారు. అక్కడి గాలి తాకితే చాలు ఎంతో ఆనందం కల్గుతుంది. అక్కడి గ్రామాలు పవిత్రమైనవి. అందులో నాల్గు వర్ణాల వారున్నారు. ఇక్కడి నదులు పుణ్యప్రదమైనవి. పాపాలను తొలగించేవి. ఆ నదులు సుకుమారి, కుమారి, నళిని, ధేనుక, ఇక్షు, వేణుక, గభస్తి అని ఏడు నదులు ప్రధానమైనవి. ఓ మహామునీ! అక్కడ క్షుద్రనదులు నూర్ల కొలదీ ఉన్నాయి. అక్కడ పర్వతాలు చిన్న చిన్నవి నూర్లకొలదీ, వేలకొలదీ ఉన్నాయి. జలదాదులలో (మేఘాలలో) ఉన్నవారు సంతోషంతో వీటి నీటిని త్రాగుతారు. స్వర్గంలో ఉన్నవారు ఈ ప్రదేశాలకు వచ్చి (పుణ్యం అయినాక) ఈ దేశాలలో (జలదాదులలో) ఉండి ఈ నదుల నీరు తాగుతారు. వారిలో ధర్మహాని లేదు. పరస్పరం తగాదాలు లేవు. నియమాలు దాటడం లేదు ఈ ఏడు దేశాలలో. వంగ, మగధ, మానస, మందగ అని దేశాల పేర్లు. వంగ దేశంలో బ్రాహ్మణులెక్కువ. మగధ దేశంలో క్షత్రియులెక్కువ. మానస దేశంలో వైశ్యులెక్కువ. శూద్రులు మందగంలో ఉన్నారు. ఓ మునీ! శాకద్వీపంలో విష్ణువు సూర్యరూపంలో ఉన్నాడు.

ఇంద్రియ నిగ్రహం కలిగి, కర్మలను చక్కగా ఆచరిస్తూ శాస్త్రం ప్రకారం వారు ఆరాధిస్తున్నారు. శాకద్వీపం పాలసముద్రంతో చుట్టబడింది. శాకద్వీపం చుట్టూ ఈ సముద్రమున్నది. క్షీరాబ్ధి పుష్కర అనే ద్వీపంతో చుట్టబడినది. పుష్కరద్వీపం శాకద్వీపం కన్నా రెట్టింపుగా ఉంది. పుష్కరంలో సవనునకు మహావీరుడు పుత్రుడు. ధాతుకి అనువాడు కూడా ఉన్నాడు. వారికి చెరొక రాజ్యముంది. ఒకటి మహావీర దేశము, రెండవది ధాతుకి దేశము. ఇక్కడొక వర్ష పర్వతమున్నది. దానికి మానసోత్తరమని పేరు. అది గుండ్రంగా ఉంది. పైకి ఏబది యోజనాలు వ్యాపించి ఉంది. అంతే విస్తీర్ణం కలిగి, అంతటా వర్తులంగా ఉంది. అది పుష్కరద్వీపాన్ని రెండు భాగాలు చేస్తున్నట్టుగా ఉన్నది. ఆ కారణంగా అది రెండు దేశాలుగా విభజింపబడింది. ఒక్కొక్కటి వలయాకారంగా ఉంది దాని దేశము, పర్వతము కూడా. అక్కడ నరులు పదివేల సంవత్సరాలు జీవిస్తారు. రోగాలు లేవు, దుఃఖం లేదు, రాగద్వేషాలు లేవు. వారిలో అధముడు, ఉత్తముడు అనే భేదం లేదు. చంపేవాడు, చచ్చేవాడు లేరు. ఈర్ష్యాసూయలు, భయద్వేషాలు, దోషలోభాలు అక్కడ లేవు. అక్కడ పసుపువర్ణం వర్షం ధాతకి ఖండంలో కురుస్తుంది. మానసోత్తర శైలం యొక్క ధాతకి ఖండములో దేవతలు, దైత్యులున్నారు. ఈ ద్వీపాలు సత్యం, అనృతం అనే పేర్లతో పుష్కరద్వీపంలో ఇవి ఉన్నాయి. అక్కడ నదులు, పర్వతాలు ఈ రెంటిలో లేవు. మనుష్యులు అందరూ ఒకే వేషం కలవారు. దేవతలు ఒకేరూపం కలవారు. వారంతా వర్ణాశ్రమ ఆచారాలు లేనివారు, ధర్మాచరణ లేనివారు. అక్కడ త్రయీ, వార్తా, దండనీతి, శుశ్రూష అనేవి లేవు. రెండవది భౌమము. ఇది ఉత్తమ స్వర్గము. అన్ని ఋతువులు సుఖాన్నిచ్చేవే. కాలమట్టిది. జర, రోగాలు లేవు. ధాతకీ ఖండంలో మహావీరంలోను స్థితి ఇది. పుష్కరద్వీపంలో న్యగ్రోధ వృక్షము ప్రధానము (మర్రి). ఇది బ్రహ్మకు ఉత్తమస్థానము. ఇక్కడ బ్రహ్మ దేవతలతో, రాక్షసులతో పూజింపబడుతూ ఉన్నాడు. పుష్కరము రుచికరమైన నీటి సముద్రంతో చుట్టబడినది. పుష్కరమంత సమానంగా ఈ నీటి సముద్రమున్నది విస్తీర్ణంలో వర్తులంలోనూ. ఇట్లా ద్వీపాలు ఏడూ ఏడు సముద్రాలతో చుట్టబడినాయి. ద్వీపము సముద్రము సమానంగా ఉన్నాయి. మిగిలినవి రెట్టింపైనవి. అన్ని సముద్రాలలో నీరు ఎప్పుడూ సమంగా ఉంటాయి. వాటికి ఎక్కువ తక్కువలు ఎప్పుడూ కలుగవు. గిన్నెలో ఉన్న నీరు అగ్ని సంయోగం వల్ల వేడెక్కి హెచ్చు తగ్గులైనట్లు, అట్లాగే చంద్రుడు పెరిగిన తగ్గిన వేళ సముద్రంలో నీరు హెచ్చుతగ్గులౌతుంది. ఎక్కువ తక్కువలు కాకుండా నీరు పెరుగుతాయి, తరుగుతాయి. చంద్రుని ఉదయాస్తమయాల్లో శుక్ల కృష్ణ పక్షాల్లో నలుబది రెండున్నర వితస్తుల పరిమితంగా నీరు వృద్ధి, క్షయమవుతుంది సముద్రాలలో. ఆహారం పుష్కరద్వీపంలో తనంత తానుగా వస్తుంది. అక్కడి ప్రజలందరూ ఎల్లప్పుడూ షడ్రసోపేతమైన భోజనం చేస్తారు. రుచికరమైన నీటిచుట్టూ లోకం నిలిచి ఉంటుంది. బంగారుభూమి రెట్టింపుగా ఏ జంతువులు లేకుండా ఉంది. ఆ పిదప లోకాలోక శైలము పదివేల యోజనముల కొలది విస్తరించి ఉంది. ఎత్తులో కూడా ఆ పర్వతం అంత ఎత్తులోనే ఉంది (పదివేలు). పిదప ఆ పర్వతాన్ని చీకటి ఆవరించి ఉంది. చీకటి, అండకటాహంతో చుట్టబడి ఉంది. ఓ మహామునీ! ఈ భూమి ఏబదికోట్ల యోజనముల విస్తారం కలది. ద్వీపాలు, సముద్రాలు, భూమి, అండకటాహం ఇదంతా కలిపి ఏబదికోట్ల యోజన విస్తీర్ణంగా ఉంది. ఈ భూమి కర్తయై, పంచభూతాల గుణాలు కలదై అందరికీ, ప్రాణులకు ఆధార భూతమైనది ఓ మైత్రేయా! అని విష్ణుపురాణంలో ద్వితీయ అంశలో నాలుగవ అధ్యాయం సమాప్తము.

(సశేషం)



# వడువూరు శ్రీరామస్వామి

-ఈచంబాడి ఆర్. వసంత

క్షేత్రము, తీర్థము, దేవాలయము - ఇవి ఉండే స్థలంలో దేవుని దర్శించి తరించాలి అని తెనాలి రామకృష్ణకవి తన రచన పాండురంగ మహత్మ్యమునందు తెలిపెను.

పరమేశ్వరునకు ద్వాదశ జ్యోతిర్లింగములు (12 లింగములు) కలవు. కొంతకాలము క్రితం మానవులు వాటికి దేవాలయములు కట్టి గొప్ప శివలింగ క్షేత్రములుగా పూజించుచున్నారు.

ఆవిధముగా శ్రీమన్నారాయణునకు 108 దివ్య దేశములు కలవు. 108 దివ్య తిరుపతులుగా చెప్పబడుచున్నవి. అవి నదీ తీరములందును, కొండల యందును, నగరములలోను, ఆ శ్రీమన్నారాయణుడే ప్రతిష్ఠించి దేవాలయములు కట్టి ప్రజల చేత పూజింపబడుచున్నాడు.

ఈ 108 దివ్య క్షేత్రములు మానవులు తప్పక చూచి, అక్కడి దేవదేవుల అనుగ్రహము పొందుట వలన, ముక్తిని పొందెదరు. అవి....

| | |
|---|---|
| **1. చోళదేశమున గల దివ్యదేశములు** | **- 40 క్షేత్రములు** |
| **2. మధ్య దేశమున గల దివ్యదేశములు** | **- 2 క్షేత్రములు** |
| **3. దక్షిణ దేశమందలి దివ్యదేశములు** | **- 22 క్షేత్రములు** |
| **4. ఉత్తరదేశ దివ్యదేశములు** | **- 11 క్షేత్రములు** |
| **5. మలైనాడు దివ్యదేశములు** | **- 13 క్షేత్రములు** |
| **6. పాండ్యదేశమందలి దివ్య దేశములు** | **- 18 క్షేత్రములు** |
| **మొత్తం** | ---------- |
| | **106 దివ్యక్షేత్రములు** |

-----------

107. పరమపదము, 108 శ్రీ వైకుంఠము : వీటిని మానవులు చూడలేరు. మరియు అక్కడకు వెళ్ళలేరు.

మానవులు సత్కార్యములు చేసి, శ్రీమన్నారాయణుని పూజిస్తూండేవారు. వారి శరీరములోని ఆత్మలు వదలి పరమపదమును చేరి అక్కడనుండి శ్రీవైకుంఠమును చేరి శ్రీమన్నారాయణుని పూజిస్తూ తమ కాలమంతయును అక్కడనే ఉండిపోయెదరు.

అనగా భూలోకవాసులు వారిని కీర్తిస్తూ స్మరిస్తూ వున్నంతకాలం వారు నిత్యసూరిగా ఉండెదరు. చివరగా స్వామివారిలోనే ఐక్యము పొందెదరు. కనుక 107, 108 క్షేత్రములు మానవులు చూడలేరు.

**పురాణ స్థలములు - 19**

అవి 1. శ్రీకూర్మము 2. శ్రీముష్ణం 3. అవంతి (ఉజ్జయిని) 4. గయ 5. కాశి (వారణాసి) 6. కురుక్షేత్రము 7. ధనుష్కోటి 8. తిరునారాయణ పురం (మేల్కోటె) 9. పండరిపురం 10. భద్రాచలం 11. ప్రయాగ (అలహాబాదు) 12. పుష్కరము 13. పూరీ జగన్నాథస్వామి 14. మాయాక్షేత్రము (హరిద్వార్) 15. రామేశ్వరము 16. మన్నార్‌గుడి (రాజమన్నార్ క్షేత్రము) 17. వర్కల 18. సింహాచలము 19. సేతుబంధనం (దర్భశయనం శ్రీరామస్వామి దేవాలయము - తిరుపుల్లాని) - ఇవి చూడవలసిన ముఖ్యమైన ప్రదేశములు.

ఇవి చూడలేని యెడల తప్పక ప్రతి మానవుడు 1. శ్రీరంగం 2. కాంచీపురము 3. తిరుమల (శ్రీ వేంకటేశ్వరస్వామి) 4. మేల్కోటె (తిరు నారాయణపురం) 5. మధురాంతకం (శ్రీరామచంద్రస్వామి) - ఈ క్షేత్రములను మానవులు వారి జీవితకాలములో తప్పక ఒక్క పర్యాయము అయినను చూచి తరించి భగవంతుని అనుగ్రహమును పొందాలని పెద్దలు చెప్పెదరు.

## శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రులవారు

## - వడువూరు

మానవులు చూచి తరించవలసిన క్షేత్రములలో "శ్రీ రామచంద్రులవారు, వడువూరు" క్షేత్రము ఒకటి. ఈ క్షేత్రము మన్నార్ గుడికి 4 కిలోమీటర్ల దూరములో ఉన్నది. (మన్నారు గుడి క్షేత్రానికి రోజు వదలి రోజు తిరుపతి నుండి రైలు బయలుదేరును)

పై రెండు క్షేత్రములను మానవులు తప్పక చూడవలసిన క్షేత్రములు. అందు శ్రీ సీత, రామ, లక్ష్మణుల మూలవర్లను, ఉత్సవమూర్తులను రెప్పపాటు పడకుండా అలాగే చూస్తూ ఉంటాం. అంత అందంగా ఉంటారు.

శ్రీవడువూరు సీతారాముల వారంటే పూజించేవారు. కోరిన కోర్కెలను తీర్చు కరుణామయుడు. అందువలననే మునులు, ఋషులు, మానవులు భక్తి శ్రద్ధలతో పూజించేవారు. వారి కోర్కెలను తీర్చుకునేవారు. శ్రీరామచంద్రులు 14 సంవత్సరములు అరణ్యవాసం చేసి, రావణ వధ అనంతరం తన భార్య సీతాదేవితోను, తమ్ముడు లక్ష్మణుడు, మిగిలిన వానర సైన్యముతో అయోధ్యా నగరమునకు వెళ్ళుచుండిరి. ఆ దారిలో చాలామంది మునులు, యోగులు, మానవులు వారిని చూచి భక్తి శ్రద్ధలతో చేతులు జోడించి నమస్కరించారు. వారి దివ్యమంగళ విగ్రహమును చూచిన మునులు "శ్రీరామచంద్రా! మిమ్ములను ఎంత జూచిననూ మా మనసుకు తనివి తీరుటలేదు. కావున మీరు ఇక్కడ కొంతకాలము ఉండి మా ఆతిథ్యము స్వీకరించి మమ్ములను అనుగ్రహించండి అని నమస్కరిస్తూ ప్రార్థించారు.

అంత శ్రీరామచంద్రులవారు వారిని చూచి "మహాత్ములారా! నేను 14 సంవత్సరాలు వనవాసమును పూర్తిచేసుకొనిన మరుసటిరోజే అయోధ్యా నగరమునకు వచ్చెదను అని భరతునకు ప్రమాణము చేశాను. కావున రేపటి సాయంకాలము లోగా అయోధ్యకు చేరుకోవాలి" అని తెలిపెను.

ఆ మాటలు విన్న మునులు దీనమైన వదనాలతో ఏమియును చేయలేక బాధతో ఉండిపోయారు. ఇది గ్రహించిన శ్రీరాములవారు కొంతసేపు ఆలోచించి వారి కోర్కెను నెరవేర్చుటకు దేవశిల్పి అయిన విశ్వకర్మను రప్పించి "ఓ విశ్వకర్మా! రేపటి ఉదయంలోగా మా ముగ్గురి ప్రతిమలను మలచ"మని చెప్పెను. ఆ మరుసటి రోజు ఉదయానే చూడగా వేరువేరు నల్లరాతిలో శ్రీరామ, సీత, లక్ష్మణుల వారి రూపాలను దేవశిల్పి రచించెను. ఆ శిల్పాలు శ్రీరామునికన్నా మెరయుచూ, రెప్పపాటు లేనివిధంగా అందంగా ఉన్నాయి.

అంత శ్రీరాములవారు ఆ వూరియందే సీత, రామ, లక్ష్మణుల శిల్పములను ప్రతిష్ఠించి, దాశరథి తన వారితో అయోధ్యా నగరమునకు వెళ్ళెను. ఆ నాటినుండి వడువూరు శ్రీరామచంద్రుల వారిని ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజించి వారి కృపా కటాక్షములను పొందుచుండిరి.

కాని శ్రీ వడువూరు శ్రీరామచంద్రులవారికి ఎవరునూ దేవాలయము కట్టలేదు. ఆరోజులలో తంజావూరును పాలించే శరభోజ మహారాజు తన రాజ్య ప్రజలను, తన బిడ్డలవలె, వారికి ఎటువంటి కష్టాలు కలగకుండా, వారికి బాధలు లేకుండునట్లుగా పాలించుచుండెను. ఒక పర్యాయము రాత్రి శరభోజ మహారాజు నిద్రించుచుండగా వారికి కలలో శ్రీరామచంద్రులవారు సాక్షాత్కరించి "శరభోజరాజా! నా యొక్క ప్రతిరూపాలు శ్రీ సీతా రామ లక్ష్మణుల శిలారూపాలు వడువూరు నందు ఎటువంటి ఆధారాలు లేకుండా ఉన్నవి. అక్కడ ఒక దేవాలయమును నిర్మింపుము" అని తెలిపెను. అంత మహారాజు కనులు తెరిచి చూడగా తెల్లవారవచ్చింది. తన కలలో శ్రీరామచంద్రమూర్తియే సాక్షాత్కరించి ఆజ్ఞాపించారనే సంతోషముతో తన సైన్య సహాయమున వెళ్ళి చూడగా – ఆశ్చర్యం. సీత, శ్రీరాములవారు లక్ష్మణస్వామివారి శిలారూపము అంత అందముగా అలాగే చూస్తూ ఉండిపోయేలా ఉన్నారు. వెంటనే అనేక శిల్పులను, నిర్మాణపనులు చేయువారిని రప్పించి, తానే స్వయముగా చూచుచూ దేవాలయ నిర్మాణమును గావించి తరించెను.

అందులో శ్రీ సీతారామ లక్ష్మణులను ప్రతిష్ఠించి పూజలు జరిపించసాగెను. కొంతకాలము పిదప ప్రజల చేత శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామివారిని ప్రతిష్ఠ చేసి పూజించసాగెను.

అటు తరవాత శ్రీ సద్గురు త్యాగరాజ స్వామివారు వడువూరు శ్రీరామచంద్రస్వామిని పూజించి తరించారు.

యాత్రీకులు శ్రీమన్నారు రాజగోపాలస్వామిని (మన్నారుగుడి) సేవించిన తరువాత వడువూరు శ్రీరామచంద్రులవారిని దర్శించి అనుగ్రహమును పొందెదరు.


తీర్థము : సరయూర్ పుష్కరిణి

విమానము : పుష్పక విమానము – "కోరినవారి కోర్కెలను తీర్చు వరప్రసాది" అను బిరుదము కలదు. కణ్వ మహర్షి, కులశేఖర ఆళ్వారులవారు స్వామివారిని సేవించి ముక్తిని పొందారు.

శ్రీ వైష్ణ సాంప్రదాయము వలె, ఇతరులు కూడా చూడవలసిన 108 దివ్యదేశములు, 19 పురాణ స్థలములు కలవు. ఇవిగాక శ్రీమన్నారాయణుని అభిమాన స్థలములు చూచి తరించాలి. అక్కడి స్వామివారు మానవులు కోరిన కోర్కెలను తీర్చుచున్నారు.

# శబరిగిరి అయ్యప్ప

- మహాభాష్యం నరసింహారావు



ఏడు కొండలపై తిరుమలలో కొలువు తీరి ఉన్న వైకుంఠవాసుడు శ్రీ వేంకటేశ్వరస్వామి వలె అయిదు కొండలపై శబరిగిరిపై హరిహర సుతుడైన అయ్యప్ప స్వామి కొలువై ఉన్నాడు. తిరుమలలో ఏడుకొండల స్వామి దర్శనం సంవత్సరంలో 365 రోజులు లభిస్తుంది. కానీ శబరిమల అయ్యప్ప దర్శనం సంవత్సరంలో కొన్ని ముఖ్య పర్వదినాలలో, నెల పూజలకు ప్రతినెలా 5 రోజులు నవంబరు 16 నుండి జనవరి 20 మధ్యకాలంలో 60 రోజులు మాత్రమే తెరచి వుంటుంది. (డిసెంబరు 27 నుండి 31 వరకు మూసి, జనవరి 1వ తేదీనాడు మరల తెరుస్తారు) అంటే 220 రోజులు మూసి ఉంటుంది. ఈ సంప్రదాయం కొన్ని వందల సంవత్సరముల నుండి శబరిమలలో కొనసాగుతోంది. బహుశా అయ్యప్పస్వామి మారుమూల అడవులు, కొండల మధ్య ఉండడం వలన, భక్తులు దీక్షాపరులై రావాలని నియమం ఉండడం వలన, వయసులో ఉన్న స్త్రీలు శబరిమల యాత్రకు రాకూడదని నియమం, చెప్పులు ధరించకుండా నడచి వెళ్ళడం వంటివి కూడా ఒక కారణంగా చెప్పవచ్చు.

కొందరు ఆధ్యాత్మిక చింతనాపరులు శబరిమల అయ్యప్పస్వామి బ్రహ్మచర్యదీక్షలో ఉండి పట్ట చిందాసనంలో కూర్చుని ఎప్పుడూ ధ్యానముద్ర (తపస్సు)లో ఉంటారు, అందుకు స్వామివారికి ఏకాంతం కలగజేయాలని దేవాలయాన్ని ఎక్కువకాలం మూసి ఉంచుతారని కూడా చెబుతారు. ఏది ఏమైనా ఈమధ్య దైవం పట్ల భక్తి పెరిగిందో, లేక భయం పెరిగిందో చెప్పలేము కానీ భక్తులు విపరీతంగా అన్ని దేవాలయాలను సందర్శిస్తున్నారు. తిరుమలలో అయితే శ్రీనివాసునికి నిద్రపోవడానికి కూడా అవకాశం ఇవ్వకుండా భక్తులు రాత్రి పగలు తేడా లేకుండా 365 రోజులు క్యూలైన్లలో నిలబడి గోవింద నామస్మరణం చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

శబరిమలలో మాత్రం నవంబరు 16 నుండి జనవరి 20వ తేదీ మధ్యకాలంలో మండల దీక్ష (41 రోజులు) చేసిన స్వాములు ఇరుముడి తలపై ఉంచుకొని లక్షల సంఖ్యలో అడవులు, కొండలు, ముళ్ళబాటల్లో పయనించి కాలినడకతో శబరిమల యాత్రకు వెళ్ళి స్వామిని దర్శిస్తారు.

మండలపూజ, జ్యోతి దర్శనానికి అరవై రోజుల కాలంలో సుమారు 5 కోట్లమంది స్వాములు శబరిగిరి నాథుడైన అయ్యప్పస్వామిని దర్శిస్తారని దేవాలయం లెక్కలు తెలియజేస్తున్నాయి. ఎక్కడా లేని విధంగా శబరిమల సన్నిధానంలో పదునెనిమిది మెట్లు (పదునెట్టాంబడి) ఎక్కి మణికంఠుని దర్శించుకోవాలని నియమం ఉండబట్టే మండలదీక్ష చేసి, ఇరుముడిని తలపై పెట్టుకొని యాత్ర చేసే పద్ధతి పురాతన కాలం నుండి కొనసాగుతోంది. ఇరుముడిలో ముద్రకాయలో తెచ్చిన ఆవునేతిని స్వామివారికి అభిషేకించడం శబరిమలలో ప్రత్యేకత. అందుకే స్వామివారిని "నెయ్యభిషేక ప్రియనే శరణమయ్యప్ప" అని కీర్తిస్తారు.

తరువాత అక్కడ కొన్ని టన్నుల కర్పూరాన్ని స్వాములు తెచ్చి శబరిమలలో నిత్యం వెలిగిస్తారు. అందుకే అయ్యప్ప స్వామి వారిని "కర్పూర ప్రియనే శరణమయ్యప్ప" అని కూడా కీర్తిస్తారు. నిత్యం అక్కడ ముద్రకాయలో ఆవునెయ్యి అంటుకున్న కొబ్బరిచిప్పలను అక్కడ నిత్యాగ్నిహోత్రంలో (హోమకుండం) ఆహుతి చేస్తారు. కర్పూరం వెలిగించడం వలన, హోమకుండంలో మండే ఆవునేతి కొబ్బరిచిప్పలవలన అక్కడ వాతావరణ కాలుష్య సమస్య అనేది కానరాదు. లక్షల సంఖ్యలో అయ్యప్ప స్వాములు అక్కడకు చేరి తిన్నా తినకపోయినా, ఎక్కడ కూర్చున్నా, పడుకున్నా పరిసరాలు శుభ్రంగా లేకపోయినా అంటువ్యాధులు వంటివి సోకవు. నిత్యం

విబూది రాసుకోవడం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. అందుకే అయ్యప్ప స్వామిని సర్వరోగ నివారణ ధన్వంతరమూర్తిగా కొనియాడుతారు.

అడవులలో, కొండలలో రకరకాల ఔషధ మొక్కలు, చెట్లు ఉంటాయి. దీక్షాపరులైన స్వాములు దీక్షలో, యాత్రలో చొక్కాలు, బనీన్లు ధరించరు. ఔషధ చెట్ల గాలి, శరీరానికి తాకడం వలన, శుద్ధమైన గాలిని పీల్చడం వలన ఆరోగ్యం చేకూరుతుంది. పంపానది కూడా అడవులు, కొండలు మీదుగా ప్రవహిస్తూ రకరకాల శిలాజాలను, ఔషధ మొక్కల్ని తాకుతూ ప్రవహించడం వలన యాత్రలో 70 కిలోమీటర్లు దూరం ఎరుమేలి నుండి వనయాత్ర చేసివచ్చిన స్వాములు పంపానదిలో స్నానం చేయగానే కాళ్ళనొప్పులు కానీ ఒళ్లు నొప్పులు కానీ ఉండవు. అందుకే పంపా స్నానం గంగా స్నానం వలె ఎంతో పవిత్రమైనదిగా చెబుతారు. పంపానది నీరు త్రాగడం వల్ల అక్కడ ప్రకృతి వాతావరణం ఆరోగ్యాన్ని కలిగిస్తుంది.

మండల దీక్షలో కఠిన బ్రహ్మచర్యం పాటించి, నేలపై పడక, ప్రతిరోజు రెండుపూటలా చన్నీటి స్నానం, దైవానికి దీపారాధన, పూజలు, భజనలు చేయడం, ఒక్కపూట భోజనం, రెండవపూట అల్పాహారం (సాత్వికాహారం) తినడం, అసత్యమాడకుండా ఉండడం, దుర్వ్యసనాలకు దూరంగా ఉండడం వలన ఆరోగ్యంతో పాటు మంచి క్రమశిక్షణ అలవడుతుంది. దీక్షానంతరం శబరిమల యాత్ర ముగిశాక కూడా దీక్షా నియమాలలో కొన్నిటిని పాటించినా సన్మార్గుడుగా మెలిగి ఉత్తమ పౌరుడిగా పేరు తెచ్చుకొని సంఘానికి ఉపయోగపడితే జన్మ సార్థకమవుతుంది. దీక్ష, యాత్ర చేసిన ఫలితం దక్కుతుంది.

**ఓమ్ స్వామియే శరణమయ్యప్ప**

# వింతైన పద్యం

**- సంపత్ కుమార్**

**ఈ** సీస పద్యం అచ్చమైన పొడుపు కథ. దీనిని ప్రౌఢరాయల ఆస్థానకవి ఎవరో రచించి ఉంటారు. ఎనిమిది ప్రశ్నలు, వాటికి జవాబులు ఈ చాటువులో కవి పొందుపరచాడు.

**రాముదెవ్వానితో రావణు మర్దించె?**
**పర వాసుదేవుని పట్నమేది?**
**రాజమన్నారుచే రంజిల్లు శరమేది?**
**వెలయ నిమ్మపండు విత్తువేది?**
**అల రంభ కొప్పులో అలరు పూదండేది?**
**సభవారి నవ్వించు జాణ ఎవడు?**
**సీత పెండ్లికి ఓలి చేసిన విల్లేది?**
**శ్రీ కృష్ణుడే యింట చెలగుచుండు?**
**అన్నిటను జూడ ఐదేసి యక్షరములు**
**ఈవ లావాల జూచిన నేక విధము**
**చదువు నాతడు "భావజ్ఞ చక్రవర్తి"**
**లక్షణోపేంద్ర ప్రౌఢరాయ క్షితీంద్ర!"**

పై పద్యంలో మొదటి ఎనిమిది పాదాల ప్రశ్నలు. తదుపరి రెండు పాదాలు వాటి జవాబులు తెలిపే సూచికలు (క్లూస్). మూడవ పాదం ఎవరైతే జవాబులు చెబుతారో వారిని "భావజ్ఞ చక్రవర్తి" అని పిలవాలని, నాల్గవపాదం ప్రౌఢరాయల సంబోధన.

**ఇక జవాబుల సూచికలు -**

ప్రతి జవాబుకి ఐదు అక్షరాలుంటాయి. ముందునుంచి, వెనుకనుంచి చదివినా ఒకేలా ఉంటాయి

(ఉదా: "కిటికి" వలె).

1. రాముడు ఎవరి సహాయంతో రావణుని చంపాడు?
2. వాసుదేవుని పట్నం పేరు ఏమిటి?
3. రాజమన్నారు అనే చేతిలో బాణం ఏమిటి? (శరము=బాణం)
4. నిమ్మపండు విత్తనం పేరు ఏది?
5. రంభ జడలో పెట్టుకొన్న పూలదండ పేరు?
6. సభలో నవ్వించే కవిపేరు ఏది?
7. సీత పెండ్లికి శుల్కంగా పెట్టిన విల్లు ఏది? (ఓలి=శుల్కం)
8. శ్రీకృష్ణుడు ఎవరి ఇంట పెరిగాడు?

**ఈ క్రింది జవాబులు చూడండి.**

1. తోకమూకతో (వానరాలకి ఇంకొక పేరు)
2. రంగనగరం (శ్రీరంగం)
3. లకోల కోల (కోల=బాణం)
4. జంబీర బీజం (జంబీరం=నిమ్మపండు. బీజం=విత్తనం)
5. మందార దామం (దామం అంటే దండ)
6. వికటకవి (హాస్యకవి తెనాలి రామకృష్ణుడు)
7. పంచాస్య చాపం (శివుని విల్లు)
8. నంద సదనం (నందుని ఇల్లు)

పై జవాబు ఐదు అక్షరాలతో ఎటునుంచి చదివినా ఒకేలా ఉంటాయి. అదే ఈ చాటుపద్యంలోని చమత్కారం. ఇట్టి చాటువుల ద్వారా భాషాజ్ఞానం, పదజ్ఞానం వృద్ధి చెందుతాయి. ఇలాంటివి ఇంకా చదవాలని కుతూహలం పెంచుతాయి. పెద్దలు చదివి పిల్లలకు కూడా తెలుపగలరు.

# మహిమాన్విత
# పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం

- ఆచార్య నేతి అనంతరామ శాస్త్రి

*ఆధ్యాత్మిక ప్రపంచంలో విశిష్ట స్థానాన్ని పొందిన మన భారతదేశంలో ఎన్నో పుణ్యక్షేత్రాలున్నాయి. ప్రత్యేకంగా శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం లేని ఊరంటూ దాదాపు లేదనే చెప్పవచ్చు. త్రేత, ద్వాపర యుగాల ప్రతీకలైన రామాయణ, భారతేతిహాసాల్లో మనకు ముఖ్య కథానాయకునిగా కనిపిస్తూ, చిరంజీవిగా కలియుగంలోనూ, ప్రతి ఇంటా ఆరాధ్య దైవమై పూజలందుకుంటున్నాడు.*

**"యత్ర యత్ర రఘునాథ కీర్తనం తత్ర తత్ర కృతమస్తకాంజలిం"**

ఎక్కడైతే రామనామ కీర్తనం చేయబడుతుందో, అక్కడ రామదూతయైన శ్రీ ఆంజనేయుడు చేతులు జోడించి నిలిచి ఉంటాడు. అలా తన యావజ్జీవితమూ రామసేవకే అర్పించాడు. నవవ్యాకరణ బ్రహ్మ, అజేయ పరాక్రమశాలి, దశగ్రీవ వంశనాశనకర్త, లక్ష్మణ ప్రాణదాత, స్మరణ మాత్రమున భయాలు పోగొట్టే అభయప్రదాత అయిన శ్రీ ఆంజనేయస్వామి పంచముఖావతారం చూచినవారికి ఆ స్వామి ఆశీస్సులచే అన్ని శుభాలూ చేకూరగలవు.

శ్రీ రాఘవేంద్ర గురుదేవులు వెలసి, ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయానికి ఉత్తర దిక్కున తుంగభద్రానదికి ఆవల కర్ణాటక రాష్ట్రంలో ఈ పంచముఖావతార శ్రీ ఆంజనేయస్వామి దేవాలయమున్నది. ఇది గిలేసూసురు మండలం పరిధిలోని గాణధాళ గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ క్షేత్రానికి మంత్రాలయం, ఎమ్మిగనూరు, రాయచూరు, మాన్వి పట్టణాల నుండి బస్సు సౌకర్యం కలదు. ఇక ప్రైవేటు వాహనాల సంగతి చెప్పే పనేలేదు. ఈ క్షేత్రానికి దగ్గరలోనే రాజోలిబండ ఎడమకాలువ ఏడాదిలో 11 నెలలపాటు నీటితో నిండి ఉంటుంది. దేవస్థానం దిగువన దాలు కట్టించిన సత్రాలు ఉన్నాయి.

శ్రీ పంచముఖాంజనేయుని వ్యావహారికంగా భీమవాయుడని, ప్రాణేశుడని, ప్రాణదేవుడని, దూళయ్య అని




పలురకాల పేర్లతో పిలుస్తారు. 16వ శతాబ్దిలో శ్రీ రాఘవేంద్రస్వామి ఈ క్షేత్రంలో 12 సంవత్సరాలు తపస్సు చేసినట్లు శిలాఫలకంపై వ్రాయబడి ఉంది. దీనిని బట్టి ఈ క్షేత్రం వెలుగులోకి వచ్చి దాదాపు 400 సంవత్సరాలు

పైబడినట్లుగా భావించవచ్చు. ప్రతి శనివారం, మంగళవారం, అమావాస్య పర్వదినాల్లో ఈ క్షేత్రం క్రిక్కిరిసిన భక్తులతో నిండి ఉంటుంది. భక్తులు తమ కొత్త వాహనాలను ఈ క్షేత్రానికి తీసుకొని వచ్చి పూజలు చేయించుకుంటారు. ఇక్కడ వైశాఖ, శ్రావణ మాసాల్లో వివాహాలు, కేశఖండనాది శుభకార్యాలు జరుగుతాయి. యాత్రికులకు సౌకర్యంగా సత్రాలు, నీటి వసతి ఉంది. అంతేగాక కొండగుట్టలతో నిండి, చెట్లు చేమలతో క్షేత్ర పరిసరాలన్నీ ఉండటంతో ఈ క్షేత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

విశేషమేమంటే కూర్చుని ఉన్న ఆంజనేయుడు ఉన్న ఈ క్షేత్రం విశేష మహిమలు కలదిగా చెప్పబడుతోంది. నిలుచున్న గణపతి విగ్రహం, కూర్చుని దర్శనమిస్తున్న ఆంజనేయస్వామి ఉన్న క్షేత్రాలు అరుదుగా ఉంటాయి. ఆ విధంగా ఉన్న క్షేత్రాలు మహిమాన్విత క్షేత్రాలు. ఇక్కడ శ్రీ ఆంజనేయస్వామిని సేవిస్తే కోర్కెలన్నీ తీరుతాయని చెప్తారు. అందువల్లనే ఈ పంచముఖ శ్రీ ఆంజనేయస్వామి క్షేత్రం మహిమాన్విత క్షేత్రంగా పేరుపొందింది. ఈ క్షేత్రజ్ఞుడైన శ్రీపంచముఖ ఆంజనేయస్వామి భక్తజన మనోభీష్టదాయకుడై అలరారుచున్నాడు. మండలం రోజులు స్వామివారిని సేవిస్తూ దేవాలయపు దక్షిణ భాగంలో నున్న తులసికోట వద్ద పవళిస్తే స్వామివారు కలలో కనిపించి తలచిన కోర్కెలు సిద్ధింపచేస్తారని అనుభవజ్ఞులు చెప్తారు. దేవాలయానికి ఉత్తరదిక్కున కొంతదూరంలో మూడు భారీ శిలల క్రింద క్షేత్రపాలకురాలైన 'ఎరుకలాంబగుడి' ఉంది. శక్తి స్వరూపిణియైన ఈమెకు ప్రతియేటా కొల్హాపూర్, పూనా నుండి అనేకమంది భక్తులు వచ్చి గాజులు, చీరె సారెలతో పూజలు చేసుకొని వెళతారు. స్వామివారు విశ్రమించినట్లు చెప్పబడుతున్న శిలాసానువు, బిలమార్గం ఉన్నాయి.

శ్రీ పంచముఖ ఆంజనేయ స్తోత్రం నిత్యం పారాయణ గావించినవారికి, ఆయురారోగ్యైశ్వర్యములు చేకూరి ప్రశాంతజీవనం సాగించగలరు. ఈ క్షేత్ర పరిసరాల్లో ఆయుర్వేద వైద్యానికి పనికివచ్చే మూలికలు కూడా కలవని కొంతమంది వైద్యులు చెప్పారు. దేవాలయం ముందున్న గోణియాకు చెవిటివారికి దివ్యౌషధంగా పని చేస్తుందని చెప్తారు. ఆ ఆకును కొంత సేకరించి స్వామివారి పాదాలపై ఉంచి, పూజానంతరం దాన్ని నూరి మంచినూనెలో ఉడికించి వడగట్టి దానిని రోజూ మూడు చుక్కలు చెవులలో వేసినచో త్వరితంగా చెవుడు మాయమై, వినికిడిన కలిగిస్తుందని చెప్తారు. అంతేగాక ఇంకా ఇక్కడ ఆరోగ్యప్రదాయకాలగు మూలికలు ఈ క్షేత్ర పరిసరాల్లో లభిస్తాయని స్థానికులు చెబుతారు.





ప్రతి శనివారం మరియు పర్వదినాల యందు స్వామివారికి కవచం తొడిగి పూజ చేస్తారు. ప్రతి చైత్రశుద్ధ నవమి అంటే శ్రీరామనవమి రోజున స్వామివారి రథోత్సవం జరుగుతుంది. అమావాస్య రోజు భక్తులు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి వచ్చి స్వామివారిని సేవిస్తారు. ఆ పర్వదినం నాడు రాత్రంతా శ్రీరామ నామ స్మరణతో భజన చేస్తారు. ఆ రోజు క్షేత్రం క్రిక్కిరిసి జాతరను తలపిస్తుంది. మార్గశిర త్రయోదశినాడు హనుమద్వ్రతం జరుగుతుంది. వచ్చిన భక్తులకు 13 ముడులు వేసిన దారాలను ఇస్తారు. వాటిని ధరిస్తే భూత, ప్రేత, పిశాచాల భయం ఉండదని నమ్మకం. కార్తీకమాసంలో దేవాలయం దీపాలతో దేదీప్యమానంగా వెలుగుతుంటుంది. మార్గశిర మాసంలో నవమి నుండి పూర్ణిమ వరకు లక్ష తులసీదళార్చన, సహస్రనామాలతో హోమం జరుగుతుంది. ఇదేగాక ప్రతిరోజు రెండుసార్లు అర్చన, మంగళహారతులు ఇస్తారు. దసరా పర్వదినాన స్వామివారిని పల్లకీలో కూర్చుండబెట్టి తుంగభద్రానదికి తీసుకుని వెళ్ళి గంగపూజ చేసి స్వామివారిని ఊరేగిస్తారు.

ఎన్నో తాయెత్తులను స్వామివారి వద్ద ఉంచి, పూజానంతరం వాటిని ధరించిన సంతానహీనులకు సంతానం, దీర్ఘవ్యాధుల నివారణ జరిగిన దాఖలాలు ఉన్నాయి. ఈ ప్రకారం ఎవరి శక్త్యానుసారం వారు స్వామివారిని సేవించి, తమ కోర్కెలను నెరవేర్చుకొని పంచముఖాంజనేయుని మనసా, వాచా, కర్మణా కొలిచి అపార కరుణకు పాత్రులవుతారు. కాబట్టి అందరూ జీవితంలో ఒక్కసారైనా దర్శించదగ్గ క్షేత్రం ఈ పంచముఖి.

* * *



# రాశి ఫలితములు



## మేషరాశి

అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము.

ఈ రాశి స్త్రీ పురుషులకు వ్యాపార వ్యవహార లాభం. మానసిక ఒత్తిడి. బంధుమిత్రుల సమస్యలు - దూరప్రయాణములు - భార్య ఆరోగ్య సమస్యలు ఉన్నవి.

## వృషభరాశి

కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు శనివారపూజలు. శనికి తైలాభిషేకముల వ్యాపార లాభం. ఆర్థిక ఇబ్బందులు తొలగుట. భార్యా ఆరోగ్యం, గొడవలు తగ్గి ఆనందంగా, ఆన్యోన్యంగా ఉండగలరు.

## మిథునరాశి

మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1, 2, 3, 4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు జాగ్రత్తగా ఉండవలసిన సమయము. ప్రతి విషయంలో ఆచితూచి వ్యవహరించగలరు. హామీలు ఉండరాదు. షేర్స్‌లో నష్టములు రాగలవు. ఓం నమో నారాయణాయ 1008 సార్లు.

## కర్కాటకరాశి

పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు ఆకస్మిక ధనలాభము. ఆర్థిక సమస్యలు మెరుగు పడగలవు. వాహన సౌఖ్యము. ఆకస్మిక కలహాలు ప్రతి విషయంలో రాజమార్గం ఎంచుకొనగలరు. రాహుకేతుపూజలు.

## సింహరాశి

మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము,

ఈ రాశి స్త్రీ పురుషులకు స్వశక్తితో అనుకూలత. మాట పట్టింపులు. నిందలు రాగలవు. మీరు చాలా జాగ్రత్తలు తీసుకొనండి. ఫైనాన్స్ విషయంలో చాలా జాగ్రత్తలు. శనికి పూజలు చేయండి.

## కన్యారాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు.

ఈ రాశివారు నూతన ప్రయత్నాలు ఫలించగలవు. పిల్లల శుభకార్యాలు. విందు వినోదములు, ఆనందము. ఆందోళన ఉన్నది. వస్తువాహన యోగము. తొందరపాటు లేకుండా జాగ్రత్తగా ఆలోచన చేసి నిర్ణయం తీసుకొనండి. నిత్య పూజలే మీకు రక్ష.

## తులారాశి

చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.

ఈ రాశివారికి ప్రతివిషయంలో అసంతృప్తి, సంతృప్తి, అపరాదులు రాకుండా తక్కువ మాట్లాడగలరు. మీపైన ఎవరైన శత్రుత్వం పెంచుకొను సమయము తక్కువ మాట్లాడి ఎక్కువ పనులు చేసుకొనండి.

## వృశ్చికరాశి

విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.

ఈ రాశివారికి సామాన్య లాభములు. అధిక ఖర్చులు. చాలా జాగ్రత్తలు ఉండవలసిన సమయం. ఇంట్లో ప్రతిపక్షం. మౌనం వహించండి. తొందరపాటు తగదు.

## ధనూరాశి

మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.

ఈ రాశివారికి తెలియని అనుభూతి, విందువినోదములు. బంధుమిత్రుల కలయిక ఆర్థిక లాభము. అశుభ సమస్యలు. నూతన మిత్రులద్వారా ధనాదాయం, వ్యవహారలాభం. శనివారం శనికి తైలాభిషేకం.

## మకరరాశి

ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు.

ఈ రాశివారికి సామాన్య లాభము. ప్రతి విషయంలో కలుపుకోలుగా ఉండండి. కుటుంబంలో ఒకరికి అనారోగ్యము. ప్రయాణములలో కొన్ని అపశ్రుతులు ఉన్నవి. శకునంతో బయలు దేరండి. లక్ష్మీనారాయణ జపం.

## కుంభరాశి


ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.

ఈ రాశివారికి అనవసర విషయములతో చాలా జాగ్రత్త. కలసిరాని రోజులు. ప్రతి అడుగు జాగ్రత్తగా వేయండి. మాటలు తక్కువగా మాట్లాడగలరు. శనివారం శనికి తైలాభిషేకం చేయండి.

## మీనరాశి

పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1, 2, 3, 4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.

ఈ రాశివారికి అనుకూలముగా ఉంటుంది. ప్రతి విషయంలో నిర్లక్ష్యం లేకుండా సమయాన్ని వృథా కాకుండా చాకచక్యంగా మీ పనులు నెరవేర్చుకొనిన ఆకస్మిక ధనలాభం. లక్ష్మీపూజలు. శనికి తైలాభిషేకం.



# మీ విజ్ఞానం



నిర్వహణ: డా|| వాణి

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. కల్కి భగవానుని పేరేమిటి?
2. గీతాజయంతి ఎప్పుడు?
3. ధృతరాష్ట్రునికి భగవద్గీత తెలియ చేసిందెవరు?
4. శ్రీకృష్ణుడు ఏ రాక్షసుని నోటిలో చేతిని దూర్చి చంపివేశాడు?
5. వశిష్టుని వద్ద ఉన్న గోవు పేరేమిటి?
6. విశ్వామిత్రుడు ఎవరి కొడుకు?
7. హాథీరాం బావాజీ ఏ జాతివాడు?
8. 'పర్ణ ప్రసాదం' అంటే ఏమిటి?
9. శ్రీవారికి వెంగమాంబ వంశీకులు చేసే సేవ ఏది?
10. అనసూయ, అత్రిల కుమారుడెవరు?
11. విష్ణుమూర్తి గద పేరేమిటి?
12. ప్లక్ష వృక్షమంటే ఏమిటి?
13. 'దమం' అంటే ఏమిటి?
14. మంత్రాన్ని ఎవరితో పోలుస్తారు.
15. విశ్వామిత్రుని కథ రాముని‌తో ఎవరు చెప్పారు?

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు:

1. ఇంద్రద్యుమ్నుడు, 2. వరదరాజస్వామి, 3. నృసింహుడు, 4. వరాహస్వామికి, 5. కొప్పెర, 6. ఒక కుమ్మరి - భీముడు, 7. మాణిక్యవాచకర్, 8. సంజయునికి, 9. షేక్ హుస్సేన్ సాహెబ్, ః10. దుర్గాచరణుడు, 11. మైత్రేయ మహర్షికి, 12. ఏడు, 13. జయవిజయులను, 14. మంత్రం, 15. చెట్లను (లతలను)

1. ____________________
2. ____________________
3. ____________________
4. ____________________
5. ____________________
6. ____________________
7. ____________________
8. ____________________
9. ____________________
10. ____________________
11. ____________________
12. ____________________
13. ____________________
14. ____________________
15. ____________________

పేరు : ____________________

చిరునామా : ____________________

____________________

____________________

ఫోన్ : ____________________

## సరైన సమాధానాలు రాసినవారు:

1. అహల్యాదేవి, 2. నిష్ఠం సత్యనాగేంద్ర ప్రసాద్, 3. కె.ఎస్.ఎస్. లక్ష్మి, 4. పి. యశోద, 5. పి. విజయలక్ష్మి, 6.ఎం. విజయలక్ష్మి, 7. కె. విమలాదేవి

లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత:

**పి. యశోద**

మా చిరునామా: **శ్రీ వేంకటేశం**, ఆధ్యాత్మిక మాసపత్రిక

ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ,హైదరాబాద్-500007, ఫోన్: 040-27175050

# మానవత

- సంపత్ కుమార్

- ఏనుగు ఏదైనా ఊబిలో దిగబడితే మిగతా ఏనుగులు దాన్ని ఏదోవిధంగా బయటకు లాగాలని చూస్తాయి. ఆపదలో ఉన్న నేస్తాన్ని ఎలాగైనా కాపాడాలని సర్వవిధాలా శ్రమిస్తాయి.
- ఒక కాకి నేలకూలితే మిగతా కాకులు అక్కడికి గుంపుగా వెళతాయి. "కావు కావు" అంటూ దాన్ని రక్షించడానికి రకరకాలుగా ప్రయత్నిస్తాయి. అది సేవ, సహాయం. తోటి ప్రాణిని ఆదుకోవాలన్న తపన.
- సాటి జీవులకు సేవ చేయాలని ప్రకృతి మనకు ప్రబోధిస్తుంది. మన సంప్రదాయాలు మానవతా గుణాన్ని, సేవాభావాన్ని బోధిస్తున్నాయి.
- దేవ, పితృ, భూత, మనుష్య, బ్రహ్మ యజ్ఞాలు అయిదు ఉన్నాయి. వాటిని 'పంచమహాయజ్ఞాలు'గా చెబుతారు.

1. నెయ్యి వంటి హవిస్సును లేదా కనీసం ఒక సమిధను, దేవతల్ని తలచుకుంటూ అగ్నికి అర్పించడమే దేవయజ్ఞం.
2. పితృదేవతలకు పిండం కాని, జలం కాని సమర్పించడం పితృయజ్ఞం.
3. ప్రాణుల్లో కనిపించేవి, కనిపించకుండా ఉండేవి సృష్టిలో ఎన్నో ఉంటాయి. వాటికి ఆహారం పెట్టడం భూతయజ్ఞం.
4. అన్నం తినే సమయానికి ఎవరైనా మన వద్దకు వస్తే వారికి అన్నం పెట్టడమే మనుష్య యజ్ఞం.
5. ఏ కొంచెమైనా వేదం చదవడాన్ని బ్రహ్మయజ్ఞంగా పరిగణిస్తారు.

ఇవన్నీ మన భారతీయ సంస్కృతిలో భాగాలు. సంస్కృతి అంటే ఆదర్శప్రాయాలైన ఆచార వ్యవహారాలు. సంస్కృతి అనేది కేవలం బాహ్యమైన వేషభాషలకే పరిమితమైంది కాదు. మానవత, సత్యం, అహింస, దయ, పరోపకారం – ఈ అన్నింటిపైనా ఆధారపడి ఉండేదే భారతీయ సంస్కృతి. సంస్కృతీ సంస్కారం రెండూ ఒకటే. పంచ మహాయజ్ఞాలే మన సంస్కారాలు. దయ, క్షమ వంటి ఉత్తమ గుణాలు అలవరచుకోవడం, సర్వ సమదృష్టితో మనుగడ సాగించడం 'ఉత్తమ సంస్కృతి' లక్షణాలు. వీటిని శ్రద్ధగా అనుసరించకపోవడం సంస్కృతి ఔన్నత్యానికి భంగకరం.

సేవాధర్మమే భారతీయ కుటుంబ వ్యవస్థకు పునాది. కుటుంబం నుంచే మానసిక శక్తి, స్వచ్ఛత, శుభ్రత సంక్రమిస్తాయి. అందువల్ల కుటుంబ వ్యవస్థ అనేది 'సంస్కార కేంద్రం'. మన శాస్త్రాలు వసుధైక కుటుంబ భావన వ్యాప్తి గురించి ఎంతగానో చెబుతాయి. దీని వెనక 'సేవ' అనే ఉత్తమ భావం ఉంది.

రంతిదేవుడు దానశీలి. అతడికి భగవంతుడు ప్రత్యక్షమై 'ఏం కావాలో కోరుకో' అని అడిగాడు. 'నాకు భౌతిక సుఖాలేవీ అక్కర్లేదు. రాజ్యం వద్దు. స్వర్గవాసం అసలే వద్దు. పునర్జన్మ కూడా వద్దు' అన్నాడు రంతిదేవుడు. 'మరి నీ కోరిక ఏమిటి?' అని మళ్ళీ అడిగాడు దేవుడు. 'కష్టాల్లో ఉన్న దీనుల కన్నీరు తుడవాలన్నదే నా కోరిక. ఆ అవకాశం ఇవ్వు స్వామీ! అది ఒక్కటే చాలు నాకు' అని బదులిచ్చాడు రంతిదేవుడు. సేవాగుణానికి ఉన్న ప్రాధాన్యం అది.

భాగవతం, భారతం, రామాయణం మన సంస్కృతిని కథల రూపంలో వివరించే ఉత్తమ గ్రంథాలు. శ్రవణ కుమారుడి కథ 'జాతిపిత' గాంధీకి ఎంతగానో స్ఫూర్తినిచ్చింది. మిత్రుణ్ణి ఎలా గౌరవించాలన్నది శ్రీకృష్ణ, కుచేల కథ నేర్పుతుంది. జటాయువు అనే పక్షి కోసం కన్నీరు కార్చిన శ్రీరాముడి ఇతివృత్తం సానుభూతి ప్రాముఖ్యాన్ని తెలుపుతుంది. ఇవన్నీ మానవతలో అంతర్భాగాలే. ఇంటా బయటా సేవ వల్లనే వ్యక్తికి ముక్తి లభిస్తుందని పురాణాలు చెబుతాయి. సేవ, మానవత్వం అనే ఉదాత్త గుణాలను అవి పలు కథల రూపంలో విశదీకరిస్తాయి. 'వాపి, కూప, తటాక, ఆలయ, పథ' నిర్మాణాలు పుణ్యప్రదాలని పెద్దల మాట. పదిమందికీ ప్రయోజనకరంగా ఉండే జలాశయాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ దోహదపడాలి. అదే సేవాభావన. అదే ముక్తిమార్గం. అదే మానవతా గుణసంపన్నత అని శాస్త్రాలు మార్గనిర్దేశం చేస్తున్నాయి.

పొరుగువారిని ఆదుకున్నంత మాత్రాన 'నేనేదో గొప్ప పని చేస్తున్నాను' అనుకోవాల్సిన అవసరం లేదు. ప్రశంసల కోసం చేసేది అసలు సేవే కాదు. అది మానవత్వం అనిపించుకోదు. సాటివారి ఆర్తిని గ్రహిస్తే చాలు. కీర్తితో ఇక పని లేదు. మానవత అనే 'మతి' ఉంటే చాలు. లోకానికి మనిషి ఇచ్చే బహుమతి అంతకంటే మరేమీ ఉండదు.

* * *




*Editor, Publisher, Printer and owned by* **Pullagurla Sai Reddy.** *Published at:* H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. *Printed at:* Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : 93482 12354, Ph:040-27175050; E.mails: srivenkatesham@gmail.com, namo_venkateshaya@yahoo.com